జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శనివారం 31 అక్టోబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 244 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , కార్తీక మాసము , తిథి: తృతీయ - 25:08:31 వరకు నక్షత్రంకృతిక - 13:26:41 వరకు కరణంవణిజ - 14:38:41 వరకు, విష్టి - 25:08:31 వరకు పక్షంకృష్ణ యోగంవ్యతీపాత - 07:18:20 వరకు, వారీయన - 27:40:16 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com

జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనగణన

కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన

న్యూఢిల్లీ, అక్టోబర్ 30(ప్రజాజ్యోతి): భారతదేశ వ్యాప్తంగా 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనగణన మొదలవుతుందని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. అయితే ఎన్నికలు జరిగే ఉత్తరప్రదేశ్, మణిపూర్, గోవా, పంజాబ్, ఉత్తరాఖండ్‌లో

మిగతా 2లో..

మహారాష్ట్ర రాజకీయాల్లో కొత్త మలుపు?

ఫడ్నవీస్‌తో ఠాక్రే సోదరుల భేటీ!

ముంబయి, అక్టోబర్ 30(ప్రజాజ్యోతి): మహారాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్‌ఎస్) చీఫ్ రాజ్ ఠాక్రే ఒకే వేదికపై

మిగతా 2లో..

ఇజ్రాయెల్ ఎన్నికల తుది ఫలితాలు వెల్లడి

అతిపెద్ద పార్టీగా నెతన్యాహు ఆవిర్భావం

‘లికుడ్’ కూటమికి 53 స్థానాలు లభ్యం

ప్రభుత్వం ఏర్పాటుపై నెలకొన్న ఉత్కంఠ

న్యూఢిల్లీ, అక్టోబర్ 30(ప్రజాజ్యోతి): ఇజ్రాయెల్ సార్వత్రిక ఎన్నికల తుది ఫలితాలను ఆ దేశ కేంద్ర ఎన్నికల కమిటీ శుక్రవారం ప్రకటించింది. బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని కూటమికి 53 స్థానాలు లభించాయి. ఆయన నేతృత్వంలోని లికుడ్ పార్టీ 27 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. యషార్ పార్టీ 21 స్థానాలతో రెండో స్థానంలో నిలిచింది. ప్రతిపక్ష కూటమికి 48 సీట్లు రాగా, అరబ్ పార్టీలకు 19 స్థానాలు దక్కాయి. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 61 స్థానాల మెజారిటీ ఏ కూటమికీ

మిగతా 2లో..

రైతులకు గుడ్ న్యూస్..

పీఎం కిసాన్ నిధులు విడుదల

రైతుల ఖాతాలో రూ.2 వేలు జమ

విడుదల చేసిన ప్రధాని మోదీ

బనాస్కాంత, అక్టోబర్ 30(ప్రజాజ్యోతి): దీపావళి పండుగ వేళ దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. రైతులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన 24వ విడత నిధులను ప్రధాని మోదీ విడుదల చేశారు. గుజరాత్‌లోని బనస్కాంత జిల్లాలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాని మోదీబటన్ నొక్కి, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి ఈ మొత్తాన్ని జమ చేశారు. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ సమాచారం ప్రకారం, ఈ 24వ విడత కింద దేశవ్యాప్తంగా 9.34 కోట్లకు పైగా అర్హులైన రైతు కుటుంబాలకు రూ. 2,000 చొప్పున జమ అయ్యాయి. ఈ విడత ద్వారా ప్రభుత్వం మొత్తం రూ. 18,680 కోట్లకు పైగా బదిలీ చేసింది. ఈ పథకం కింద ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రూ. 2,000 చొప్పున, ఏడాదికి మొత్తం మూడు వాయిదాలలో రూ. 6,000 ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తున్న సంగతి తెలిసిందే.

మియాపూర్‌లోని 550 ఎకరాల భూములను కొల్లగొట్టేందుకు కేసీఆర్, ఆయన బంధువులు అనేక రకాలుగా ప్రయత్నించారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. భూములను కొట్టేసేందుకు గోల్డ్‌స్టోన్ ప్రసాదరావు ప్రయత్నించారన్న ఆయన ఈ భూముల విషయంలోనే బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ దామోదరరావుకు ప్రసాదరావు ఖరీదైన కారు బహుమతిగా ఇచ్చారని అన్నారు.

సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు

చరిత్రాత్మకం

మియాపూర్ భూములపై సరైన తీర్పు

ప్రజాప్రయోజనాలకే వాటిని ఉపయోగిస్తాం

వాటిని అమ్మి విద్యావ్యవస్థ బలోపేతం చేస్తా

భూములు కొట్టేసేందుకు కేసీఆర్ ప్రయత్నం

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, అక్టోబర్ 30(ప్రజాజ్యోతి): మియాపూర్ భూములపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములను కాపాడే ప్రయత్నం చేయలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మియాపూర్‌లో 550 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు గతంలో ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. ధరణి రికార్డులను తారుమారు చేసి భూములను ఆక్రమించుకోవాలని చూశారని విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే భూ ఆక్రమణలపై పోరాటం చేశానని రేవంత్ రెడ్డి తెలిపారు. మియాపూర్ భూముల విషయంలో గతంలో ప్రభుత్వానికి అనుకూలంగా బలమైన వాదనలు వినిపించలేదని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అంశంపై సమర్థంగా వాదనలు వినిపించామని పేర్కొన్నారు. మియాపూర్ భూములను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. అవసరమైతే మియాపూర్

మిగతా 2లో..

హైస్పీడ్ రైళ్ల పనులు వేగవంతం చేయాలి

- అలైన్‌మెంట్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి
- రైల్వేశాఖ మంత్రిని కోరిన సీఎం రేవంత్ రెడ్డి
- మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన సీఎం రేవంత్
- రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులపై చర్చ

హైదరాబాద్, అక్టోబర్ 30 : తెలంగాణకు ప్రకటించిన హైస్పీడ్ రైళ్ల పనులు వేగవంతం చేయాలని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్ – పుణె, హైదరాబాద్ – బెంగళూరు, హైదరాబాద్ – చెన్నై కారిడార్ల కోసం కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు కొన్ని మార్పుల్ని సూచిస్తూ పంపినట్లు సీఎం వివరించారు. కేంద్ర ప్రభుత్వం అలైన్‌మెంట్ ఆమోదిస్తే భూ సేకరణను ప్రారంభిస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. సాధ్యమైనంత త్వరగా అలైన్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. దిల్లీ రైలు భవన్‌లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను

మిగతా 2లో..

సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్..

ఒక్కొక్కరికి గరిష్ఠంగా 1,10,250 కేటాయింపు

నవంబర్ 5న అర్హులైన కార్మికులకు అందజేత

హైదరాబాద్, అక్టోబర్ 30(ప్రజాజ్యోతి): పండగకు ముందు సింగరేణి కార్మికులకు శుభవార్త.. అయితే ఇప్పటికే దసరా బోనస్‌తో సంతోషంలో ఉన్న కార్మికులకు యాజమాన్యం దీపావళికి మరో శుభవార్త అందించింది. దీపావళి సందర్భంగా భారీ మొత్తంలో బోనస్ చెల్లించనుంది. నవంబర్ 5వ తేదీన అర్హులైన కార్మికుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు ప్రకటించింది. ఈసారి దీపావళి బోనస్ కోసం ఏకంగా రూ.419 కోట్లను కేటాయించారు. సింగరేణిలో పనిచేస్తున్న సుమారు 38 వేల మంది కార్మికులకు ఈ బెనిఫిట్స్ అందనుంది. అర్హత ఉన్న ఉద్యోగుల్లో ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ.1,10,250 వరకు అందనుంది. తెలంగాణ డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఈ చెల్లింపులు చేపడుతున్నట్లు

మిగతా 12లో..

ఉత్తరాఖండ్‌లో కూలిన

హెలికాప్టర్

ఘటనలో ఆరుగురు మృతి

జోషిమఠ్, అక్టోబర్ 30(ప్రజాజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్ సమీపంలో ఒక ప్రైవేట్ హెలికాప్టర్ కూలిపోయింది. బద్రీనాథ్ నుంచి డేహ్రాడూన్ వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు చనిపోయినట్లు ఉత్తరాఖండ్ సివిల్ ఏవియేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ (యూసీఏడీఏ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. ఉత్తరాఖండ్‌లోని ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్లే ఈ ఘటన జరిగి ఉండవచ్చునని అధికారులు భావిస్తున్నారు. ఉత్తరాఖండ్ విపత్తు నిర్వహణ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2:20 గంటల సమయంలో చమోలి జిల్లా జోషీమఠ్ పరిధిలోని ‘చాయ్’ గ్రామ సమీపంలోకి రాగానే హెలికాప్టర్ కమ్యూనికేషన్‌ను కోల్పోయింది. అనంతరం ట్రాకింగ్ సిస్టమ్‌కు సమాచారం రావడం ఆగిపోయింది. జేపీ పవర్ హౌస్ సమీపంలో ఉన్న ఒక కొండను బలంగా ఢీకొట్టి ఉండవచ్చునని

మిగతా 12లో..

హైదరాబాద్‌ను ముంచెత్తిన

భారీ వర్షం

పలు ప్రాంతాల్లో తీవ్రంగా ట్రాఫిక్ జామ్

గంటల తరబడి నిలిచిపోయిన వాహనాలు

పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం

అప్రమత్తమైన టీజీఎస్పీడీసీఎల్ సిబ్బంది

హైదరాబాద్, అక్టోబర్ 30(ప్రజాజ్యోతి): హైదరాబాద్ ప్రజలకు వరుణుడు భారీ ఊరట కల్పించాడు. నగరంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తుంది. ప్రస్తుతం శంషాబాద్, రాజేంద్రనగర్, కూకట్‌పల్లి ఏరియాల్లో భారీ వర్షం కురుస్తోంది. అలాగే కాప్రా,

మిగతా 12లో..

కృష్ణ-గోదావరి బేసిన్ వివాదంపై స్పష్టత

మధ్యవర్తిగా జస్టిస్ రంజనా ప్రకాశ్ నియామకం

కీలక నిర్ణయం తీసుకున్నసుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ, అక్టోబర్ 30(ప్రజాజ్యోతి): కృష్ణా- గోదావరి (కేజీ) బేసిన్ గ్యాస్ వివాదానికి సంబంధించి దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇతరుల మధ్య ఉన్న కేజీ బేసిన్ గ్యాస్ తరలింపు వివాదానికి సంబంధించి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్‌ను ఏకైక మధ్యవర్తిగా నియమించింది. ఈ మధ్యవర్తిత్వానికి అన్ని పక్షాలు పూర్తి సహకారం అందిస్తామని

మిగతా 2లో..

భారత నౌకాదళం మరో కీలక ఘనత

ఐఎన్ఎస్ విక్రాంత్‌పై రఫేల్ ఫైటర్ జెట్ ల్యాండింగ్!

న్యూఢిల్లీ, అక్టోబర్ 30(ప్రజాజ్యోతి): భారత నౌకాదళం మరో కీలక ఘనత సాధించింది. దేశీయంగా నిర్మించిన విమాన వాహక యుద్ధనౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌పై ఫ్రాన్స్‌కు చెందిన రఫేల్ మెరైన్ యుద్ధవిమానం తొలిసారిగా విజయవంతంగా

మిగతా 2లో..

రాష్ట్రంలో బియ్యం కొరత లేదు

కిలో బీపీటీ బియ్యం 66కే అమ్మాలి

బియ్యం ధరలపై మంత్రి ఉత్తమ్

ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష

హైదరాబాద్, అక్టోబర్ 30(ప్రజాజ్యోతి): సాధారణంగా వినియోగించే బీపీటీ బియ్యం కిలో ధరను రూ.66గా ఉంచే అంశంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆర్ఎన్ఆర్ బియ్యం ధరను నాణ్యత, ఉత్పత్తి వ్యయాల ఆధారంగా సమీక్షించనున్నారు. అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలపై 5 శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రధాన మార్కెట్లలో దాడులు చేపట్టి ఇప్పటివరకు 12 కేసులు నమోదు చేశారు. రాష్ట్రంలో బియ్యం నిల్వలు సరిపడా ఉన్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

మిగతా 12లో..

సంపాదకీయం

ప్రతి నీటి చుక్కా విలువైనదే..!

ఎల్ నినో ప్రభావంతో హైదరాబాద్ మహానగరానికి తాగునీటి సమస్య ముప్పు పొంచి ఉందా? నగరానికి నీటిని అందించే ప్రధాన జలాశయాల్లో నిల్వలు రోజురోజుకూ తగ్గుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లో నీటి మట్టాలు పడిపోతుండగా.. మంజీరా, సింగూరు జలాశయాల్లోనూ నిల్వలు గణనీయంగా తగ్గాయి. కృష్ణా ప్రాజెక్టుల నుంచి వచ్చే నీరు కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ప్రస్తుతం గోదావరి జలాలే నగరానికి ప్రధాన ఆధారంగా మారాయి. మరోవైపు భూగర్భ జలాలు అడుగంటడం, ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతుండటం పరిస్థితి తీవ్రతను సూచిస్తున్నాయి. హైదరాబాద్‌కు ప్రధానంగా ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాలతో పాటు మంజీరా, సింగూరు, కృష్ణా, గోదావరి ప్రాజెక్టుల నుంచి తాగునీరు సరఫరా అవుతోంది. అయితే ప్రస్తుతం ఈ వనరుల్లో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టాయి. ఉస్మాన్‌సాగర్: 3.9 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి ప్రస్తుతం 2 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. హిమాయత్‌సాగర్: 4.2 టీఎంసీల సామర్థ్యానికి 2 టీఎంసీల నిల్వ ఉంది. మంజీరా: 1.50 టీఎంసీల సామర్థ్యానికి కేవలం 0.19 టీఎంసీల నీరే అందుబాటులో ఉంది. సింగూరు: 29.91 టీఎంసీల సామర్థ్యానికి 3.029 టీఎంసీల నిల్వ మాత్రమే ఉంది. కృష్ణా ప్రాజెక్టుల నుంచి కూడా ప్రస్తుతం పరిమితంగానే నీరు అందుతోంది. ఈ నేపథ్యంలో గోదావరి జలాలు, ముఖ్యంగా ఎల్లంపల్లి నుంచి వస్తున్న నీరు నగరానికి కీలకంగా మారింది. జలాశయాల్లో ఉన్న నీటిని ఎక్కువ కాలం వినియోగించుకునేలా జలమండలి సరఫరాను క్రమబద్ధీకరిస్తోంది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నుంచి రోజుకు 40 ఎంజీడీల నీటిని సరఫరా చేయాల్సి ఉండగా.. ప్రస్తుతం 27 ఎంజీడీలకు తగ్గించినట్లు సమాచారం. అందుబాటులో ఉన్న నిల్వలను సుమారు 360 రోజులకు సరిపడేలా వినియోగించుకోవాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. నగరంలో సుమారు 14.50 లక్షల నీటి కనెక్షన్లు ఉన్నాయి. రోజుకు దాదాపు 560 మిలియన్ గ్యాలన్ల నీరు అవసరమవుతోంది. అయితే ఉపరితల జల వనరులతో పాటు భూగర్భ జలాలపైనా ఒత్తిడి పెరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు 11 మీటర్లకు పైగా పడిపోయినట్లు అంచనాలున్నాయి. 1,200 అడుగుల లోతు వరకు బోర్లు వేసినా నీరు పడని పరిస్థితులు కొన్ని చోట్ల కనిపిస్తున్నాయి. ట్యాంకర్లకు డిమాండ్ కూడా పెరుగుతోంది. గతంలో రోజుకు సుమారు 6 వేల ట్యాంకర్ల బుకింగ్‌లు ఉండగా.. ఇటీవల రెండు రోజులుగా ఈ సంఖ్య 8 వేలకు చేరినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో నల్లా నీటి సరఫరాపైనా ప్రభావం పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో సరఫరా కోతలు ఉన్నాయనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. హైదరాబాద్‌లోని 22 నియోజకవర్గాల పరిధిలో నగరం విస్తరించి ఉంది. వీటిలో తొమ్మిది నియోజకవర్గాల పరిధిలోని ప్రాంతాలకు మంజీరా పైపులైన్ల ద్వారా తాగునీరు అందుతోంది. మంజీరా నుంచి సరఫరాకు అంతరాయం ఏర్పడితే పలు ప్రాంతాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాల్లో ఇప్పటికే భూగర్భ జలాల కొరతతో ట్యాంకర్లపై ఆధారపడుతున్న వారి సంఖ్య పెరిగింది. మంజీరా సరఫరా నిలిచిపోతే కూకట్‌పల్లిలోని కేపీహెచ్‌బీ, భరత్‌నగర్, మూసాపేట ప్రాంతాలు ప్రభావితమయ్యే ప్రమాదం ఉంది. అలాగే పటాన్‌చెరు నియోజకవర్గం, ఖైరతాబాద్‌లోని ఎర్రమంజిల్, సోమాజిగూడ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లోని యూసుఫ్‌గూడ, బోరబండ ప్రాంతాలపైనా ప్రభావం పడవచ్చు. కార్వాన్‌లోని షేక్‌పేట, టోలీచౌకీ, సనత్‌నగర్‌లోని అమీర్‌పేట, సనత్‌నగర్, రాజేంద్రనగర్‌లోని కిస్మత్‌పూర్, నార్సింగి, కుత్బుల్లాపూర్‌లోని నిజాంపేట, ప్రగతినగర్ ప్రాంతాలకూ మంజీరా నీటి సరఫరా కీలకం. మంజీరా జలాశయాల్లో తగ్గుతున్న నిల్వల నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా గోదావరి నీటిని వినియోగించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల వెలిమెల గ్రామం సమీపంలో గోదావరి రింగ్ మెయిన్‌ను మంజీరా ఫేజ్-3, ఫేజ్-4 ప్రధాన పైప్‌లైన్లతో అనుసంధానించే పనులను జలమండలి అధికారులు చేపట్టారు. ఈ అనుసంధానం పూర్తయితే మంజీరాపై ఆధారపడే ప్రాంతాలకు ప్రత్యామ్నాయంగా గోదావరి నీటిని సరఫరా చేసే అవకాశం ఉంటుంది. మరోవైపు అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి ప్రజలకు సూచిస్తోంది. నల్లా నీటిని వృథా చేయడం, తాగునీటితో వాహనాలు కడగడం, పైపులతో ఫ్లోర్ క్లీనింగ్ చేయడం, నీటి ట్యాంకులు నిండినా మోటార్లు ఆపకుండా వదిలేయడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరిస్తోంది. నీటి వృథా స్థాయిని బట్టి భారీ జరిమానాలు విధించడంతో పాటు, అవసరమైతే నల్లా కనెక్షన్ తొలగించే చర్యలు కూడా తీసుకుంటామని స్పష్టం చేస్తోంది. నీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రజల సహకారం కోరుతోంది. జలమండలి సిబ్బందితో మాత్రమే నగరవ్యాప్తంగా జరిగే నీటి వృథాను గుర్తించడం కష్టమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అందుకే ప్రజలు కూడా బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం పానీ యాప్, వాటర్ వారియర్స్ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఎవరైనా నీటిని వృథా చేస్తున్నట్లు కనిపిస్తే ఫొటోలు లేదా వీడియోలతో యాప్, వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని మంత్రి వెల్లడించారు. నీటి వృథాను అరికట్టేందుకు స్వచ్ఛందంగా పనిచేయాలనుకునేవారు గుర్తింపు కార్డుతో వాటర్ బోర్డు వెబ్‌సైట్‌లో సేవ్ వాటర్ వాలంటీర్లుగా నమోదు చేసుకోవచ్చని సూచించారు. నీటి సంరక్షణలో సహకరించే వాలంటీర్లను భవిష్యత్తులో ముఖ్యమంత్రి కూడా అభినందిస్తారని చెప్పారు. హైదరాబాద్‌లో తాగునీటి పరిస్థితిపై రాజకీయ విమర్శలు కూడా మొదలయ్యాయి. నగరంలో నీటి సమస్య తీవ్రంగా కనిపిస్తున్నా.. కాంగ్రెస్ నేతలు ఢిల్లీ పర్యటనలు చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన కరువు కొనసాగుతోందంటూ విమర్శించారు. మరోవైపు కరువు పరిస్థితుల్లో రాజకీయ విమర్శలకు బదులుగా అందరూ కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ వ్యాఖ్యానించారు. జలాశయాల్లో నిల్వలు తగ్గడం, భూగర్భ జలాలు అడుగంటడం, ట్యాంకర్లకు డిమాండ్ పెరగడం.. ఇవన్నీ హైదరాబాద్ నీటి నిర్వహణపై ఒత్తిడి పెరుగుతోందని సూచిస్తున్నాయి. ప్రత్యామ్నాయ వనరుల అనుసంధానం, సరఫరా క్రమబద్ధీకరణ వంటి చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా కీలకం. అవసరానికి మించి నీటిని వాడకుండా, ప్రతి నీటి చుక్కను జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పొదుపుగా వాడితేనే ఈ సంక్షోభంనుండి భయటపడొచ్చు.

సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు

చరిత్రాత్మకం

మొదటిపేజీ తరువాయి..

భూములను విక్రయించి, ఆ నిధులను విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు వినియోగిస్తామని తెలిపారు. ప్రభుత్వ భూముల ద్వారా వచ్చే నిధులను పేదల ప్రయోజనాల కోసం ఖర్చు చేస్తామని చెప్పారు. ఐఎంజీ భూముల అంశంలోనూ తమ ప్రభుత్వం బలంగా వాదనలు వినిపించిందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ కేసులో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలను అడ్డుకుంటున్నామని చెప్పారు. మంచిరేవులలోని 143 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు ప్రయత్నించారని సీఎం ఆరోపించారు.

ఈ అంశంపై పోరాటం చేసి భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అందులో 50 ఎకరాలను యంగ్ ఇండియా స్కూల్‌కు కేటాయించినట్లు వెల్లడించారు. భూపాలపల్లిలోనూ 104 ఎకరాల భూమిని తిరిగి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. గత మూడేళ్లలో రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడినట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు. అటవీ పరిధిలో ఉన్న భూములను అటవీ శాఖకు, రెవెన్యూ పరిధిలో ఉన్న భూములను రెవెన్యూ శాఖకు అప్పగిస్తామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న భూములను ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగిస్తామని చెప్పారు. అవసరమైన చోట భూములను విక్రయించి, ఆ నిధులను సంక్షేమ పథకాల అమలుకు వినియోగిస్తామని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. మియాపూర్ భూముల్లో ఇప్పటికే నిర్మాణాలు ఉన్నాయా లేదా అనే అంశంపై హెచ్‌ఎండీఏ అధికారులు సర్వే నిర్వహిస్తారని తెలిపారు. భూ కబ్జాలకు సంబంధించిన అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని.. ఇందులో బీఆర్ఎస్ నేతల బంధువులకు సంబంధించిన భూ ఆక్రమణలు బయటపడ్డాయని ఆరోపించారు. ఈ వ్యవహారంలో విచారణ జరగకుండా హరీశ్‌రావు అడ్డుకుంటున్నారని విమర్శించారు. కేసీఆర్ ఫాంహౌస్ పరిసర ప్రాంతాల్లోనూ భూముల సర్వేలు నిర్వహిస్తున్నట్లు సీఎం వెల్లడించారు.

కేసీఆర్ ఫాంహౌస్ చుట్టుపక్కల ఉన్న రెండు గ్రామాల్లో సర్వేలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటివరకు 388 ఎకరాల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నామని, మరో 345 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించామని పేర్కొన్నారు. మిగిలిన భూములను గుర్తించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా భూ ఆక్రమణలను మానుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. ప్రభుత్వ భూములను కాపాడటంలో తమ ప్రభుత్వం రాజీపడబోదని స్పష్టం చేశారు. ఎర్రవల్లి సమీపంలో తెలంగాణ అమరవీరుల కాలనీని నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి పేరుతో ఈ కాలనీని నిర్మించనున్నట్లు తెలిపారు.

హైస్పీడ్ రైళ్ల పనులు వేగవంతం చేయాలి

మొదటిపేజీ తరువాయి..

కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులపై చర్చించారు. వికారాబాద్ -- కృష్ణా కొత్త రైలు మార్గాన్ని వెంటనే మంజూరు చేయాలని రైల్వేశాఖ మంత్రిని రేవంత్ రెడ్డి కోరారు. వికారాబాద్ జిల్లా టేకల్‌కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు బయటపడ్డాయని తెలిపిన సీఎం ఈ ప్రాంతాన్ని సిమెంట్, టెక్స్‌టైల్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని వివరించారు. ఆర్ఆర్ఆర్ చుట్టూ రీజినల్ రింగ్ రైలును అలైన్‌మెంట్ చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. రీజినల్ రింగు రైలుతో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. డోర్నకల్- గద్వాల్, కల్వకుర్తి -- మాచర్ల, కాచిగూడ కాచిగూడ --జగ్గయ్యపేట, పటాన్‌చెరు -- ఆదిలాబాద్, బోధన్ -- లాతూర్, అక్కన్నపేట బైపాస్ లైన్ మార్గాలను వెంటనే మంజూరు చేయాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను రేవంత్ రెడ్డి కోరారు.

దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేయనున్న మెగా కోచింగ్, ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోను మహబూబాబాద్ సమీప అనంతారం గ్రామంలో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కోరారు. ఈ డిపో ఏర్పాటుకు అవసరమైన 409.1 ఎకరాల భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు ఇప్పటికే అంగీకరించిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం రేవంత్ తీసుకెళ్లారు. సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహమ్మద్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ ఎన్నికల తుది ఫలితాలు వెల్లడి

మొదటిపేజీ తరువాయి..

లభించలేదు. దీంతో ఇజ్రాయెల్‌లో తదుపరి ప్రభుత్వం ఏ పార్టీల కలయికతో ఏర్పడుతుందన్న అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, నఫ్తాలి బెన్నెట్ సారథ్యంలోని 'బియాహాద్' 12 స్థానాలను దక్కించుకుంది. జాయింట్ లిస్ట్ 11 స్థానాలు సాధించింది. డెమోక్రాట్స్, రా'అమ్ పార్టీలు చేయనుంది. ఇజ్రాయెల్ పార్లమెంటులో మొత్తం 120 స్థానాలు ఉంటాయి. ప్రభుత్వ ఏర్పాటుకు కనీసం 61 మంది సభ్యుల మద్దతు అవసరం. తుది ఫలితాలు అధికారికంగా ప్రకటించిన తర్వాత అధ్యక్షుడు హెర్జోగ్ వివిధ పార్టీల ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతారు. తొలుత ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలిచిన పార్టీ నాయకుడిని ప్రధానిగా నామినేట్ చేస్తారు. ఆ నాయకుడు నిర్ణీత సమయంలో మెజారిటీ నిరూపించలేకపోతే, మరో వ్యక్తికి అవకాశం కల్పించవచ్చు. ఈ ప్రక్రియలోనూ ప్రభుత్వం ఏర్పడకపోతే చివరకు మరోసారి ఎన్నికలు నిర్వహించే పరిస్థితి రావచ్చు. లికుడ్ పార్టీ ఎక్కువ సీట్లు గెలుచుకోవడంపై అర్జెంటీనా అధ్యక్షుడు ఖావియర్ మిలే సోషల్ మీడియా వేదికగా స్పందించారు. నెతన్యాహుకు శుభాకాంక్షలు తెలిపారు. 'అంచనాలను తలకిందులు చేస్తూ లికుడ్ మరోసారి ఇజ్రాయెల్‌లో అగ్రగామి

చెరో ఎనిమిది స్థానాలు దక్కించుకున్నాయి. ఇస్రాయెల్ బైతేను, యునైటెడ్ తోరా జుడాయిజం, ఓట్జ్మా యెహుదిత్ పార్టీలు ఏడు స్థానాల చొప్పున విజయం సాధించాయి. షాస్, రిలిజియస్ జియోనిజం పార్టీలు ఆరు స్థానాల చొప్పున కైవసం చేసుకున్నాయి. ఈ ఎన్నికల్లో అర్హులైన ఓటర్లలో 77.9 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 57,16,665 ఓట్లు పోలయ్యాయి. అయితే కొన్ని పార్టీలు కనీస ఓట్ల పరిమితిని చేరుకోలేకపోయాయి. రిజర్విస్టులు 2.7 శాతం, పీపుల్ ఆఫ్ ఇజ్రాయెల్ 1.7 శాతం, చారెడి పబ్లిక్ పార్టీ 0.2 శాతం ఓట్లు సాధించాయి. ఇజ్రాయెల్ ఎన్నికల్లో పార్లమెంటులో ప్రాతినిధ్యం పొందేందుకు అవసరమైన 3.25 శాతం ఓట్లను ఈ పార్టీలు దాటలేకపోయాయి. ఎన్నికల ఫలితాల్లో ఏవైనా పొరపాట్లు జరిగాయా? అనే అంశంపై పరిశీలనలు, విచారణలు పూర్తయిన తర్వాత నవంబర్ 4న తుది ఫలితాలను అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌కు ఎన్నికల సంఘం సమర్పించనుంది. అనంతరం కొత్తగా ఎన్నికైన కెసెనెట్ (ఇజ్రాయెల్ పార్లమెంట్) నవంబర్ 10న ప్రమాణ స్వీకారం శక్తిగా నిలిచింది. ఇజ్రాయెల్, అర్జెంటీనాలు వ్యూహాత్మక మిత్రపక్షాలుగా కొనసాగుతాయి' అని ఆయన పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌లో ఇప్పుడున్న పరిస్థితుల్లో మైనార్టీ ప్రభుత్వ ఏర్పాటుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అరబ్ పార్టీల మద్దతుతో యషార్ పార్టీ చైర్మన్ గాడి ఐసెన్‌కోట్ నేతృత్వంలో మైనారిటీ ప్రభుత్వం ఏర్పడే అవకాశం లేదని రా'అమ్ పార్టీ నాయకుడు మన్సూర్ అబ్బాస్ అభిప్రాయపడ్డారు. పార్టీ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. నెతన్యాహును వ్యతిరేకిస్తున్న యూదు నేతృత్వంలోని కూటమి సొంతంగా మెజారిటీ సాధించలేకపోవడంతో ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యామ్నాయ మార్గాలపై సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఎన్నికల్లో కొన్ని మోసాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. మోసాలపై విచారణ జరిపించాలని ఎన్నికల సంఘాన్ని పలు పార్టీలు కోరాయి. అరబ్ ప్రాంతాల్లో ఓటింగ్ సరళిని ప్రభావితం చేసేందుకు విదేశీ సంస్థలు ప్రయత్నించి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి.

జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనగణన

మొదటిపేజీ తరువాయి..

జనగణన ఉండదని స్పష్టం చేసింది. అలాగే మంచు కురిసే జమ్ముకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్‌ప్రదేశ్‌లోనూ జనగణన ఉందని పేర్కొంది. భారత రిజిస్ట్రార్ జనరల్ (ఆర్‌జీఐ), సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ కుమార్ నారాయణ్ జారీ చేసిన ప్రకారం, జనాభా గణనకు రిఫరెన్స్ తేదీగా 2027 మార్చి 1 అర్ధరాత్రి 12 గంటలుగా నిర్ణయించారు. ఆర్‌జీఐ ప్రకారం, జనగణన ప్రక్రియలో భాగంగా 2027 మార్చి 1 నుంచి మార్చి 5 వరకు 'సవరణ దశ' (రివిజనల్ రౌండ్) ఉంటుంది. ఇంటింటికీ తిరిగి జనాభాను లెక్కించే ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందు, అంటే 2027 జనవరి 10 నుంచి జనవరి 24 వరకు ప్రజలు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకునే (సెల్ఫ్-ఎన్యూమరేషన్) అవకాశం కల్పిస్తారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత జరుగుతున్న 8వ జనగణన ఇది. దీనిని రెండు దశల్లో నిర్వహిస్తారు. మొదటిది గృహాల జాబితా తయారీ, గృహ గణన, రెండోది జనాభా లెక్కింపు. ప్రతి పదేళ్లకు ఒకసారి జరిగాల్సిన ఈ ప్రక్రియ ఈసారి కాస్త లేటయ్యింది. వాస్తవానికి జగగణన 2021లోనే జరగాల్సి ఉండగా, కోవిడ్-19 మహమ్మారి కారణంగా వాయిదా పడింది. ఈ భారీ జనాభా గణన ప్రక్రియ కోసం కేంద్ర మంత్రివర్గం రూ.11,718 కోట్లు కేటాయించింది. వాస్తవానికి, గతంలోనే మణిపూర్‌లో 2027 జనాభా గణనకు సంబంధించి గృహాల జాబితా తయారీ ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు =+× జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. భారతదేశంలో చివరిసారిగా 2011లో జనాభా గణన జరిగింది. అప్పుడు దేశ జనాభా 121 కోట్లుగా నమోదైంది; ఇందులో 62.32 కోట్ల మంది పురుషులు, 58.75 కోట్ల మంది మహిళలు ఉన్నారు. ఆ సమయంలో దేశంలో 24.95 కోట్ల కుటుంబాలు ఉన్నాయి.

మహారాష్ట్ర రాజకీయాల్లో కొత్త మలుపు?

మొదటిపేజీ తరువాయి..

కనిపించడమే కాకుండా.. కార్యక్రమానికి ముందు ముగ్గురూ ఏకాంతంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో బీజేపీ, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన మధ్య విభేదాలు పెరుగుతున్నాయన్న వార్తల నేపథ్యంలో ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. అయితే ఈ సమావేశంలో ఏం చర్చించారన్నది అధికారికంగా వెల్లడికాలేదు.

ముంబయిలో గురువారం జరిగిన 'మహారాష్ట్రచ్యా హాస్యరేఖా' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. మరాఠీ రాజకీయ వ్యంగ్య చిత్రాల వందేళ్ల ప్రస్థానాన్ని వివరిస్తూ ప్రముఖ కార్టూనిస్టు ప్రశాంత్ కులకర్ణి సంపాదకత్వంలో ఈ పుస్తకాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమానికి ముందు ఫడ్నవీస్, ఉద్ధవ్, రాజ్ ఠాక్రే ఓ గదిలో సమావేశమై మాట్లాడుకున్నారు. ఇది మర్యాదపూర్వకంగా జరిగిన చాయ్ భేటీ మాత్రమేనని ముఖ్యమంత్రి సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. కార్యక్రమంలోనూ ముగ్గురు నేతల మధ్య ఆసక్తికర సంభాషణ సాగింది. రాజ్ ఠాక్రేను ఆహ్వానించినందుకు ఫడ్నవీస్ కార్యక్రమానికి వచ్చారని మంత్రి ఆశిష్ షెలార్ ప్రస్తావించగా.. 2029 వరకు ఫడ్నవీస్‌ను ముఖ్యమంత్రిగా కొనసాగించాలని రాజ్ ఠాక్రే చమత్కరించారు. రాజకీయాలకు అతీతంగా కళా, సాంస్కృతిక కార్యక్రమాల్లో నేతలు కలుసుకోవడం మహారాష్ట్ర సంప్రదాయమని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై ఫడ్నవీస్ స్పందిస్తూ.. 2019 వరకు ఉద్ధవ్ ఠాక్రే ఫోన్ చేసినప్పుడల్లా వెళ్లేవాడినని, ఆ తర్వాత ఆయన నుంచి ఫోన్ కోసం ఎదురుచూశానని అన్నారు. రాజకీయ ప్రత్యర్థులు ఒకే వేదికపై కనిపించినంత మాత్రాన ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. మరోవైపు, కార్టూనిస్టుల కోసం ముంబయిలో ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేసే ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్తానని, అందుకు ఠాక్రే సోదరుల సహకారం తీసుకుంటానని తెలిపారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర శాసన మండలి ఎన్నికల్లో ఐదు స్థానాలకు గానూ మహావికాస్ ఆఘాడీ మూడు స్థానాలు గెలుచుకుంది. మహాయుతి రెండు స్థానాలకే పరిమితమైంది. ఈ ఫలితాల తర్వాత బీజేపీ, షిండే వర్గం మధ్య పరస్పర విమర్శలు తెరపైకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఫడ్నవీస్, ఠాక్రే సోదరుల భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఈ సమావేశం ఆధారంగా కొత్త రాజకీయ కూటమి ఏర్పడుతుందని ఇప్పుడే అంచనా వేయలేమని బీజేపీ నేత ప్రవీణ్ దరేకర్ వ్యాఖ్యానించారు.

భారత నౌకాదళం మరో కీలక ఘనత

మొదటిపేజీ తరువాయి..

ల్యాండింగ్ అయింది. ఈ పరిణామంతో భారత నౌకాదళంలో రఫేల్ మెరైన్ యుద్ధవిమానాల ప్రవేశానికి మరో కీలక అడుగు పడింది. సముద్రంపై నుంచి శత్రువులపై దాడులు చేయడంతో పాటు గగనతల రక్షణ సామర్థ్యాలను పెంచుకునేందుకు ఈ పరిణామం ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. భారత నౌకాదళం విడుదల చేసిన వీడియోలో రఫేల్ మెరైన్ యుద్ధవిమానం ఐఎన్ఎస్ విక్రాంత్ విమాన వేదికపైకి విజయవంతంగా దిగిన దృశ్యాలు కనిపించాయి. అత్యంత వేగంతో వచ్చి విమాన వాహక నౌకపై సురక్షితంగా దిగడం, ప్రత్యేక వ్యవస్థ సాయంతో విమానాన్ని నిలిపివేయడం వంటి ప్రక్రియలను ఈ పరీక్షలో పరిశీలించారు. ఈ విజయంతో రఫేల్ మెరైన్ విమానానికి, భారతదేశం స్వయంగా నిర్మించిన విమాన వాహక నౌకకు మధ్య సాంకేతిక అనుసంధానం సాధ్యమవుతుందని నిరూపితమైంది. షార్ట్ టేకాఫ్ బట్ అరెస్టెడ్ రికవరీ విధానంలో విమానాల నిర్వహణకు ఇది ముఖ్యమైన ముందడుగు. ఈ ల్యాండింగ్‌కు ముందు విమానానికి సంబంధించిన పలు సాంకేతిక అంశాలను నిపుణులు పరీక్షించారు. సముద్ర వాతావరణంలో ఎదురయ్యే ఒత్తిడిని తట్టుకునేలా విమానంలో చేసిన మార్పులు ఇందులో కీలకం. ముఖ్యంగా బలోపేతం చేసిన ల్యాండింగ్ గేర్లు, ప్రత్యేకంగా రూపొందించిన ల్యాండింగ్ హుక్, మడతపెట్టే రెక్కల పనితీరును పరిశీలించారు. నౌకాదళ పరీక్షా పైలట్లు, ఇంజినీర్లు ఈ ప్రక్రియలో పాల్గొన్నారు.

కృష్ణ-గోదావరి బేసిన్ వివాదంపై స్పష్టత

మొదటిపేజీ తరువాయి..

హామీ ఇచ్చాయని వెల్లడించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, ఇతర న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎమ్. పంచోలిలతో కూడిన సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఈ నియామకాన్ని ప్రకటించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీలతో కూడిన ధర్మాసనం ముందుకు కేజీ బేసిన్ గ్యాస్ తరలింపు కేసు విచారణకు వచ్చింది. ఈ వివాదానికి సంబంధించి అన్ని పక్షాలు ఒక ఆచరణాత్మక పరిష్కారాన్ని కనుగొనలేకపోయాయన్న సమాచారం ధర్మాసనం దృష్టికి చేరింది. ఈ కేసులో రిలయన్స్ ఇండస్ట్రీస్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట వాదనలు వినిపించారు. 'ఈ వివాదాన్ని కోర్టు వెలుపల పరిష్కరించుకోగలమేమో చూద్దాం. ఈ కేసులో మీరు (సుప్రీంకోర్టునుద్దేశించి) ఎవరిని మధ్యవర్తిగా నియమించాలనుకుంటే వారిని నియమించండి' అని సిబల్ అన్నారు. ఈ వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ధర్మాసనం స్పందించింది. కేజీ బేసిన్ వివాదానికి సంబంధించి మధ్యవర్తిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ పేరును ప్రతిపాదించింది. ఆమెకు ఉన్న కమర్షియల్ లిటిగేషన్ బ్యాక్‌గ్రౌండ్, పరిజ్ఞానాన్ని దృష్టిలో ఉంచుకుని ఇరు పక్షాలు పరిష్కారం కోసం ప్రయత్నించాలని పిలుపునిచ్చింది. అలాగే ఇరుపక్షాలు సూచించిన ఇద్దరు నిపుణుల సహాయాన్ని తీసుకోవాలని మధ్యవర్తిని కోరతామని పేర్కొంది. మరోవైపు, కేజీ బేసిన్ వివాదంలో కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. తాము మధ్యవర్తికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇరు పక్షాలు మధ్యవర్తి ముందు తమ ప్రజెంటేషన్ ఇవ్వొచ్చని అన్నారు. మధ్యవర్తి ముందు పక్షాలు తమ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు వీలుగా కొంత సమయం కేటాయించాలని ధర్మాసనాన్ని కోరారు. ఈ క్రమంలో ఇరు పక్షాలు కూడా ఒక సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ (విషయ నిపుణుడు) లేదా డొమైన్ ఎక్స్‌పర్ట్ పేరును సుప్రీంకోర్టుకు అందించడానికి అంగీకరించాయి. తాను ఒక నిపుణుడి పేరును సూచిస్తానని కేంద్రం తరఫున వాదిస్తున్న అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి చెప్పగా, తాము ఒక పేరును అందిస్తామని రిలయన్స్ తరఫున వాదనలు జరుపుతున్న కపిల్ సిబల్ కోర్టుకు తెలియజేశారు. "కృష్ణా- గోదావరి బేసిన్ వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకునేందుకు ఇరు పక్షాలు గతంలో పలు మార్లు ప్రయత్నించినప్పటికీ, ఒక అంగీకారానికి రాలేకపోయాయని మాకు సమాచారం అందింది. ఈ వివాదంలో మధ్యవర్తిగా వ్యవహరించాలని మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్‌ను కోరుతున్నాం. మధ్యవర్తికి పూర్తి సహకారం అందిస్తామని ఇరు పక్షాలు హామీ ఇచ్చాయి. ఈ రోజు లేదా రేపు ఇరు పక్షాలు జస్టిస్ దేశాయ్‌ను సంప్రదించొచ్చు. ఈ మధ్యవర్తిత్వ ప్రక్రియకు తాము ఎలాంటి కాలపరిమితిని విధించట్లేదు. నాలుగు వారాల తర్వాత కోర్టు మధ్యవర్తిత్వ పురోగతిని సమీక్షిస్తుంది" అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేజీ బేసిన్ గ్యాస్ తరలింపు వివాదంలో మధ్యవర్తిత్వం కోసం కేంద్రానికి లేఖ రాస్తామని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ మే 20న సుప్రీంకోర్టుకు తెలిపింది. మధ్యవర్తిత్వ ఫలితం వెలువడే వరకు ఈ కేసు విచారణ నిలిపివేయాలని కోరింది. అయితే కేంద్రం తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి కేసు విచారణ కొనసాగించాలని దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. ఈలోగా ఏమైనా సమాచారం ఉంటే కోర్టుకు తెలియజేస్తామని అన్నారు. ఈ నేపథ్యంలో కేజీ బేసిన్ గ్యాస్ తరలింపు కేసు విచారణను నిలిపివేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. తాజాగా ఈ వివాదానికి సంబంధించిన మధ్యవర్తిని నియమిస్తూ సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకుంది.

LOSS OF PASSPORT

I, NALLAWAR KRUPAL REDDY S/O NALLAWAR CHINNA REDDY aged 49 Years (D.O.B 14-03-1977) R/O Flat no 301 the Heaven Apartment, Ushodaya Enclave Gundalpochampally Road. Kompally, Dist. Medchal-Malkajgiri-500100 Telangana State. I Lost my original Passport **No. G2263050** Issued on **21-02-2007** Valid up to **20-02-2017** Issued from RPO Hyderabad. during travelling from pet basheerabad to kompally on 23-04-2026 If anybody found my said passport, please contact me on **8341992251.**

DECLARANT
NALLAWAR KRUPAL REDDY
S/O NALLAWAR CHINNA REDDY

పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఆడే గజేందర్

నేరడిగొండ అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి) : పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారు గౌసియా బేగం ఆహ్వానం మేరకు, నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొత్త ఇంట్లోకి అడుగుపెట్టిన గౌసియా బేగం కుటుంబ సభ్యులకు ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. వారి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

అనంతరం ఆడే గజేందర్ మాట్లాడుతూ... అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు అందించాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇల్లు అనేది పేద కుటుంబాలకు కేవలం నివాసం మాత్రమే కాదని, అది వారి ఆత్మగౌరవానికి, భవిష్యత్ భరోసాకు ప్రతీక అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆడెపు శ్రీకాంత్, ఉప సర్పంచ్ మమత చంద్రశేఖర్, సీనియర్ నాయకులు బుక రాములు, నాయుడు రవి, కుంట శంకర్, కార్తీక్, ఆసిఫ్, కళ్యెం రామకృష్ణ, ఇక్బాల్, తెడ్డు అశోక్, ఇబ్రహీం, రాహిల్ మాలిక్, ప్రవీణ్, అఖిల్, గంధం నవీన్, అశోక్, షకీల్, మినహాజ్, షేక్ రాహిల్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి పథకం పేద కుటుంబాలకు అండ : ఎమ్మెల్యే కోవ లక్ష్మి

30 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

తిర్యాణి, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టిందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శుక్రవారం తిర్యాణి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 30 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి,చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు తులం బంగారం అందజేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేశారని, అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సూచించారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో నాగేష్, పీఎస్‌సీహెచ్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోల్ మైన్ పెన్షనర్లు నవంబర్ 1 నుంచి 30లోపు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

- పెన్షన్ నిలిచిపోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి
- అఖిల భారతీయ కోల్ మైన్స్ పెన్షనర్స్ మహాసంఘ్ అధ్యక్షుడు పులి రాజారెడ్డి

మంచిర్యాల, 30, అక్టోబర్ (ప్రజాజ్యోతి): కేంద్ర బొగ్గు గనుల్లో పనిచేసి పదవీ విరమణ పొంది పెన్షన్ పొందుతున్న కోల్ మైన్ పెన్షనర్లు 2026 నవంబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీలోపు తప్పనిసరిగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని అఖిల భారతీయ కోల్ మైన్స్ పెన్షనర్స్ మహాసంఘ్ అధ్యక్షుడు పులి రాజారెడ్డి కోరారు. నిర్ణీత గడువులోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించని పక్షంలో పెన్షన్ నిలిచిపోయే అవకాశం ఉన్నందున పెన్షనర్లందరూ ముందస్తుగా అప్రమత్తమై సకాలంలో ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణకు ప్రధానంగా మూడు విధానాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మొదటిది డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ విధానమని, స్మార్ట్‌ఫోన్ ద్వారా ఫేస్ ఆథెంటికేషన్ సదుపాయాన్ని ఉపయోగించి ఆధార్ నంబర్, అవసరమైన పెన్షన్ వివరాలతో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించవచ్చని పేర్కొన్నారు. రెండోది బయోమెట్రిక్ విధానమని, ముఖ గుర్తింపు సదుపాయం అందుబాటులో లేని వారు వేలిముద్ర ద్వారా అధికారిక బయోమెట్రిక్ కేంద్రాల్లో ధ్రువీకరణ చేయించుకుని సర్టిఫికెట్ సమర్పించవచ్చని వివరించారు. మూడోది భౌతిక విధానమని, డిజిటల్ లేదా బయోమెట్రిక్ పద్ధతులను వినియోగించలేని వారు కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (సీఎంపీఎఫ్ఓ) కార్యాలయం లేదా సంబంధిత అధికారుల సూచనల మేరకు నిర్ణీత ఫారాన్ని పొంది, వివరాలు నమోదు చేసి సంతకంతో సమర్పించవచ్చని తెలిపారు. అదేవిధంగా అనారోగ్యం, వృద్ధాప్యం లేదా ఇతర కారణాలతో ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పెన్షనర్లకు కూడా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించే అవకాశం ఉందని, ఇందుకోసం సంబంధిత బ్యాంకు, పోస్టాఫీసు లేదా అధికారిక సేవా కేంద్రాలను సంప్రదించి ఇంటి వద్దే సేవలు పొందేందుకు అవసరమైన ఏర్పాట్ల గురించి తెలుసుకోవాలని సూచించారు. విదేశాల్లో నివసిస్తున్న పెన్షనర్లు సైతం తమకు వర్తించే అధికారిక నిబంధనల ప్రకారం లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించవచ్చన్నారు.

లైఫ్ సర్టిఫికెట్ సమర్పణలో ఏవైనా సాంకేతిక లేదా ఇతర ఇబ్బందులు ఎదురైతే అఖిల భారతీయ కోల్ మైన్స్ పెన్షనర్స్ మహాసంఘ్ ప్రతినిధులను సంప్రదించాలని పులి రాజారెడ్డి కోరారు. పెన్షనర్లందరూ నవంబర్ నెలలోనే ఈ ప్రక్రియను పూర్తి చేసుకుని, తమ పెన్షన్ నిరంతరాయంగా అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని రీ సర్వే పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 30, (ప్రజాజ్యోతి) : రోజువారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

శుక్రవారం నర్సాపూర్ (జి) మండలం చాక్ పల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన భూముల రీ సర్వే వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం రీ సర్వే చేయాల్సిన భూమి, పట్టా భూములు, ఎస్ఆర్ఎస్పీ భూములు, తదితర భూముల వివరాలు అడిగారు. భూముల హద్దుల గుర్తింపు పక్కాగా ఉండాలన్నారు. రీ సర్వే ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.

సర్వే బృందం మొత్తం సభ్యుల పర్యవేక్షణలో, సంబంధిత రైతుల సమక్షంలో మాత్రమే సర్వే చేపట్టాలన్నారు. నిర్ణీత గడువులోగా రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.

రీ సర్వే ప్రక్రియ చేపట్టే సిబ్బంది తప్పనిసరి ఎండ నుండి రక్షణ పొందేలా టోపీలు ధరించాలని సూచించారు. తాగునీరు తగినంత అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని పేర్కొన్నారు. అధికారులు, రైతుల పరస్పర సమన్వయంతో రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని తెలిపారు.

స్థానిక రైతుతో మాట్లాడుతూ, ఆయన సాగు చేసిన పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి కొరత అంశాలను బేరీజు వేసుకొని తక్కువ నీటితో పండే పంటలు మాత్రమే పండించాలని సూచించారు. వ్యవసాయ క్షేత్రంలో పంట కుంటలు (ఫామ్ పాండ్) లు నిర్మించుకోవాలని అన్నారు. పంట కుంటల నిర్మాణంతో భవిష్యత్తులో నీటి ఇబ్బందులు కలగకుండా ఉంటాయని చెప్పారు. రైతులు తమ పంట పొలాలలో పంట కుంటలు నిర్మించుకునే విధంగా అధికారులు ప్రోత్సహించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీకాంత్, సర్వేయర్ విలాస్, సర్పంచ్ సుధాకర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల, దండేపల్లి ఘటనలపై

ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు

- క్షేత్రస్థాయి పరిశీలన.. సాంకేతిక ఆధారాలతో సమగ్ర విచారణ
- వాస్తవాలను వెలికితీసే దిశగా ప్రత్యేక బృందం
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాల, 30, అక్టోబర్ (ప్రజాజ్యోతి) : మంచిర్యాల జోన్ పరిధిలోని మంచిర్యాల, దండేపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలపై సమగ్ర దర్యాప్తు చేపట్టేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఘటనలపై పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలికితీసేందుకు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు సీసీఎస్ ఏసీపీ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఈ బృందం సంబంధిత సంఘటనా స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు ఘటనలకు సంబంధించిన వ్యక్తులు, సాక్షులను విచారించనుంది. సాంకేతిక ఆధారాలను సేకరించి విశ్లేషించనుంది. అందుబాటులో ఉన్న అన్ని ఆధారాలను సమగ్రంగా పరిశీలించి ఘటనల వెనుక ఉన్న వాస్తవ పరిస్థితులు, సంబంధిత వ్యక్తుల పాత్రను నిష్పక్షపాతంగా నిర్ధారించనుంది. మరోవైపు మంచిర్యాల, దండేపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు 24 గంటలూ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని సీపీ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు . ఇటీవల సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న ఊహాజనిత, నిర్ధారణ కాని, అసత్య సమాచారాన్ని ప్రజలు నమ్మవద్దని, వాటి ఆధారంగా ఆందోళనకు గురికావద్దని సీపీ సూచించారు. పోలీస్ శాఖ అధికారికంగా విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని కోరారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ ప్రాధాన్యతని, శాంతిభద్రతల పరిరక్షణకు రామగుండం పోలీస్ కమిషనరేట్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని సీపీ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు.

నేడు (అక్టోబర్ 31న) ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవంపై ప్రత్యేక కథనం

కార్మిక ఐక్యతకు పునాది..

- హక్కుల సాధనలో శతాబ్దపు పోరాట ప్రస్థానం
- సింగరేణి పరిరక్షణ నుంచి కార్మికుల సంక్షేమం వరకు ఏఐటీయూసీ ప్రస్థానం చిరస్మరణీయం

మంచిర్యాల, 30, అక్టోబర్ (ప్రజాజ్యోతి) : భారత కార్మికోద్యమ చరిత్రలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ)కు ప్రత్యేక స్థానం ఉంది. కార్మికుల హక్కుల పరిరక్షణ, మెరుగైన వేతనాలు, పని గంటల నియంత్రణ, ఉద్యోగ భద్రత, సామాజిక న్యాయం వంటి లక్ష్యాలతో ఆవిర్భవించిన ఈ సంస్థ శతాబ్దానికి పైగా కార్మిక ఉద్యమాలకు దిశానిర్దేశం చేస్తోంది. కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటమే ప్రధాన మార్గమని చాటుతూ, ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణ నుంచి కార్మికుల సంక్షేమం వరకు అనేక ఉద్యమాలకు వేదికగా నిలిచింది. 1920 అక్టోబర్ 31న ముంబైలో ఏఐటీయూసీ ఆవిర్భవించింది. బ్రిటిష్ పాలనలో పారిశ్రామిక రంగం విస్తరిస్తున్నప్పటికీ కార్మికులు తక్కువ వేతనాలు, సుదీర్ఘ పని గంటలు, ప్రమాదకరమైన పని పరిస్థితులు, కనీస సౌకర్యాల లేమితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో విడివిడిగా కొనసాగుతున్న కార్మిక పోరాటాలను జాతీయ స్థాయిలో ఏకతాటిపైకి తీసుకురావాలనే సంకల్పంతో ఏఐటీయూసీ ఏర్పాటైంది. స్వాతంత్ర్య సమరయోధుడు లాలా లజపత్ రాయ్ తొలి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టగా, జోసెఫ్ బాప్టిస్టా, ఎన్.ఎం. జోషి, దివాన్ చమన్‌లాల్ వంటి నాయకులు సంస్థ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు.

స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో కార్మిక హక్కుల సాధన, జాతీయ స్వాతంత్ర్యం, సామాజిక సమానత్వం వంటి అంశాలను ముడిపెడుతూ ఏఐటీయూసీ తన ప్రస్థానాన్ని కొనసాగించింది. స్వాతంత్ర్యం అనంతరం వేతన ఒప్పందాలు, పని పరిస్థితులు, కార్మిక చట్టాలు, సామాజిక భద్రత, ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణ వంటి అంశాలపై నిరంతరం పోరాటాలు సాగించింది. కార్మిక సంఘాల మధ్య విధానపరమైన భేదాలు, విభిన్న రాజకీయ నేపథ్యాలు ఉన్నప్పటికీ భారత కార్మికోద్యమ చరిత్రలో ఏఐటీయూసీ తనదైన ముద్ర వేసుకుంది.

తెలంగాణ కార్మికోద్యమంలోనూ ప్రత్యేక ప్రస్థానం : తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో సింగరేణి బొగ్గు గనులకు విశిష్ట స్థానం ఉంది. విద్యుత్ ఉత్పత్తి, ఉక్కు పరిశ్రమలు, ఇతర పారిశ్రామిక రంగాలకు అవసరమైన బొగ్గును వెలికితీసే కార్మికులు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో పనిచేస్తున్నారు. భూగర్భంలో ప్రాణాలను పణంగా పెట్టి దేశ ఆర్థిక వ్యవస్థకు ఇంధనాన్ని అందిస్తున్న కార్మికులకు తగిన ప్రతిఫలం, భద్రత, గౌరవం కల్పించడంలో కార్మిక సంఘాల పాత్ర కీలకంగా ఉంది. హైదరాబాద్ రాష్ట్ర కాలంలో కార్మిక సంఘాల నిర్మాణం, ఉద్యమాల విస్తరణకు మఖ్దూం మొహియుద్దీన్, రాజ్ బహదూర్ గౌర్ వంటి నాయకులు విశేష కృషి చేశారు. ఆనాటి కార్మికోద్యమ వారసత్వం తెలంగాణ కార్మిక చరిత్రలో భాగంగా నిలిచింది. సింగరేణిలో దేవూరి శేషగిరిరావు, కె.ఎల్. మహేంద్ర, మనుబోతుల కొమురయ్య వంటి నాయకులు 1942లో ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘం నిర్మాణానికి కృషి చేశారు. అప్పటి నుంచి సింగరేణి కార్మికుల హక్కుల సాధనలో ఈ సంఘం కీలక పాత్ర పోషిస్తూ వస్తోంది. సింగరేణిలో వేతన ఒప్పందాలు, బోనస్, అలవెన్సులు, ఉద్యోగ భద్రత, పదోన్నతులు, వైద్య సదుపాయాలు, గని ప్రమాదాల నివారణ వంటి అనేక అంశాలపై ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతోంది. యాజమాన్యంతో చర్చలు జరపడం, కార్మికుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, అవసరమైన సందర్భాల్లో నిరసనలు, సమ్మెల ద్వారా డిమాండ్ల సాధనకు కృషి చేయడం వంటి కార్యక్రమాలను కొనసాగిస్తోంది.

సింగరేణి పరిరక్షణలో కీలక పాత్ర : 1992లో సింగరేణి సంస్థ నష్టాల బాటలో పయనిస్తూ అనారోగ్య పరిశ్రమగా ముద్రపడే ప్రమాదం ఏర్పడిన సమయంలో కార్మికుల్లో చైతన్యం కల్పించి, ఉత్పత్తి పెంపునకు ప్రోత్సహించడం ద్వారా సంస్థ పరిరక్షణకు ఏఐటీయూసీ విశేష కృషి చేసింది. కార్మికుల శ్రమతో సంస్థ లాభాల బాట పట్టేందుకు సహకరించడంతోపాటు, ఆ లాభాల్లో కార్మికులకు వాటా కల్పించే విధానాన్ని సాధించడంలోనూ కీలక పాత్ర పోషించింది. దేశంలోని కార్మికులకు సంస్థ లాభాల్లో వాటా అందించే విధానానికి సింగరేణి ఒక ముఖ్యమైన ఉదాహరణగా నిలవడంలో ఏఐటీయూసీ పోరాటం ప్రస్తావనీయమైనది. సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగాలని, ప్రైవేటీకరణ విధానాలకు దూరంగా ఉండాలని ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘం అనేకసార్లు పోరాట యాత్రలు నిర్వహించింది. బొగ్గు గనుల పరిరక్షణ, కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంస్థ అభివృద్ధి లక్ష్యంగా ఉద్యమాలను కొనసాగించింది. 1998 నుంచి ఇప్పటివరకు జరిగిన ఏడు గుర్తింపు సంఘం ఎన్నికల్లో నాలుగుసార్లు కార్మికులు ఏఐటీయూసీకి గుర్తింపు సంఘం బాధ్యతలు అప్పగించడం కార్మికుల్లో ఆ సంఘానికి ఉన్న ఆదరణకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇటీవల జరిగిన ఆర్టీసీ కార్మిక సంఘం ఎన్నికల్లోనూ ఏఐటీయూసీ కూటమికి లభించిన విజయం కార్మిక సంఘాల ఐక్యత, కార్మికుల ఆదరణకు మరో ఉదాహరణగా చెప్పవచ్చు .

మారుతున్న పరిస్థితుల్లో కార్మికుల సంక్షేమమే లక్ష్యం కావాలి.....

ఆళవందార్ వేణు మాధవ్, ప్రధాన కార్యదర్శి, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్..

ప్రస్తుతం కార్మిక రంగం ప్రైవేటీకరణ, కాంట్రాక్టు విధానం విస్తరణ, సాంకేతిక మార్పులు, ఉద్యోగ భద్రతపై ఆందోళనలు వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో కార్మిక సంఘాలు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది. కేవలం ఉద్యోగంలో ఉన్న కార్మికుల సమస్యలే కాకుండా, పదవీ విరమణ అనంతరం పెన్షనర్ల జీవన భద్రత, వైద్య సదుపాయాలు, వారి కుటుంబాల సంక్షేమం వంటి అంశాలపైనా ప్రత్యేక దృష్టి సారించాలి. ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గత శతాబ్ద కాలపు కార్మిక పోరాటాలను స్మరించుకోవడంతోపాటు, భవిష్యత్తులో కార్మికుల హక్కుల పరిరక్షణకు మరింత ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుంటూ, కార్మికుల సంక్షేమం, పదవీ విరమణ అనంతర జీవన భద్రతకు సమాన ప్రాధాన్యత ఇచ్చినప్పుడే ఏఐటీయూసీ పోరాట వారసత్వానికి నిజమైన సార్థకత చేకూరుతుందని ఆశిద్దాం అని అన్నారు.

గురు సాహెబ్ కలశ పూజలో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సోనాల, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి) : సోనాల మండలంలోని గుర్రాల తాండ గ్రామంలో నిర్వహించిన గురు సాహెబ్ మరియు హనుమాన్ ఆలయ కలాశ్ పూజ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయి దర్శించుకున్నారు. వీరి వెంట మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, ప్రీతం రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రుక్మన్ సింగ్, గోవర్ధన్, ముకుంద్, రాయలు, కేదారేశ్వర్ రెడ్డి, మొట్టె కిరణ్, అబ్దుల్లా, సతీష్ రెడ్డి, ఉత్తం, శ్రీను తదితరులు ఉన్నారు.

ఇంద్రవెల్లిలో పంచజన్య సంకల్ప సభకు భారీగా తరలిన టీఆర్ఎస్ శ్రేణులు

సోనాల, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాలోని చారిత్రాత్మక గడ్డ అయిన ఇంద్రవెల్లి వేదికగా నిర్వహించిన 'పంచజన్య' సంకల్ప బహిరంగ సభకు టీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కల్వకుంట్ల కవిత నాయకత్వంలోని శ్రేణుల గుండెచప్పుడుతో ఇంద్రవెల్లి ప్రాంతం దద్దరిల్లింది.

ఈ సభకు మండల పార్టీ కన్వీనర్ రామాయి సదానందం ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున సోనాల నుండి సభకు చేరుకున్నారు. ప్రభుత్వ విధానాలపై గళం విప్పేందుకు, శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు చేపట్టిన ఈ పంచజన్య సభ విజయవంతం కావడంతో నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

అనాథ పిల్లలకు అండగా గల్ఫ్ కార్మికులు

తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు ఆర్థిక సాయం

జన్నారం, అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి) : మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రాంపూర్ గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన చిన్నారులకు తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి అండగా నిలిచింది. రాంపూర్ గ్రామానికి చెందిన ఓరగంటి (మోతే) దివ్య భర్త లింగయ్య మూడు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించారు. ఇటీవల తల్లి దివ్య కూడా అనారోగ్యంతో మరణించడంతో వారి ఇద్దరు పిల్లలు అమూల్య (11), స్పందన (9) అనాథలుగా మిగిలారు. కూడు గూడు లేని ఆ చిన్నారుల దీనస్థితిని తెలుసుకున్న తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి (౧+ఔ౨ఔ) రాంపూర్ కమిటీ స్పందించింది.గ్రామస్తులు, గల్ఫ్ దేశాల్లో ఉన్న దాతల సహకారంతో రూ.93,200/- సేకరించి, ఆ మొత్తాన్ని ఇద్దరు చిన్నారుల పేరు మీద బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేశారు. ఈ సందర్భంగా టీజీడబ్ల్యుడబ్ల్యుసి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కల్లెడ భూమయ్య మాట్లాడుతూ... ఈ సహాయంతో పిల్లలు చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనాథ పిల్లలకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్ర కన్వీనర్ సుదర్శన్, గ్రామ అధ్యక్షులు లింగాల వెంకటేష్ మాట్లాడుతూ... గల్ఫ్ కార్మికులకు, గ్రామ ప్రజలకు ఎల్లవేళలా తమ వంతు సహాయం అందిస్తామని తెలిపారు. ఈ సహాయం కోసం విదేశాల్లో ఉంటూ పరోక్షంగా సహకరించిన ఓరగంటి వెంకటేష్, సంతపురి రమేష్, కల్లెడ లచ్చయ్య, పందిరి రాజేష్, కొండ్ర నారాయణలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ సర్పంచ్ నూతి రామయ్య, మాజీ సర్పంచ్ అలుగునూరి పద్మారావు లు గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాంపూర్ కమిటీ సభ్యులను అభినందించారు.ఈ కార్యక్రమంలో సంతపురి రాజేష్, రేషవేని లచ్చన్న, చిరంజీవి వెంకటేష్, అరుణ్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేల సంరక్షణపై రైతులకు అవగాహన

సేంద్రియ ఎరువులు వాడాలని సూచన

జన్నారం, అక్టోబర్ 25 (ప్రజాజ్యోతి) : జన్నారం మండలం కొత్తపేట గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కేత్ బచావో అభియాన్ (నేల సంరక్షణ)పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వీరన్న మాట్లాడుతూ... రసాయనిక ఎరువులు, పురుగుమందులను అధికంగా వినియోగించడం వల్ల నేలలోని సేంద్రియ పదార్థాలు, మొక్కలకు పోషకాలు అందించే ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశించే ప్రమాదం ఉందని వివరించారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువులను మోతాదుకు మించి వినియోగించడం వల్ల నేల సారవంతం తగ్గుతుందని, దిగుబడులు కూడా తగ్గే అవకాశం ఉందని తెలిపారు. నేల ఆరోగ్యాన్ని, భూసారాన్ని కాపాడుకోవడానికి రైతులు పశువుల ఎరువులు, పచ్చిరొట్టె ఎరువులు, వర్మీ కంపోస్ట్ వంటి సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. పంట అవశేషాలను కాల్చకుండా భూమిలోనే కుళ్లేలా చేసి సేంద్రియ పదార్థాన్ని పెంపొందించాలని కోరారు.ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గి భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నందున రైతులు నీటి వినియోగాన్ని తగ్గించే ఆరుతడి పంటలైన మొక్కజొన్న, జొన్న, పెసర, మినుములు, నువ్వులు వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బాధావత్ అఖిల్, కొత్తపేట గ్రామ సర్పంచ్ పవార్ దినేష్ నాయక్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విబిజి రామ్ జీ పనులు సమర్థవంతంగా చేపట్టాలి - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 30, (ప్రజాజ్యోతి) : విబిజి రామ్ జీ పనులు సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ లోకేశ్వరం మండలం అర్లి-గొడిసెర గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విబిజి రామ్ జీ కింద గ్రామంలో ప్రతి ఒక్కరు ఉపాధి పొందాలని పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు జాబ్ కార్డులు కలిగి ఉన్న వారిని కూలి పనులకు వెళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. విబిజి రామ్ జీ కార్యక్రమం కింద విస్తృతంగా నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టాలని చెప్పారు. నీటి సంరక్షణ చర్యల వల్ల భవిష్యత్తులో నీటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయని పేర్కొన్నారు. గ్రామంలో స్వాధ్యాయి వృక్ష మందిరానికి స్థలం కేటాయింపు అంశంపై స్థానికులతో మాట్లాడారు. వృక్ష మందిరం కార్యక్రమానికి సంబంధించిన వివరాలను సంబంధిత వ్యక్తులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం, లీజు, ఇతర మార్గాల ద్వారా వృక్షాలు నాటేందుకు స్థలాన్ని కేటాయించే అంశంపై అధికారులకు సూచనలు చేశారు.

సంబంధిత స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. సదరు ప్రాంతంలో గ్రావెల్, స్టోన్ మెటీరియల్ ఉన్నదేమో

తెలుసుకునేందుకు మైనింగ్ అధికారుల ద్వారా వివరాలు సేకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సూర్యారావు, సర్పంచ్ జంగం ప్రసన్న, గ్రామస్తులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా ఎమ్మెల్సీ ఓటరు నమోదు పూర్తి చేయాలి బీజేపీ మండల అధ్యక్షులు నల్లె నర్సప్ప, మాజీ అధ్యక్షులు జి శ్రీనివాసులు.

కృష్ణా అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి)
కృష్ణా మండల కేంద్రం లో వేంకటేశ్వర స్వామీ దేవాలయంలో శక్తి కేంద్రం ఇంచర్జిలు, మండల ముఖ్య నాయకుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు పై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశన్ని ఉద్దేశించి మాట్లాడిన మండల అధ్యక్షులు నల్లె నర్సప్ప, మాజీ అధ్యక్షులు జి శ్రీనివాసులు గత నెల రోజులు గా కొనసాగుతున్న

ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించి ముఖ్య నాయకులు నవంబర్ 6 లోగా గడువు ముగిసే లోగా గతంలో ఓటు ఉన్న వారిని మరియు కొత్తగా 2023 నవంబర్ నాటికి డిగ్రీ పట్టభద్రులు మరియు తత్సమాన అర్హత కలిగిన గ్రాడ్యుయేట్లను ప్రత్యేకంగా కలిసి ఓటు నమోదు చేయించాలని జాతీయ, రాష్ట్ర పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రణాళిక బద్దంగా ముందుకు వెళుతుందని అదే విధంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం పై విద్యావంతులు, మేధావులు ఉపాధ్యాయ ఉద్యోగులు నిరుద్యోగ పట్టభద్రులు కాంగ్రెస్ కు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని. ప్రతి ఒక్కరినీ ఓటరు నమోదు చేయించాలని అన్నారు.
కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు డి రాఘవేంద్ర, సచిన్ బట్, సీనియర్ నాయకులు నారాయణ బట్ ,శంకరయ్య శెట్టి, బి శంక్రప్ప జెంసెర్ నరసింగప్ప, గుంతల హన్మంత్రయ, సురేష్ బట్,సాబుగౌడ్, కుర్వ బాలరాజు, కంద్రయ రాజు, కావలి బస్వరాజు, నాగేంద్ర, తిరుపతి, బీరప్ప, అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఓటరు నీ నమోదు చేయించాలి

-ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జి,స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ డా.అంజనేయ గౌడ్ మాజీ జడ్పీటీసీ, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి

గద్వాల (ప్రజా జ్యోతి) అక్టోబర్ 30:
గద్వాల నియోజకవర్గం గట్టు మండల కేంద్రంలో అంబా భవాని దేవస్థాన కమిటీ హాల్లో శుక్రవారం మహబూబ్ నగర్– హైదరాబాద్ – రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు

నమోదు ప్రక్రియపై నిర్వహించిన మండల స్థాయి పార్టీ శ్రేణుల సమావేశానికి హాజరై,పట్టభద్రుల ఓటర్ నమోదు ప్రాముఖ్యతను వివరిస్తూ దిశా నిర్దేశం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు బీఆర్ఎస్ పార్టీకి ప్రతిష్టాత్మకమైనవని అర్హులైన ప్రతి ఓటరుగా నమోదయ్యేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఓటరు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరిని బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసేలా అవగాహన కల్పించాలని ఓటరు నమోదు ప్రక్రియలో పార్టీ శ్రేణులు నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు.పట్టబద్రులు ఓటు నమోదు చేసుకునేందుకు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో ఉచిత ఓటర్ నమోదు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఓటు అమూల్యమైనదేనని,బీఆర్ఎస్ శ్రేణులు ప్రతి గ్రాడ్యుయేట్స్ ను కలిసి ఓటు నమోదు చేయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు,ఉప సర్పంచులు,పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు,యూత్ సభ్యులు పట్టభద్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తంగా నిలిచే ఆపదమిత్రులుగా 103 మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ - 10వ

ఇటిక్యాల,ఎర్రవల్లి (ప్రజాజ్యోతి)
అక్టోబర్ 30:10 వ బెటాలియన్‌లో రెండో విడత ఏడు రోజుల ఆపదమిత్ర శిక్షణ కార్యక్రమం ఆపద సమయంలో ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావడం కంటే గొప్ప సేవ మరొకటి లేదు.ఇలాంటి అరుదైన సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావడం మీ అందరి అదృష్టం.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమాజానికి సేవ చేసే ఆపదమిత్రులుగా ఎదగాలి –కమాండెంట్ టి.అలెక్స్.10వ బెటాలియన్‌లో తెలంగాణ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఎస్ డి ఆర్ ఎఫ్ మరియు మహబూబ్‌నగర్ జిల్లా వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండో విడత ఏడు రోజుల ఆపదమిత్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం నేషనల్ సర్వీస్ స్కీమ్ ఎన్ ఎస్ ఎస్ మరియు నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఎన్ వై కే ఎస్ సంస్థలకు చెందిన మొత్తం 103 మంది విద్యార్థులు పాల్గొని ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు.ఈ శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాదాలు, తుఫానులు,పేలుళ్లు, భవనాలు కూలిపోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించగల సేవాభావం కలిగిన ఆపదమిత్రులను తయారుచేయడం. అత్యవసర సేవా బృందాలు సంఘటనా స్థలానికి చేరుకునేలోపు బాధితులకు ప్రాథమిక సహాయం,ప్రథమ చికిత్స అందించడం, సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి సేవలను అందించే విధంగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.ఈ ఏడు రోజుల శిక్షణలో భాగంగా అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,వరదలు మరియు తుఫానుల సమయంలో రక్షణ చర్యలు,భవనాలు కూలిపోయినప్పుడు బాధితులను రక్షించే విధానాలు,ప్రాథమిక వైద్య సహాయం, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను సురక్షితంగా తరలించడం వంటి అంశాలపై నిపుణులచే ప్రాయోగిక శిక్షణ అందిస్తున్నారు.అదేవిధంగా ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలు విపత్తుల సమయంలో ఉపయోగించే ఆధునిక రక్షణ పరికరాలు, రెస్క్యూ టూల్స్, అత్యవసర సహాయక సామగ్రి మరియు వాటి వినియోగ విధానాలపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కల్పిస్తున్నారు.తద్వారా విపత్తు సమయంలో భయపడకుండా,సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం అందించేలా వారిని తీర్చిదిద్దుతున్నారు. ఈ కార్యక్రమం 10వ బెటాలియన్ కమాండెంట్ టి.అలెక్స్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతోంది. ఈ సందర్భంగా కమాండెంట్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ,సమాజానికి సేవ చేసే ఇలాంటి బృహత్తర కార్యక్రమంలో పాల్గొనే అవకాశం అందరికీ లభించదని,ఇది మీకు దక్కిన గొప్ప అదృష్టమని పేర్కొన్నారు. ఆపద సమయంలో ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావడం ఎంతో గొప్ప సేవ అని, ఈ ఏడు రోజుల శిక్షణ ద్వారా నేర్చుకున్న నైపుణ్యాలను సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాలని సూచించారు.ఆపదమిత్రులుగా శిక్షణ పొందుతున్న ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ బి.ఆదినారాయణ, అసిస్టెంట్ కమాండెంట్లు శ్రీ పార్థసారథి రెడ్డి, శ్రీను,బెటాలియన్ ఇన్‌స్పెక్టర్లు,రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, నరసింహ రాజు, రాజేశం,తిరుపతి తదితర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



13 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడమేనా

-రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకునేటప్పుడు..?

-నారాయణపేట జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు వెంకట్రాములు ముదిరాజ్

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి,అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి):
ఎల్ ని నో ప్రభావంతో పంటలు ఎండిపోయి రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, నారాయణపేట జిల్లాలో 13 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం బాగుంది కానీ రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకునేది ఎప్పుడు అని నారాయణపేట జిల్లా బిజెపి కిసాన్ మోర్చా అధ్యక్షులు వెంకట రాములు ముదిరాజ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎలినో ప్రభావం తీవ్రంగా ఉందని దీంతో సాగుచేసిన పంటలు పూర్తిగా ఎండిపోయాయని, కనీసం పశువులకు మేత కూడా లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి అన్నం పెట్టి రైతన్న ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని అన్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం స్పందించకుండా ప్రకటనల వరకే పరిమితమై రైతులకు ద్రోహం చేస్తుందని ఆయన విమర్శించారు. నారాయణపేట జిల్లాలో 13 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం బాగానే ఉంది కానీ పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని దుయ్యబట్టారు. కేవలం కరువు మండలాలుగా ప్రకటిస్తే సరిపోదని రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరా పత్తికి 40 వేలు,వరికి 25000, కంది పంటకు

20,000 ఎకరా మొక్కజొన్నకు 25000 చొప్పున వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. వర్షాలు లేక చెరువులు నిండక భూగర్భ జలాలు పూర్తిగా పడిపోయి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దానికి తోడుగా ఆ ప్రకటిత విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఈ పరిస్థితి ఇలా ఉంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓట్ చోరీ పేరుతో రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటు అన్నారు. ఢిల్లీలో ధర్నాల పేరిట ప్రజల దృష్టిని మరలించాలని చూడడం కాంగ్రెస్ పార్టీ నాయకుల అవివేకం అన్నారు.
ఇప్పటికే ఇటీవల నాలుగు రాష్ట్రాలలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు కూడా ఇవ్వకుండా ప్రజలు తగిన బుద్ధి చెప్పిన వారికి బుద్ధి రాకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజల మధ్య ఉండి వారి సమస్యలు తీర్చే నాయకులను నమ్ముతారు తప్ప,కల్లబొల్లి కబుర్లు చెప్పి ఓట్లు దండుకోవాలని చూసే నాయకులకు ప్రజలు తప్పకుండా బుద్ధి చెప్తారని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులపై కపట ప్రేమ చూపించడం మానుకోవాలి

-తక్షణమే నిరుద్యోగులకు పదివేల ఆర్థిక సాయం అందించాలి

-బిఆర్ఎస్ పార్టీ నాయకులు రామలింగం

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి,అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి):
తెలంగాణ రాష్ట్రంలో అనేక మంది నిరుద్యోగ విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని రామలింగం ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగులకు అబద్ధపు మాటలు చెప్పి తెలంగాణ రాష్ట్రంలోని అనేకమంది నిరుద్యోగులను నట్టేట ముంచేశారన్నారు.
నిరుద్యోగులకు 4 వేలు ఇస్తానని అబద్ధపు ప్రకటనలు చేసి నేడు యువతను మోసం చేయడం జరిగింది అని ఆయన అన్నారు. ఈ ఏలినో సమయంలో రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతను ఆర్థికంగా ఆదుకొని

నిరుద్యోగ యువత కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు.
ఏడాదికి లక్ష ఉద్యోగాలు ఇస్తానని చెప్పి సీఎం రేవంత్ రెడ్డి నేటికి మూడు సంవత్సరాలు గడిచిన కనీసం 30 వేల ఉద్యోగాల కూడా ఇవ్వకపోగా లక్ష ఉద్యోగాలు ఇచ్చానని రాష్ట్ర ప్రజలకు అబద్ధపు మాటలు చెబుతూ మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లకు పరీక్షలు నిర్వహించి నియామక పత్రాలు ఇచ్చిన నాయకుడు రేవంత్ అని వారు ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగులపై కపట ప్రేమను చూపించడం మానుకొని తక్షణమే నిరుద్యోగులకు ఆర్థిక సహాయంగా పదివేల రూపాయలు అందించడంతోపాటు నోటిఫికేషన్ లు ఇవ్వాలని, నిరుద్యోగులకు గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వారికి వారి అర్హతను బట్టి పని కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మఖ్తల్ నుంచి ఢిల్లీ నిరసన సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

-జెండా ఊపి ఢిల్లీ సభకు బస్సులను ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి

-ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది: మంత్రి

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి,అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి):
నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న ఓట్ బచావో – దేశ్ బచావో భారీ నిరసన సభకు మంత్రి వాకిటి

శ్రీహరి పిలుపు మేరకు మఖ్తల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఢిల్లీ నిరసన సభకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బస్సులను శుక్రవారం మంత్రి వాకిటి శ్రీహరి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మంత్రి స్వయంగా కార్యకర్తలతో కలిసి బస్సులో కొంతదూరం ప్రయాణిస్తూ ఓట్ బచావో – దేశ్ బచావో అంటూ భారీగా నినాదాలు చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు సంరక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పార్టీ శ్రేణులకు తెలిపారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని,ఓటు హక్కును పరిరక్షించుకోవడం అంటే భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమేనని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ప్రతి పౌరుడికి ఓటు హక్కు అత్యంత విలువైనదని,ఆ హక్కును హరించే బిజెపి చేస్తున్న ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ప్రతిఘటించేందుకు ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'ఓట్ బచావో – దేశ్ బచావో' భారీ నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ,దేశంలో మరోసారి అధికారంలోకి రావడానికి బీజేపీ అడ్డదారులు తొక్కుతోందని మంత్రి విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో కోట్లాది ఓట్లను తొలగిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని, అర్హులైన ఒక్క ఓటరుకూ అన్యాయం జరగకూడదని అన్నారు. బీజేపీ ఓట్ల తొలగింపుపై అనుసరిస్తున్న విధానానికి స్వస్తి పలకాలని పార్టీ శ్రేణులతో కోరారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఓటు హక్కును కల్పించిందని మంత్రి గుర్తుచేశారు. ఎన్నికల్లో ఓటు వేయడం కేవలం బాధ్యత మాత్రమే కాదని, ప్రజాస్వామ్య వ్యవస్థలో మన గొంతును వినిపించే శక్తి అని పేర్కొన్నారు. ఓటు హక్కు కోల్పోతే ప్రజాస్వామ్యంలో పౌరుడి భాగస్వామ్యం తీవ్రంగా దెబ్బతింటుందని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల ఓటు హక్కును కాపాడుకోవడం ద్వారా రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టాలని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. దేశంలో అనేక కీలక సంస్కరణలు తీసుకొచ్చి ప్రజల సంక్షేమానికి కృషి చేసిన పార్టీ కాంగ్రెస్ అని మంత్రి తెలిపారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం ఢిల్లీలో నిరసన కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. ఢిల్లీ నిరసన సభను విజయవంతం చేసేందుకు మక్తల్ నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మఖ్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి నివారణకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

- తెలంగాణ ఉద్యమకారులకు అవకాశం కల్పించాలి.
- ప్రతి మండలంలో ఒక టీం బృందాలను ఏర్పాటు చేయాలి.
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావులకు విజ్ఞప్తి.
- మీసాల రామన్న - తెలంగాణ ఉద్యమ కళాకారుడు

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.
ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో, ప్రజలకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించే కార్యక్రమాల్లో తెలంగాణ ఉద్యమ కళాకారులకు అవకాశం కల్పించాలని, తెలంగాణ ఉద్యమ కళాకారుడు మీసాల రామన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాటలు, ఆటలు, జానపద కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యపరిచిన ఉద్యమ కళాకారులు, రాష్ట్ర సాధన కోసం తమ కలనే ఆ విధంగా మల్చుకొని పోరాటం చేసిన తెలంగాణ ఉద్యమకారులు, నేడు ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలానికి ఒక తెలంగాణ ఉద్యమ కళాకారుల బృందాన్ని ఏర్పాటు చేసి, నీటి

సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, కళారూపాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే విధంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సాంస్కృతిక సారథి కళాకారులతో పాటు తెలంగాణ ఉద్యమ కళాకారులకు కూడా సముచిత ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. ఉద్యమ కళాకారుల సేవలను గుర్తించి ఉపాధి అవకాశాలు కల్పించాలని మీసాల రామన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు ఐక్య పోరాటం

- హక్కుల కోసం సంఘటిత ఉద్యమానికి సిద్ధం కావాలి: టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్

- రేవల్లిలో ఘనంగా టీయూడబ్ల్యూజే, ఐజేయూ జిల్లా కార్యవర్గ సమావేశం

రేవల్లి, అక్టోబరు 30 (ప్రజాజ్యోతి):
జర్నలిస్టుల దీర్ఘకాలిక ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా ఉద్యమించాలని టీయూడబ్ల్యూజే, ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు మాధవరావు అధ్యక్షతన నిర్వహించిన యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధనకు సంఘటిత పోరాటమే మార్గమని పేర్కొన్నారు.
హామీ మేరకు ఇళ్ల స్థలాలు కల్పించాలి
ఎన్నో ఏళ్లుగా ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టులకు సొంత ఇళ్ల స్థలాలు లేకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం

స్పందించి ఇళ్ల స్థలాల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల భవిష్యత్తు కార్యాచరణపై చర్చించేందుకు నవంబర్ 4న రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యధికంగా వనపర్తి జిల్లాలో 409 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు అందేలా జిల్లా కమిటీ కృషి చేయడాన్ని అభినందించారు. మిగిలిన అర్హులకు అక్రిడిటేషన్, హెల్త్ కార్డులు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రేవల్లి సింగిల్ విండో కాంప్లెక్స్‌లోని ఖాళీ షట్టర్‌లో ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు యూనియన్ తరఫున ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. జర్నలిస్టులు పక్షపాతానికి తావులేకుండా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు.
అన్యాయాలపై ప్రశ్నించాలి
ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ప్రశాంత్ మాట్లాడుతూ సమాజంలో జరిగే అన్యాయాలు, అక్రమాలపై జర్నలిస్టులు ప్రశ్నించినప్పుడే పరిష్కారానికి మార్గం ఏర్పడుతుందన్నారు. జిల్లా అధ్యక్షుడు మాధవరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎన్. శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి రాజు, కోశాధికారి మన్యం, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు అంజి, సీనియర్ జర్నలిస్టులు నాగేంద్రాచారి, శ్రీనివాసరావు, వనపర్తి పట్టణ యూనియన్ అధ్యక్షుడు తైలం అరుణ్ రాజ్, పెబ్బేరు, శ్రీరంగాపురం, రేవల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు బాలవర్ధన్, బాలరాజు, హరీష్, కార్యదర్శి నవీన్, గణేష్, రామకృష్ణ, దామోదర్, అశోక్, రవీందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పుల్గర్‌చర్లలో తీరని విషాదం.. ఒకరి వెంట ఒకరు మృతి!

భర్త అంత్యక్రియలు ముగిసిన మరుసటి రోజే భార్య కన్నుమూత.. కీర్తి, చంటి జీవితాల్లో తీరని విషాదం!

వీపనగండ్ల, ప్రజాజ్యోతి రిపోర్టర్:
మండల పరిధిలోని పుల్గర్‌చర్ల గ్రామంలో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. ఎంతో అన్యోన్యంగా కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా జీవించిన భార్యాభర్తలు ఒక్కరోజు వ్యవధిలోనే మృతి చెందడంతో గ్రామంలో విషాద

ఛాయలు అలుముకున్నాయి.గ్రామానికి చెందిన చాకలి నిరంజన్ గురువారం గుండెపోటుతో మృతి చెందారు. భర్త మరణవార్తతో భార్య మొగులమ్మ తీవ్ర మనోవేదనకు గురయ్యారు. గురువారం భర్త అంత్యక్రియలు పూర్తయిన అనంతరం అదే రోజు రాత్రి మొగులమ్మ అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన కర్నూలు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే విధి మరోలా తలచడంతో శుక్రవారం ఉదయం మొగులమ్మ కన్నుమూశారు.ఒకరి మరణాన్ని మరొకరు తట్టుకోలేనంత అనుబంధంతో జీవించిన దంపతులు ఇలా ఒకరి వెంట ఒకరు మృత్యువాత పడటం కుటుంబ సభ్యులను, బంధువులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. వీరికి కీర్తి అనే కుమార్తె, చంటి అనే కుమారుడు ఉన్నారు. విధి ఆడిన వింత నాటకంలో ఒక్కరోజు వ్యవధిలోనే తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయి కీర్తి, చంటి అనాథలుగా మిగిలారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న తల్లిదండ్రులు ఇద్దరూ దూరం కావడంతో పిల్లల పరిస్థితి తలచుకుని గ్రామస్తులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈ విషాద ఘటన పుల్గర్‌చర్ల గ్రామంలో ప్రతి ఒక్కరినీ కలచివేసింది.

ఎంబిబిఎస్ సీట్ సాధించిన విద్యార్థికి సన్మానం.డాక్టర్.ప్రేమ్ కుమార్.

గద్వాల (ప్రజా జ్యోతి) అక్టోబర్ 30;
మారుమూల గ్రామం శెట్టి ఆత్మకూరు జోగులాంబ గద్వాల జిల్లా కు చెందిన నారాయణ మాణిక్యమ్మ దంపతులకు జన్మించిన దీపిక.కరీంనగర్ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించడం గ్రామానికే గర్వకారణం అని సామాజిక విప్లవకారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ అన్నారు.గవర్నమెంట్ స్కూల్ మరియు

గవర్నమెంట్ కాలేజీ లో చదివి కష్టపడి సీటు సాధించిన దీపిక గద్వాల జిల్లా విద్యార్థులకు ఆదర్శం అని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ అన్నారు. వ్యవసాయ కూలి చేస్తున్న తల్లి తండ్రుల సహాయంతో ఎంతో శ్రమించి సాధించి. అంతే కాక ఆమె భవిష్యత్ లో డాక్టర్ విద్యను పూర్తి చేసుకొని పేద ప్రజలకు వైద్య సేవలను అందించాలని ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా ఎంబిబిఎస్ సీటు సాధించిన ఆమెను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

హన్మకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 30, (ప్రజా జ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన నాణ్యమైన వైద్య సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని సి.హెచ్.సి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ కి ప్రతిరోజు ఎంతమంది ఓపి సేవల నిమిత్తం వస్తుంటారని, పేషెంట్ల వివరాలు ఆన్లైన్లో నమోదు చేస్తున్నారా అని వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని మేల్, ఫిమేల్ వార్డులను, ఓపి నమోదును కలెక్టర్ పరిశీలించారు. టీకాల గది, మెడికల్ రికార్డు విభాగం, మెడికల్ స్టోర్ ను తనిఖీ చేశారు. ఆసు పత్రిలో వైద్యులు సిబ్బంది హాజరు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకుని రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం పెంచే విధంగా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగులకు ఆరోగ్య కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పేషంట్లకు అవసరమైన అన్ని సదుపాయాలు ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మందుల నిర్వహణ సరిగ్గా ఉండాలన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదు!

- ప్రతి గ్రామంలో 100 మంది కూలీలు తప్పనిసరిగా పనులకు రావాలి
- లేబర్ రిపోర్టు తక్కువగా ఉంటే ఫీల్డ్ అసిస్టెంట్లపై వేటు తప్పదు
- డిఆర్డిఓ నాగపద్మజ తీవ్ర హెచ్చరిక

పర్వతగిరి, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి) : ఉపాధి హామీ పనుల అమలులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని డిఆర్డీఓ నాగపద్మజ ఫీల్డ్ అసిస్టెంట్లను తీవ్రంగా హెచ్చరించారు. వ్యవసాయ పనులు లేని ప్రస్తుత తరుణంలో కూలీలకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యతను విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో కనీసం 100 మంది కూలీలతో పనులు నిర్వహించాలని తేల్చిచెప్పారు. శుక్రవారం మండలంలోని వడ్లకొండ, రోలకల్, నారాయణపురం, పర్వతగిరి గ్రామాల్లో జరుగుతున్న విబి- జి రామ్ జి పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు, లేబర్ రిపోర్టులు ఆశించిన స్థాయిలో లేకపోవడంపై సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించాల్సిన బాధ్యత మీది కాదా? అంటూ నిలదీసినట్లు తెలిసింది. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కూలీలను సమీకరించడంలో ప్రత్యేక చొరవ చూపాలని, ఉదయం నుంచే పనులకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేసి రోజుకు రూ.308 వేతనం పొందేలా కూలీలకు అవగాహన కల్పించాలని సూచించారు. అంతేకాకుండా ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, గ్రామ సంస్థ (విఓ) భవనాల నిర్మాణాలను పది రోజుల్లోగా పూర్తి చేయాలని గడువు విధించారు. లక్ష్యాల సాధనలో ఎలాంటి జాప్యం జరిగినా బాధ్యులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు,విబి- జి రామ్ జి సిబ్బంది, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష పార్టీలను అణిచివేయడానికి కుట్రలు పన్నుతున్న నరేంద్ర మోడీ అమిత్ షా

నర్సంపేట అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి) : నర్సంపేట కాంగ్రెస్ పార్టీ జాతీయ మాజీ అధ్యక్షుడు పార్లమెంటు ప్రతిపక్ష పార్టీ నేత రాహుల్ గాంధీ పిలుపుమేరకు నవంబర్ 1న ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో నిర్వహించు ర్యాలీకి నర్సంపేట నియోజకవర్గం నుండి కాంగ్రెస్ నాయకులు బయలుదేరడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వేముల సాంబయ్య గౌడ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి చిట్యాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఓట్ చోరీ జరుగుతుందని పౌరుల హక్కులను హరించి జాతి మనుగడను దెబ్బతీయడంతో పాటు ప్రతిపక్ష పార్టీలను అణిచివేయడానికి నరేంద్ర మోడీ అమిత్ షా జ్ఞానేష్ కుమార్ లు కుట్ర చేస్తున్నారని ఈ కుట్రను తిప్పి కొట్టడంలో భాగంగా నవంబర్ 1న రామ్ లీలా మైదానంలో ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని ఆ కార్యక్రమానికి నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి సూచనల మేరకు నియోజకవర్గం నుండి 150 మంది ముఖ్య నాయకులు వివిధ ట్రైన్ల ద్వారా బయలుదేరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లబెల్లి మండల అధ్యక్షులు మాలోతు చరణ్ సింగ్, నర్సంపేట కౌన్సిలర్ మాత్రు రాథోడ్, పిఎసిఎస్ చైర్మన్ రఘుపతిరావు,నల్లవెల్లి మండలం సర్పంచుల పోరం అధ్యక్షులు ఇఫ్తార్ శేఖర్, నందిగామ సర్పంచ్ భాస్కర్ మాజీ ఎంపిటిసి రవీందర్ నర్సంపేట పట్టణ కమిటీ సభ్యులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్,22వ డివిజన్ అధ్యక్షులు కోయ్యడి కిరణ్ కుమార్,కాంగ్రెస్ పార్టీ నాయకులు దూలపల్లి రవీందర్ రావు,మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలి

- బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి
- రైతులు నీళ్లు అడిగితే కేసులు పెడతారా? రైతుల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం
- ఎమ్మెల్యేకు కోపం ఉంటే కేసులు పెట్టుకోండి, రైతులకు సాగునీరు అందించండి
- కడియం శ్రీహరి, బీర్ల ఐలయ్య కాలువల ద్వారా నీళ్లు తరలించుకుపోతుంటే పాలకుర్తి రైతులకు నీళ్లేవి?
- ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరిక

దేవరుప్పుల, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): దేవరుప్పుల మండలంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి రైతులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ పార్టీ జనగామ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి దేవరుప్పుల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం తహసీల్దార్ అశ్వక్ అహ్మద్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పల్లా సుందర్ రాంరెడ్డి మాట్లాడుతూ "దేవరుప్పుల మండలంలో సాగునీరు అందక పంటలు కళ్ళ ముందే ఎండిపోతున్నాయి. అన్నదాతలు తీవ్ర ఆందోళనలో ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తోంది. రైతులు తమ హక్కుగా సాగునీరు అడిగితే కేసులు నమోదు చేస్తారా? రైతుల కోసం పోరాడుతున్న మాపై ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదు, రైతుల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం" అని అన్నారు. ఎమ్మెల్యేకు కోపం ఉంటే కేసులు పెట్టుకోండి, రైతులకు సాగునీరు ఇవ్వండి అంటూ పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డిని కోరారు.

"పక్క నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, బీర్ల ఐలయ్యలు కాలువల ద్వారా నీటిని తరలించుకుపోతుంటే పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి, ప్రభుత్వానికి రైతుల కష్టాలు ఎందుకు కనిపించడం లేదు? ఎండిపోతున్న పంటలు పాలకుల కళ్లకు కనిపిం చడం లేదా? రైతుల కన్నీళ్లు తుడవాల్సిన పాలకులు ప్రేక్షకపాత్ర వహించడం దారుణం" అని నిలదీశారు.

తక్షణమే దేవరుప్పుల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, పంట నష్టపోయిన రైతులను గుర్తించి తగిన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. "ఇప్పుడు ఎన్నికలు లేవు కాబట్టి రాజకీయాలు చేయడం లేదు, కేవలం రైతుల కన్నీళ్లు తుడవాలని మాత్రమే వస్తున్నాం. రైతులను ఆదుకోకుండా కాలయాపన చేస్తే ప్రజల తీవ్ర ఆగ్ర హానికి గురికాక తప్పదు. ప్రజలే తగిన సమ యంలో సమాధానం చెబుతారు. రైతులకు న్యాయం జరిగే వరకు, సాగునీరు అందించే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా పోరాటం కొనసాగిస్తుంది" అని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బస్వ మల్లేష్ పార్టీ ప్రధాన కార్యదర్శి చింత రవి సర్పంచులు మైదం జోగేశ్వర్ పానుగంటి గిరి కోతి ప్రవంతి ప్రవీణ్ కుమార్ బస్వ వెంకన్న పార్టీ నాయకులు అనంతోజు కృష్ణమూర్తి తాటిపల్లి మహేష్ కొత్త జలంధర్ రెడ్డి మల్లిపెద్ది శ్రీనివాస్ రెడ్డి కూతాటి నరసింహులు కత్తుల విజయ్ కుమార్ రెడ్డి బండ రాములు మేకపోతుల నరసింహ వంగ అర్జున్ బానోతు రాజన్న నాయక్ భానోత్ నవీన్ నాయక్ మాచర్ల బాబు రత్నాకర్ రెడ్డి సుడిగేల హనుమంతు బోనగిరి యాకస్వామి నక్క రమేష్ కాడబోయిన గణేష్ బానోత్ గేమా నాయక్ గుండె రమేష్ పానుగంటి కృష్ణ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై ఉక్కుపాదం..

- 107 మంది అదుపులోకి!
- విస్తృత తనిఖీల్లో 29 మందికి డ్రగ్స్ పాజిటివ్
- 17 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు స్వాధీనం
- వరంగల్ సిపి ఎన్.శ్వేత

హన్మకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 30, (ప్రజా జ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత ఆధ్వర్యంలో పోలీసు బృందాలు ఆటోనగర్, కరీమాబాద్, కాశిబుగ్గ, శంభునిపేట, శివనగర్, ఎల్.బి.నగర్ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుకు, సమాజ భద్రతకు తీవ్ర ముప్పు అని పేర్కొన్నారు. డ్రగ్స్ సరఫరా, విక్ర యాలు, అక్రమ రవాణాకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. వ్యస నానికి గురైన వారికి చికిత్స, కౌన్సెలింగ్ అందించి సాధారణ జీవనంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలో భాగంగా రౌడీషీటర్లు, పాత నేరస్థులు, డ్రగ్స్ కేసుల్లో ప్రమేయం ఉన్నవారు, అనుమానితులతో కలిపి మొత్తం 107 మందిని అదుపులోకి తీసుకొని డ్రగ్స్ పరీక్షలు చేయగా, వారిలో 29 మందికి పాజిటివ్ రిపోర్ట్ వచ్చిందని, వీరిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, తెలిపారు. అలాగే సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 17 ద్విచక్ర వాహనాలు, 2 కార్లు, 3 ఎలక్ట్రిక్ మోటార్ పంపులను నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకున్నామని, అలాగే మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో మానవ అక్రమణ యాక్ట్ చట్టం కింద ఒక కేసు నమోదు చేశామని తెలిపారు. కమ్యూ నిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలతో మాట్లాడి ఆయా ప్రాంతాల్లోని నేరాలు, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం సేక రించామని, నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రతి కాలనీలో కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇకనుండి ఇదేవిదమైన ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, డ్రగ్స్ వినియోగం, విక్రయాలు లేదా ఇతర నేరాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే డయల్ 100 / 112కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని స్థానిక ప్రజలను కోరుతూ, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డిసిపి ధార కవిత వరంగల్ ఇంచార్జీ ఏసిపి నరసింహారావు మట్టేవాడ, ఇంతేజార్ గంజ్, మిల్స్ కాలనీ, మడికొండ, ఐటి కోర్ ఇన్స్పెక్టర్లు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోటంచ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్ బాబు

ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష

భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని కోటంచ శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు శుక్రవారం రోజున దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయానికి చేరుకున్న మంత్రికి అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య మంత్రికి వేదాశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలు, శేషవస్త్రాన్ని బహూకరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేసి ఆశీర్వదించారు.

అంతకుముందు ఆలయ పరిసరాల్లో నూతనంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌ను మంత్రి పరిశీలించారు. కాంప్లెక్స్ నిర్మాణం, నిర్వహణ, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ సంపత్ రావు, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గణపతి సచ్చిదానంద స్వామీజీ పర్యటన పోస్టర్ల ఆవిష్కరణ

కాటారం, అక్టోబర్ 30, ప్రజా జ్యోతి : గణపతి సచ్చిదానంద స్వామీజీ నవంబర్ 1న ఆదివారం మంథని, కాటారం మండలంలోని ధన్వాడ శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయాలను సందర్శించనున్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆహ్వానం మేరకు స్వామీజీ పర్యటన ఖరారైనట్లు విలాసాగర్ గ్రామ శాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు పూసల శశికాంత్ తెలిపారు. ఈ నేపథ్యంలో కాటారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెప్పల దేవేందర్ రెడ్డి ఆదేశాల మేరకు విలాసాగర్ గ్రామంలో గ్రామస్తులతో కలిసి స్వామీజీ పర్యటన పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామీజీ దర్శనం చేసుకొని ఆయన దివ్య ఆశీస్సులు పొందాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో గ్రామ యూత్ అధ్యక్షుడు రాజనాల నాగరాజు, అట్టేం సత్తయ్య, తిపిరి రమేష్, చిగురు శ్రీనివాస్, మంచినీళ్ల రమేష్, ప్రసాద్, అలీం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఇంకుడు గుంత నిర్మాణానికి శ్రీకారం

ముగ్గు పోసి పనులు ప్రారంభించిన సర్పంచ్ చీదురు శంకర్

పర్వతగిరి, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి) : వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలమట్టాన్ని పెంపొందించేందుకు పర్వతగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సామూహిక ఇంకుడు గుంత నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చీదురు శంకర్ ముగ్గు పోసి పనులకు శ్రీకారం చుట్టారు. వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకించేలా ఇంకుడు గుంతలు ఎంతో ఉపయోగపడతాయని, నీటి సంరక్షణతోనే భవిష్యత్తు తరాలకు నీటి భద్రత కల్పించగలమని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నీటి పొదుపునకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రఘు, ఉపసర్పంచ్ అనితా రమేష్, వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

హన్మకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 30, (ప్రజాజ్యోతి) : గురుకుల విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరు పరిధిలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదిలో మధ్యాహ్న భోజనానికి చేసిన వంటలను భోజన పదార్థాల నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. బియ్యం, కూరగాయలు, ఇతర నిత్యవసరాల నాణ్యతను తనిఖీ చేశారు. అదేవిధంగా విద్యార్థినుల డార్మెట్రీ గదులను, వాష్ రూమ్స్ ను పరిశీలించారు. విద్యార్థినులకు అందుబాటులో ఉన్న పుస్తకాలను పరిశీలించి వాటి గురించిన వివరాలను ప్రిన్సిపల్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ హాస్టల్‌లో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలన్నారు.

వంటగది, భోజనశాల, డార్మెట్రీ, టాయిలెట్స్ నిర్వహణ మెరుగ్గా ఉండాలని, పరిశుభ్రత ఉండేలా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. దోమలు రాకుండా మెష్ లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.

నూతన కార్పెట్ ఉత్పత్తులను ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి

పరకాల, అక్టోబర్ 30, (ప్రజాజ్యోతి) : పరకాల మండలం నాగారం గ్రామంలోని చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి మరియు విక్రయ సంఘం లిమిటెడ్ కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన కార్పెట్ ఉత్పత్తులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం మార్కండేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... చేనేత రంగం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని, చేనేత కార్మికుల శ్రమ, నైపుణ్యంతో తయారయ్యే ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు ఉందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సహకార సంఘాలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో సహకార సంఘాలకు నూతన ఎన్నికలు నిర్వహించిందని తెలిపారు. సహకార వ్యవస్థలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతూ సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. చేనేత కార్మికులు ఆధునిక ఉత్పత్తుల తయారీలో ముందుకు సాగుతూ నూతన మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణం బాగుందని అభినందించిన జిల్లా కలెక్టర్

హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 30, (ప్రజాజ్యోతి) : హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూనిపర్తి గ్రామంలో ముదిగొండ ధనలక్ష్మి అనే లబ్ధిదారు ఇందిరమ్మ ఇల్లును నిర్మించుకోగా ఈ సందర్భంగా లబ్ధిదారు గృహప్రవేశం చేసిన ఇందిరమ్మ ఇంటిని శుక్రవారం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పరిశీలించారు. ఇంటి నిర్మాణం గురించిన వివరాలతో పాటు ఇంకుడు గుంత, టాయిలెట్స్ కట్టుకున్నారా అని లబ్ధిదారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణం చాలా బాగా చేశారని లబ్ధిదారు ధనలక్ష్మి, వారి కుటుంబ సభ్యులను కలెక్టర్ అభినందించారు. మిగతా లబ్ధిదారులు కూడా నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని గృహప్రవేశాలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లను గుడిసెల్లో నివసించే వారికి మంజూరు చేసేందుకు ప్రాధాన్యత నిస్తుందని తెలిపారు. అదేవిధంగా గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నిర్మిస్తున్న జిపి భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ రాధిక, తహసిల్దార్ సురేష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థికి షూ లేస్ కట్టిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం

.విద్యార్థులపై ప్రేమాభిమానం చాటుకున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నల్లగొండ అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి ప్రతినిధి):
నకిరేకల్: విద్యార్థుల పట్ల ఆప్యాయత చూపుతూ ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఓ విద్యార్థికి స్వయంగా షూ లేస్ కట్టి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ

సంఘటన నకిరేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకుంది. పాఠశాలలో విద్యార్థులకు ఉచిత స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోగ్టా ఫైనాన్షియల్ సర్వీసెస్, యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్ (వసుదైక కుటుంబం) రాజస్థాన్ సంస్థల సహకారంతో అందించిన 275 స్కూల్ బ్యాగులను ప్రభుత్వ విప్ వేముల వీరేశం విద్యార్థినీ, విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్దే ఉంచుకొని విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. వచ్చే ఏడాది జూన్ 2027 నాటికి నకిరేకల్‌లో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎం. నాగయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే. రాములు, వసుదైక కుటుంబం, కోగ్టా ఫైనాన్స్ మేనేజర్ సీహెచ్. ప్రసన్న, ఎం. శంకర్, డి. సుధీర్ రెడ్డి, వివిధ ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఫార్మసిస్ట్ నాగరాజును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కిశోర్

తుంగతుర్తి, అక్టోబర్ 30,(ప్రజా జ్యోతి):

మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన ఫార్మసిస్ట్ తునికి నాగరాజుకు ఇటీవల రోడ్డు ప్రమాదంలో వెన్నుపూసకు గాయమై చికిత్స పొందుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను శుక్రవారం తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్ కుమార్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. వారి వెంట తిరుమలగిరి మున్సిపల్ చైర్మన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సీతయ్య, నాయకులు గుండగాని రాములు గౌడ్, గౌడిచర్ల సత్యనారాయణ, గోపగాని శ్రీను, రమేష్ గౌడ్, వెంకన్న, రవికుమార్, నవీన్, సాయికిరణ్, పసుపులేటి చింటూ తదితరులు ఉన్నారు.

బియ్యం ధరలు పెంచి ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు..!

మిల్లర్స్ ను కోరిన కలెక్టర్ బి. చంద్రశేఖర్

మిర్యాలగూడ, అక్టోబర్ 30,(ప్రజాజ్యోతి):
ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైస్ మిల్లర్లు బియ్యం ఎక్కువ ధరకు అమ్మకుండా తగ్గించి అమ్మాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మిల్లర్లను కోరారు. శుక్రవారం అయన మిర్యాలగూడ పట్టణం సమీపంలోని దాక్షాయిని పార్ బాయిల్డ్

రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులో బియ్యం తయారీ విధానం, ప్యాకింగ్, ట్రాన్స్పోర్ట్ ,తదితర వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, సెక్రటరీ బాబి, మిల్లు యజమానులు జేవి రమణ,తిరుపతిరావులతో మాట్లాడుతూ ఎల్ నీనో కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, అందువల్ల బియ్యం ఎక్కువ ధరలకు అమ్మకుండా ధరను తగ్గించి అమ్మాలని కోరారు . అదేవిదంగా నాణ్యమైన బియ్యం మార్కెట్లో ఉండేలా చూడాలని , బియ్యం హోల్ సేల్ , రిటైల్ అమ్మకం దారులకు కూడా ఈ విషయాన్ని తెలియజేయాలని కలెక్టర్ కోరారు.ఈ సందర్భంగా బియ్యం బస్తాల బరువు,ఖాళీ బస్తాలు,లేబుళ్లు, ప్యాకింగ్, ధరలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, డిఎస్ఓ వెంకటేష్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాంపతి నాయక్, తదితరులు ఉన్నారు.

ఢిల్లీ చుట్టూ రేవంత్ ప్రదక్షిణలు.. తెలంగాణకు ఒరిగిందేమిటి?

కేసీఆర్‌ను బద్నాం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ పనిగా మారింది

సొంత ఎమ్మెల్యేలే తిరుగుబాటు చేసే దుస్థితిలో కాంగ్రెస్

ప్రజా సమస్యలను గాలికొదిలిన రేవంత్ సర్కార్

ఎమ్మెల్సీ ఎన్నికల తో పాటు తుంగతుర్తిలో గులాబీ జెండా ఎగరడం ఖాయం

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: గాదరి కిషోర్ కుమార్

తుంగతుర్తి, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి):
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన ప్రజలకు మేలు చేయడం పక్కనపెట్టి రాజకీయ కక్ష సాధింపులకే పరిమితమైందని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. త్వరలో జరగనున్న ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ కార్యాలయంలో అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అధ్యక్షతన 6 మండలాలకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్చార్జి వై వెంకటేశ్వరరావు తో కలిసి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై నాయకులు, కార్యకర్తలకు ఎన్నికల కార్యాచరణపై దిశానిర్దేశం చేస్తూ మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులే గ్రామాల్లో ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కొంటూ, తిరుగుబాటు చేసే పరిస్థితులు ఏర్పడ్డాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి గ్రామంలో ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ సబ్బండ వర్గాలకు ఎన్నో హామీలు ఇచ్చి మోసం చేసిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ప్రజా సమస్యలను పరిష్కరించకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీని విమర్శించడమే పనిగా పెట్టుకుందని మండిపడ్డారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవిని కాపాడుకోవడం, రాజకీయంగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడం పైనే దృష్టి సారిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి 89 సార్లు ఢిల్లీకి వెళ్లినా రాష్ట్రానికి సాధించిన ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే ఢిల్లీ రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు.

కేసీఆర్ పాలనతోనే తెలంగాణకు ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి:

తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లపాటు ముందస్తు ప్రణాళికలతో అభివృద్ధి పథంలో నడిపించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని గాదరి కొనియాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఎలినోనో ,తుపాను వంటి ప్రకృతి విపత్తులపై కూడా ప్రభుత్వానికి సరైన అవగాహన, ముందస్తు చర్యలు లేవని విమర్శించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల తో పాటు తుంగతుర్తిలో గులాబీ జెండా ఎగరడం ఖాయం:

త్వరలో జరగనున్న ఉమ్మడి నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పట్టభద్రులను కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని సూచించారు. రాబోయే రోజుల్లో తుంగతుర్తి నియోజకవర్గంలో మళ్లీ గులాబీ జెండా ఎగరడం, రాష్ట్రంలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు గుజ్జ యుగేందర్ రావు, పలు మండలాల అధ్యక్షులు, తిరుమలగిరి మున్సిపల్ చైర్మన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డి, ఎస్ ఏ రజాక్, గుండగాని రాములు గౌడ్, పులుసు యాదగిరి గౌడ్,మాజీ వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం యాదవ్, దొంగరి శ్రీను,తునికి సాయిలు,పలు గ్రామాల సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా దర్గా హజ్రత్ లాల్ షా వలి, బాబా ఉర్సు ఉత్సవాలు

భువనగిరి,అక్టోబర్ 30(ప్రజాజ్యోతి):
వనగిరి పట్టణంలోని స్థానిక,సమద్ చౌరస్తా వద్ద గల దర్గా,హజరత్ లాల్ షా వలి బాబా రహేమాతుల్ల అలై ఉర్సు,ఉత్సవాలు అహ్మద్ జమాల్ షరీఫ్ ఫారోఖి పర్యవేక్షణ లో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా దర్గా పొందుతా రని వారు ఈ సందర్భంగా తెలియ జేశారు.భువన గిరి పట్టణంలో జరుగుతున్న, ఉర్సు ఉత్స వాలు శాంతి మార్గాలను మరియు,ప్రజల మధ్య ఐక్యతను పెంచు తుందని వారు అన్నారు. పట్టణంలో కులమతాలకు అతీతంగా ఉర్సు, ఉత్సవాలలో భక్తులు పాల్గొని,దేవుని యొక్క కృపకు పాత్రులు,

ముతవల్లి ఇంతియాజ్,నాయబ్ ముతవల్లి ఎండీ ఇస్తియాక్ అధ్యక్షతన పట్టణంలోని ఇస్లాంపూర మజీద్ నుండి గంధం ఊరేగింపు కల్మే షరీఫ్,నాతే షరీఫ్ ధార్మిక పాఠాలు పటిస్తూ హైదరాబాద్ మర్ఫా,డప్పు వాయి ద్యాలతో మరియు, పకీరుల విన్యా సాలతో గ్రంధం ఊరేగింపు ప్రారంభమై,ఆజాద్ రోడ్ సమద్ చౌరస్తా మీదుగా దర్గా వరకు కొనసాగింది గంధం ఊరేగింపు లో ముఖ్య అతిథులుగా ఎంబిటి పార్టీ అధికార ప్రతినిధి అంజదుల్లాహ్ ఖాన్ ఆసిఫ్ ఖాన్, గ్రంధాలయం చైర్మన్ అవేస్ చిస్తీ పట్టణ సీఐ, పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా గంధం లో పాల్గొనడం చాలా సంతోషం గా ఉందని అన్నారు.గంధం అనంతరం దర్గాలో పూల చాదర్ సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు జరిపి అనంతరం అన్నదాన కార్య క్రమం నిర్వహించారు.అలాగే దర్గా ముతవల్లి ఇంతియాజ్ మాట్లాడుతూ భువనగిరి పట్టణంలో ఎంతో ప్రాముఖ్యత గల దర్గా హజరత్ లాల్ షా వలి బాబా దర్గా,వద్ద భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్గా దీవెనలు అవుతున్నారని.ప్రతి పౌరుడు,శాంతి మార్గంలో నడిచి శాంతియుత వాతావ రణాన్ని,నెలకొల్పాలని వారు ఈ సందర్భంగా అన్నారు.అన్ని మతాలు శాంతియుతను నేర్పుతుంది శాంతి తోనే అభివృద్ధి సాధ్యమని సమ సమాజ నిర్మాణానికి ఇది చాలా దోహదపడుతుందని వారు అన్నారు.
అలాగే ఉర్సు ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి జిల్లా కలెక్టర్ కి డి.ఎస్పీ మరియు వైస్ చైర్ పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేష్వర్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ అలాగే పోలీస్ సిబ్బంది కి మున్సిపల్ కమిషనర్ కి శానిటేషన్ ఇన్స్పెక్టర్ కు వివిధ డిపార్ట్మెంట్ ల వారికి ప్రత్యేక ధన్య వాదములు తెలిపారు.ఈ కార్య క్రమంలో అమీన్ మెమన్ సయ్యద్ రఫీఖ్, ఎండీ ఫర్హాన్ అలీ ఖాద్రి ఎండీ కలీం,ఎండీ ఫాజిల్, ఎండీ అమాన్ ఎండీ సైఫ్ ఎండీ కాశిఫ్ కామ్రాన్ హుస్సేన్ రేయ్యాన్ ఫాజిల్ ఖాజా,అజీజ్, అమీన్ మెమన్ రాషెద్ వసీమ్ షకీల్ తదితరులు పాల్గొన్నారు.

జలసిరి పనుల పరిశీలన

ఆలేరు అక్టోబర్ 30(ప్రజాజ్యోతి):
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం మందనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో వి బి జి ఆర్ ఏ ఎం జి పథకంలో భాగంగా జలసిరి కార్యక్రమం కడ కంచి స్వామి భూమిలో చేపడుతున్న ఫారం పండు నిర్మాణ పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణతో పాటు రైతులు ఆదాయ వృత్తికి దోహదపడే వివిధ పనులను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. మునగ తోటల పెంపకం ఫారం పండ్ల నిర్మాణం ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ల

నిర్మాణం బోర్వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్ల ఏర్పాటు పశువుల షెడ్ల నిర్మాణం పశువులకు నీటితోట్ల ఏర్పాటు వంటి పనులను చేపట్టుకోవాలని రైతులకు కూలీలకు వివరించారు. కూలీలు రోజుకు 308 రూపాయలు కూలి లభించే విధంగా నిబంధనాల ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లోని చెరువుల్లో కూడిక తీర్థ పరులు చేపట్టడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచవచ్చని తద్వారా భూగర్భ జలాల అభివృద్ధికి వ్యవసాయ అవసరాలకు నీటి లభ్యత మెరుగుపడుతుందని తెలిపారు. ఈ తరహా నీటి సంరక్షణ గ్రామీణ అభివృద్ధి పనులను అన్ని గ్రామపంచాయతీలో ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేణుక ఉప సర్పంచ్ శశిరేఖ, డిఆర్డిఓ నాగిరెడ్డి, ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, తాసిల్దార్ ఆంజనేయులు, ఏపీఓ అరుణకుమారి, ఇన్చార్జి ఇంజనీరింగ్ కన్సల్టెంట్ రామచంద్రయ్య, టెక్నికల్ అసిస్టెంట్ మానస, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు

వనరులను పొదుపుగా వాడుకుందాం...

ఎల్ నినో పరిస్థితులను సమిష్టిగా ఎదుర్కొందాం..!

తన వేతనం డబ్బులతో తాగునీరు,పెరుగన్నం ఏర్పాటు చేస్తా ఎమ్మెల్యే బి ఎల్ ఆర్

నీటి సంరక్షణ చర్యలు ప్రతి ఒక్కరూ చేపట్టాలి

పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి పంటలు సాగు చేయాలి జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

మిర్యాలగూడ లో ఎల్ నినో పరిస్థితులపై అవగాహన సదస్సు

మిర్యాలగూడ, అక్టోబర్ 30,(ప్రజాజ్యోతి):
ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులందరి సమిష్టి కృషితో ఎల్ నినో పరిస్థితులను ఎదుర్కొందామని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి(బి ఎల్ ఆర్) అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణం లోని మినీ రవీంద్ర భారతి కళా వేదికలో 'ఎల్ నినో ప్రభావం– తీసుకోవాల్సిన చర్యలపై ' ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ
ఎల్ నినో తీవ్ర ప్రభావం చూపిస్తున్న దృష్ట్యా రాబోయే రోజుల్లో మనుషులు ,పశు సంపదనురక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయం, నీటిపారుదల,తాగునీరు, విద్యుత్ రంగాలలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని,ఇందుకుగాను అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులందరూ గ్రామాలకు వెళ్లి ప్రజలను చైతన్యం చేయాలనిపిలుపునిచ్చారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని 198 గ్రామపంచాయతీలు, 48 మున్సిపల్ వార్డుల్లో క్షేత్రస్థాయిలో ఎల్ నినో ప్రభావం పై విస్తృతంగా తెలియజేసి నీరు, విద్యుత్తు, భూగర్భ జలాలు పొదుపుగా వాడేలాచూడాలన్నారు. ఎల్ నినో తీవ్రం కాకముందే జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తే రాబోయే కాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉంటారని అన్నారు. నాగార్జునసాగర్ నుండి నీరు ఇచ్చే అవకాశం లేనందున రైతులు అప్రమత్తంగా ఉండి యాసంగి లో వరి పంట వేయవద్దని,ఆరుతడి పంటలు వేయాలని



కోరారు.గ్రామాలు ,మున్సిపాలిటీలలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని, పశుగ్రాశం కొరత రాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు తమ వద్ద ఉన్న పశుగ్రాసాన్ని డబ్బుల కోసం ఇతరులకు అమ్మకుండా జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. వి బి జి రాంజీ కింద వాననీటి సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలని, ఇంకుడు గుంతలు,ఊటకుంటలు ఏర్పాటుచేయాలన్నారు. బస్టాండ్లు,జనసమ్మర్ధం ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. వచ్చే జనవరి నుండి బిఎల్ఆర్ ఫౌండేషన్ ద్వారా తన 12 నెలల జీతంతో ప్రజలకు తాగునీటితో పాటు, పెరుగన్నం ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ తెలిపారు. సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు గ్రామాలలోనే ఉంటూ ప్రజల సమస్యలను తెలుసుకొని వారికి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. దామరచర్ల పెద్ద చెరువును మూసి నీటితో నింపాలని జిల్లా కలెక్టర్ ను కోరారు .

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ నీరు, విద్యుత్తు పొదుపుగా వాడాలని, యాసంగిలో వరి వేయవద్దని, పంటల మార్పిడి పాటించాలని, జొన్నలు ,పెసర్లు, మినుములు వంటి పంటలు వేసుకోవాలని కోరారు. వి.బి.జి రాంజీ కింద ఫీడర్ ఛానళ్లు చేపట్టాలని,అలాగే నీటి నిలువ కట్టడాలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా నల్గొండ జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎల్ నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు గ్రామస్థాయి వరకు మంచి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సర్పంచులు, గ్రామ కార్యదర్శులు గ్రామాలలో నీటి వనరులను ఆడిట్ చేయాలని, గ్రామాలలో ఏ వనరులు ఉన్నాయి, ఎన్ని రోజులు నీళ్ల వస్తాయోవిశ్లేషించాలని, నీటి లీకేజీలు లేకుండా, నీరు వృధా కాకుండా చూడాలన్నారు. నీటివనరులను కాపాడుకోవాలని, వివిజి రాంజీ కింద ఇంకా ప్రారంభం కాని పనులన్నింటిని వెంటనే ప్రారంభించాలని, నీటి నిలువ కట్టడాలు, కూలీలు ఎక్కువగా అవసరమయ్యే పనులు చేపట్టాలని,గ్రామాలలోని ప్రజలందరికీ సాధ్యమైనంత వరకు పని కల్పించాలని ఆదేశించారు.రైతు వేదికలలో ప్రతి మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని , శుక్రవారం రైతుల అవగాహన సదస్సులను నిర్వహించడం జరుగుతున్నదని, వాటిని రైతులు ఉపయోగించుకోవాలన్నారు.డిమాండ్ ఉన్న పంటలే సాగు చేయాలని, మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలుతీసుకుంటామని, డిమాండ్ ఉన్న పంటలకే మంచి ధర వస్తుందన్నారు. ప్రతి ఒక్కరు నీటి పొదుపు సూత్రాలుపాటించాలని, నీటిని వృధా చేయవద్దని, ఇంటి పై పడ్డ ప్రతి వర్షం నీటిని నీటి నిల్వ కట్టడాలు, సోక్ పిట్లు ,వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ కు మళ్లించాలని, విద్యుత్తును పొదుపు చేయాలని,ఎల్ నినో పరిస్థితులు,దాని ప్రభావం, తదనంతర పరిస్థితులపై వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని ,సర్పంచులు, అధికారులు, గ్రామ కార్యదర్శులు గ్రామస్థాయి నుండి మొదలుకొని జిల్లా స్థాయి వరకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు.స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,ఎల్ నినో , దాని ప్రభావం ప్రత్యామ్నాయ చర్యలు, తీసుకోవాల్సిన కార్యక్రమాలపై వివరించారు. వ్యవసాయ, భూగర్భ జలాలు, ఉద్యాన, తాగునీటి గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులు ఎల్ నినో నేపథ్యంలో వారి శాఖల ద్వారా రానున్న రోజుల్లో అమలు చేసే కార్యక్రమాలపై వివరించారు.ఈ కార్యక్రమం లో మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి,మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష ,కమిషనర్ శ్రీజ జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద కవితకు ఘన స్వాగతం

ఇందల్వాయి:(ప్రజా జ్యోతి) అక్టోబర్. 30:
ఇందల్వాయి మండల కేంద్రంలోని టోల్ ప్లాజా వద్ద నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి అలీమ్ భాయ్ ఆధ్వర్యంలో కవితకు ఘన స్వాగతం పలికారు. ఇంద్రవెల్లిలో నిర్వహించనున్న టీఆర్ఎస్ పంచజన్య మహాసభకు వెళ్తున్న

కవితకు టోల్ ప్లాజా వద్ద నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఇంద్రవెల్లిలో జరిగే పంచజన్య మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో టీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీకి అధికారం అప్పగిస్తే ఏం చేస్తుందో, గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏం చేసిందో, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తోందో ప్రజలకు బాగా తెలుసని అన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల్లో పార్టీకి ఆదరణ పెరుగుతోందని, పార్టీపై ఎంతోమంది ఆశలు పెట్టుకున్నారని, వారి ఆశలు నెరవేరాలని ఆకాంక్షించారు. అనంతరం ఇందల్వాయి టోల్ ప్లాజా నుంచి ఇంద్రవెల్లిలో జరిగే పంచజన్య మహాసభకు ఆమె బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో దొంత ప్రవీణ్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు రజాక్ భాయ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు ప్రేమ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మై ఫీల్డ్ రెస్టారెంట్ ప్రారంభం

ఇందల్వాయి (ప్రజా జ్యోతి) అక్టోబర్. 30:
ఇందల్వాయి: మండల కేంద్రంలోని టోల్ ప్లాజా సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మై ఫీల్డ్ రెస్టారెంట్‌ను తహసీల్దార్ జి. బాలయ్య, ఎంపీడీవో అనంతరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ యజమానులు కచకాల శ్రీనివాస్, పాశం కుమార్ మాట్లాడుతూ వినియోగదారులకు ఎప్పుడైనా, ఏ సమయంలోనైనా నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు మై ఫీల్డ్ రెస్టారెంట్ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ప్రత్యేకమైన రుచులతో, నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ వినియోగదారుల ఆదరణ పొందడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రెస్టారెంట్‌ను ఆదరించాలని కోరారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పలువురు గ్రామ సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింతల కిషన్, ఇందల్వాయి పీఏసీఎస్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై రెస్టారెంట్ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.

సిరికొండ పోలీస్ స్టేషన్‌లో పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం

సిరికొండ, ప్రజా జ్యోతి:
సిరికొండ మండల కేంద్రంలోని విద్యార్థుల్లో పోలీస్ శాఖ పనితీరు, విధులు, బాధ్యతలు, చట్టాలు మరియు పౌరుల

భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన పెంపొందించడంతో పాటు, చిన్ననాటి నుంచే చట్టాల పట్ల గౌరవం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను అలవర్చాలనే ముఖ్య ఉద్దేశంతో సిరికొండ పోలీస్ స్టేషన్‌లో పాఠశాల విద్యార్థుల కోసం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ధర్పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామన్ మరియు సిరికొండ ఎస్ఐ రామకృష్ణ హాజరై విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరు, పోలీసుల విధులు, బాధ్యతలు మరియు ప్రజల రక్షణ కోసం చేపట్టే వివిధ చర్యల గురించి వివరించారు.

పోలీస్ స్టేషన్ పనితీరుపై ప్రత్యక్ష అవగాహన:

ఈ సందర్భంగా విద్యార్థులను పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలకు తీసుకెళ్లి, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు ఎలా స్వీకరిస్తారు, ఎఫ్ఐఆర్ ఎలా నమోదు చేస్తారు, నేరాల దర్యాప్తు ఎలా నిర్వహిస్తారు, సాక్ష్యాధారాలను ఎలా సేకరిస్తారు, కేసులకు సంబంధించిన రికార్డులను ఎలా నిర్వహిస్తారు అనే విషయాలను వివరించడం జరిగింది. అలాగే పోలీస్ శాఖలో ఉపయోగించే వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థ, కంప్యూటర్లు, సీసీటీవీ కెమెరాలు, పోలీస్ వాహనాలు, ఇతర సాంకేతిక పరికరాలను విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించి వాటి ఉపయోగం, ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ శాఖ ఎలా స్పందిస్తుంది, ప్రజలకు ఏ విధంగా రక్షణ కల్పిస్తుంది అనే అంశాలపై అవగాహన కల్పించారు.

విద్యార్థులకు కల్పించిన ముఖ్యమైన అవగాహన అంశాలు:

రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నియమాలు: రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, కార్లలో సీట్ బెల్ట్ ఉపయోగించడం, మైనర్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండటం, రోడ్డు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడం జరిగింది. సైబర్ నేరాలు మరియు సోషల్ మీడియా వినియోగం: ప్రస్తుత కాలంలో పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ కాల్స్, ఓటీపీ మోసాలు, అనుమానాస్పద లింకులు, సోషల్ మీడియా ద్వారా జరిగే వేధింపులు మరియు వ్యక్తిగత సమాచార దుర్వినియోగం గురించి వివరించి, ఇంటర్నెట్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించడం జరిగింది. బాలల భద్రత మరియు వ్యక్తిగత రక్షణ: గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, బాలలపై జరిగే వేధింపులు, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తత, తమకు ఎదురయ్యే ఇబ్బందులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు వెంటనే తెలియజేయాల్సిన అవసరాన్ని వివరించడం జరిగింది. మాదకద్రవ్యాల నిర్మూలన: గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్ప్రభావాలను వివరించి, విద్యార్థులు ఎలాంటి చెడు అలవాట్లకు లోనుకాకుండా తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించడం జరిగింది. మహిళలు మరియు బాలికల భద్రత: మహిళలు, బాలికల పట్ల గౌరవభావంతో మెలగాలని, ఎలాంటి వేధింపులు లేదా అసభ్య ప్రవర్తనను సహించకుండా సంబంధిత అధికారులకు తెలియజేయాలని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ వారి భద్రతకు అందుబాటులో ఉంటుందని వివరించడం జరిగింది. చట్టాల పట్ల గౌరవం మరియు పౌర బాధ్యత: ప్రతి పౌరుడు చట్టాలను గౌరవించడం, ఇతరుల హక్కులను పరిరక్షించడం, సమాజంలో శాంతిభద్రతలకు సహకరించడం, నేరాలకు మరియు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండటం వంటి అంశాలను వివరించడం జరిగింది. అత్యవసర సేవలు మరియు పోలీసుల సహాయం: ఏదైనా ప్రమాదం, వేధింపులు, అనుమానాస్పద కార్యకలాపాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు డయల్ 112 ద్వారా పోలీసుల సహాయం పొందవచ్చని విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ధర్పల్లి సీఐ రామన్ మాట్లాడుతూ: విద్యార్థులే దేశ భవిష్యత్తు అని, వారు చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని సూచించారు. చిన్ననాటి నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండటం వల్ల భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు, మాదకద్రవ్యాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, తమ లక్ష్యాలను సాధించడానికి కష్టపడి చదవాలని సూచించారు. సిరికొండ ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ: పోలీస్ స్టేషన్ అనేది కేవలం నేరాలు జరిగినప్పుడు మాత్రమే సంప్రదించే ప్రదేశం కాదని, ప్రజల రక్షణ, భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం పనిచేసే వ్యవస్థ అని వివరించారు. ముఖ్యంగా విద్యార్థుల్లో పోలీసుల పట్ల ఉన్న భయాన్ని తొలగించి, పోలీస్ శాఖపై నమ్మకం మరియు స్నేహపూర్వక భావన పెంపొందించడమే ఓపెన్ హౌస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని, తమకు తెలిసిన నేరాలు, బాలలపై వేధింపులు, సైబర్ మోసాలు వంటి విషయాలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు సమాజంలో మంచి మార్పుకు దోహదపడే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని పోలీస్ అధికారులతో ముఖాముఖిగా మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. పోలీస్ స్టేషన్ పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకోవడంతో పాటు పోలీస్ శాఖలో ఉపయోగించే పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం, నేరాల నియంత్రణ విధానాల గురించి తెలుసుకుని ఆసక్తి కనబరిచారు. ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోలీస్ వ్యవస్థపై ప్రత్యక్ష అవగాహన కల్పించడంతో పాటు, పోలీస్ మరియు ప్రజల మధ్య, ముఖ్యంగా విద్యార్థులు మరియు పోలీసుల మధ్య స్నేహపూర్వక సంబంధాలను మరింత బలోపేతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ధర్పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామన్, సిరికొండ ఎస్ఐ రామకృష్ణ మరియు సిరికొండ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు

ఆరుతడి పంటలు వేసుకోవాలని అవగాహన సదస్సు

సిరికొండ, ప్రజా జ్యోతి
సిరికొండ మండలంలోని పెద్ద వాల్గోట్ గ్రామంలో రైతులకు ఎల్ నినో ప్రభావం, ఆరుతడి పంటలు వేసుకోవాలని అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి టి నర్సయ్య మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గిపోవడం,

విద్యుత్ కొరత ఏర్పడే అవకాశం ఉన్నందువల్ల రైతులు వరి పంట బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయడంపై దృష్టి సాధించాలి. ఆరుతడి పంటలైన శనగలు మినుములు కుసుమ పొద్దుతిరుగుడు జొన్నలు కూరగాయలు వంటి తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలి. వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయడం వలన నేల యొక్క సారవంతం మరియు నీటిని నిలుపుకునే శక్తి మెరుగుపడుతుంది. నీటి వనరులను కాపాడుకోవడం వలన భవిష్యత్తులో నీటి కొరతను ఎదుర్కోవచ్చు. తక్కువ నేటితో పండే పంటలను ఎంచుకొని రైతులు నష్టపోకుండా ఆలోచన చేయాలి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిట్ల వనిత నర్సింగ్, ఉప సర్పంచ్ రాములు, వ్యవసాయ అధికారినర్సయ్య,ఏఈఓ మోహన్ మరియు రైతులు పాల్గొనారు.

రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ నిధులు

భైరాపూర్ రైతు వేదికలో కార్యక్రమాన్ని వీక్షించిన బీజేపీ నాయకులు

బీర్కూరు, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి):
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్‌లో నిర్వహించిన పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్ కార్యక్రమంలో భాగంగా 24వ విడత కింద దేశవ్యాప్తంగా 9.34 కోట్ల

మంది రైతుల ఖాతాల్లో రూ.18,680 కోట్ల నిధులను నేరుగా జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని బీర్కూరు మండలంలోని భైరాపూర్ రైతు వేదికలో వ్యవసాయ అధికారి రాజేష్‌తో కలిసి బీజేపీ నాయకులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు నాగేళ్ల సాయికిరణ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో పంటలు దెబ్బతిని ఇబ్బందులు పడుతున్న రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేయకపోవడం విచారకరమన్నారు. రైతులకు న్యాయం చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి మల్లెల యోగేష్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కొమ్మినేని రాజేష్, యువ మోర్చా జిల్లా కార్యదర్శి సాయిబాబా, లక్కపల్లి, పొంచు గోండ, హనుమాన్లు, పండరి, ప్రవీణ్, నాగేష్, బసోల్ల సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మన్నాన్పల్లిలో అక్రమ వెంచర్లపై పంచాయతీ అధికారుల కొరడా!

ప్రజా జ్యోతి కథనానికి స్పందన.. అక్రమ నిర్మాణ పనులు నిలిపివేసిన ఎంపీఓ యాదగిరి..

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని వెంచర్ నిర్వాహకులకు హెచ్చరిక..

కొండాపూర్ ప్రజా జ్యోతి ప్రతినిధి:
కొండాపూర్ మండలం మన్నాన్పల్లి గ్రామ శివారులో అనుమతులు లేకుండా చేపడుతున్న వెంచర్ల నిర్మాణాలపై మండల

పంచాయతీ అధికారులు స్పందించారు. ప్రజా జ్యోతి జాతీయ దినపత్రికలో ఈ నెల 30న ప్రచురితమైన "మన్నాన్పల్లిలో అక్రమ నిర్మాణాల దందా" అనే కథనానికి స్పందించిన మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ) యాదగిరి సుడిగాలి పర్యటన చేపట్టి, అనుమతులు లేని నిర్మాణ పనులను నిలిపివేయించారు. మన్నాన్పల్లి పరిధిలోని సర్వే నంబర్లు 189 తదితర సర్వే నంబర్లలో, రఘునాథ్ డెవలపర్స్‌కు సంబంధించిన వెంచర్‌తో పాటు లక్ష్మారెడ్డిగూడ గేట్ సమీపంలోని ఉన్న వెంచర్ ప్రాంతంలో జరుగుతున్న నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. సంబంధిత అనుమతులు లేకుండా చేపడుతున్నట్లు గుర్తించిన నిర్మాణ పనులను నిలిపివేయాలని ఆదేశించారు.

అనుమతులు లేకుంటే చర్యలు తప్పవు:

ఎంపీఓ యాదగిరి:

ఈ సందర్భంగా ఎంపీఓ యాదగిరి మాట్లాడుతూ, పంచాయతీ నుంచి అవసరమైన అనుమతులు పొందకుండా ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెంచర్ యజమానులు ముందుగా అన్ని అనుమతులు పొందిన తర్వాతే నిర్మాణ పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ

ప్రజాజ్యోతి
మనసానిపల్లిలో నిర్మాణాల దందా!

నిర్మాణాలు చేపడితే ఉపేక్షించే ప్రసక్తే లేదని పేర్కొన్నారు.

వార్తా కథనంతో కదిలిన యంత్రాంగం!:

గ్రామాల్లో అనుమతులు లేని నిర్మాణాలు, వెంచర్ల వ్యవహారాలపై పత్రికల్లో కథనాలు వెలువడినప్పుడు అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, నిర్మాణ పనులు నిలిపివేయడంతోపాటు సంబంధిత వెంచర్లకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటారా? అనే అంశాలపై స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ పర్యటనలో ఎంపీఓ యాదగిరి వెంట పంచాయతీ కార్యదర్శి స్వాతి, గ్రామ సర్పంచ్ రామ్‌చందర్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సిద్దం ఉజ్వల్ రెడ్డి జన్మదిన వేడుకలు

★ సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలిచిన పార్టీ శ్రేణులు

జహీరాబాద్, అక్టోబరు 30
(ప్రజా జ్యోతి న్యూస్)
కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సిద్దం

ఉజ్వల్ రెడ్డి జన్మదిన వేడుకలను జహీరాబాద్ పట్టణంలో పార్టీ శ్రేణులు, నాయకులు అత్యంత ఘనంగా నిర్వహించారు. తమ నాయకుడి పుట్టినరోజును పురస్కరించుకుని కేవలం సంబరాలకే పరిమితం కాకుండా, ప్రజలకు ఉపయోగపడేలా పలు సామాజిక, సేవా కార్యక్రమాలను చేపట్టి ఆదర్శంగా నిలిచారు. ఈ వేడుకల్లో భాగంగా నాయకులు జహీరాబాద్ లోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. అక్కడ వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం ప్రజల కోసం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేసి విజయ వంతంగా నిర్వహించారు. సమాజానికి ప్రాణదానం చేసే ఉద్దేశ్యంతో స్థానికంగా ఉన్న వాసవీ కళ్యాణ మండపంలో ప్రత్యేకంగా ఒక రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో యువకులు,కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సేవా కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ యునూస్, జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు పి.శ్రీకాంత్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు నాగిరెడ్డి, కౌన్సిలర్లు జమిలాలొద్దిన్, శ్రీధర్ రెడ్డి, మహ్మద్ జాఫర్, జావిద్, అరుణ్ కుమార్, అక్కాని, అక్రం, జహీంగిర్, నిజాం, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్ రెడ్డి, రవీందర్ చౌహాన్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్ బబ్లూ, ఎస్టీ సెల్ పార్లమెంట్ కోఆర్డి నేటర్ రాజు నాయక్,

ఎన్ఎస్ యుఐ ఆధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ ఆయా మండలాల అధ్యక్షులు సునీల్, సుభాష్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అక్తర్ గోరి, అశ్విన్ పాటిల్, ఇమామ్ పటేల్, మల్లికార్జున్, వెంకట్ రెడ్డి, బర్కత్, సంతోష్ రెడ్డి, జగదీశ్, రాములు, పాండు యాదవ్, పవన్ యాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎల్ నినో సవాలును సమష్టి కృషితో అధిగమిద్దాం

ఇప్పటి నుంచే నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలి

అనవసర ఖర్చులకు కళ్లెం వేయాలి.. ప్రజలకు చైర్‌పర్సన్ బొంది రజని పిలుపు

తూప్రాన్, ప్రజాజ్యోతి అక్టోబర్ 30: సూపర్ ఎల్ నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో తలెత్తే పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రజలంతా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తూప్రాన్ మున్సిపల్ చైర్‌పర్సన్ బొంది రజని రవీందర్ గౌడ్ కోరారు. నీటి వినియోగంలో క్రమశిక్షణ పాటించడంతో పాటు ఆర్థికంగా పొదుపు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కరోనా విపత్కర పరిస్థితులను ప్రజలంతా ఐక్యత, పరస్పర సహకారంతో అధిగమించిన విషయాన్ని గుర్తుచేశారు. అదే పట్టుదలతో రానున్న ఎల్ నినో సవాలును కూడా ఎదుర్కోవచ్చని ధీమా వ్యక్తం చేశారు. ఈ విషయంలో రైతులు, యువత, మహిళలు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఇంటి అవసరాల నుంచి వ్యవసాయ రంగం వరకు నీటిని అవసరమైన మేరకే వినియోగించాలని, ప్రతి నీటి చుక్కను కాపాడుకోవాలని సూచించారు. వ్యవసాయంలో నీటి పొదుపునకు దోహదపడే ఆధునిక పద్ధతులను అనుసరించాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా అనవసర ఖర్చులను తగ్గించుకుని ఆర్థికంగా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని పేర్కొన్నారు. వచ్చే పరిస్థితులపై ఆందోళన చెందకుండా అప్రమత్తతతో వ్యవహరించడం ముఖ్యమని, ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా పొదుపు చర్యలు చేపట్టినప్పుడే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని చైర్‌పర్సన్ తెలిపారు. నీటి సంరక్షణను సామాజిక బాధ్యతగా భావించి, ఐకమత్యంతో ముందుకు సాగితే ఎలాంటి సవాలునైనా అధిగమించవచ్చని బొంది రజని రవీందర్ గౌడ్ పేర్కొన్నారు.

100 శాతం రాయితీపై రైతులకు పొద్దుతిరుగుడు విత్తనాల పంపిణీ

కొండపాక, అక్టోబర్ 30: (ప్రజా జ్యోతి):– జాతీయ నూనె గింజల ఉత్పత్తి పథకం ద్వారా రైతులకు 100 శాతం రాయితీపై పొద్దుతిరుగుడు విత్తనాలను పంపిణీ చేశారు. శుక్రవారం దుద్దెడ రైతు వేదికలో కొండపాక

మండల రైతులకు 100 ఎకరాలకు సరిపడా KBSH–85 రకం పొద్దుతిరుగుడు విత్తనాలను అందజేశారు. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నూనె గింజలు, పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ విత్తనాలను పూర్తి రాయితీపై అందిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి శివరామకృష్ణ తెలిపారు. రైతులు వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి నూనె గింజలు, పప్పుధాన్యాల పంటల సాగును పెంచాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా విడుదల చేసిన పీఎం కిసాన్ 24వ విడత నిధుల కార్యక్రమాన్ని దుద్దెడ రైతు వేదిక నుంచి రైతులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో కొండపాక మండల మార్కెట్ కమిటీ చైర్మన్, వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.

ఉద్యానవన విశ్వవిద్యాలయంలో ఘనంగా పీఎం కిసాన్ ఉత్సవ్ కార్యక్రమం.

ములుగు,అక్టోబర్30 (ప్రజాజ్యోతి): శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో పీఎం కిసాన్ ఉత్సవ్ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ములుగు,నర్సంపల్లి,పెద్ద మసీదు నగర్,క్షీరసాగర్ గ్రామాల చెందిన సుమారు రైతులు పాల్గొన్నారు. రైతులను ఉద్దేశించి మోదీ ప్రసంగిస్తున్న సందేశాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఎల్ఈడి స్క్రీన్ పై చూపించారు.ఈ సందర్భంగా కూరగాయలు,పూలు,పండ్ల

పంట గూర్చి రైతులకు వివిధ ఉద్యాన పంటలపై శాస్త్రవేత్తలు శాస్త్రీయ సలహాలు,సూచనలు అందిస్తూ,ముఖ్యంగా ఏలినినో ప్రభావం వల్ల ఉద్యాన పంటల యాజమాన్యంపై అవగాహన కల్పిస్తూ ఎలినినో పరిస్థితుల్లో పంటల సాగుకు అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం, బిందు సేద్యం ద్వారా నీటిని యాజమాన్య,సమతుల్య పోషక,యాజమాన్యం,వాతావరణ పరిస్థితులకు అనువైన ఉత్తమ రకాల పంటల ఎంపిక,మెరుగైన సాగు పద్ధతులపై రైతులకు వివరించారు.అనంతరం రైతులకు మామిడి మొక్కలు,ఉద్యాన పంచాంగాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డా విజయ,డా సుచిత్ర,అసిస్టెంట్ ప్రొఫెసర్లు చంద్రశేఖర్,లావణ్య, సింధుజ తదితరులు పాల్గొన్నారు.

బాలలపై అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేయాలి: అల్లాదుర్గ్ సివిల్ జడ్జి సుచరిత

వేధింపులపై మౌనం వీడాలి.. ధైర్యంగా గొంతెత్తాలి..! బోడ్మట్‌పల్లి పాఠశాలలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు..

టేక్మాల్, అక్టోబర్ 30: (ప్రజా జ్యోతి ప్రతినిధి: బాలలపై జరిగే లైంగిక వేధింపుల నివారణ,

చిన్నారుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం టేక్మాల్ మండలంలోని బోడ్మట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 'సురక్షిత్ బచ్చన్

అభియాన్'లో భాగంగా బోలో బతావో. బచావో' నినాదంతో 2012 పోక్సో చట్టంపై విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అల్లాదుర్గ్ సివిల్ జడ్జి సుచరిత ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులను ద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి చిన్నారికి విద్యార్థికి సురక్షితమైన బాల్యాన్ని అందించడం మనందరి సమాజ బాధ్యత అని స్పష్టం చేశారు. విద్యార్థులకు వ్యక్తిగత భద్రతతో పాటు, సురక్షిత స్పర్శ (గుడ్ టచ్), అసురక్షిత స్పర్శ (బ్యాడ్ టచ్)ల గురించి చట్టపరమైన అంశాలను సులభంగా వివరించారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే భయపడకుండా, వేధింపులను మౌనంగా భరించకుండా వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ధైర్యంగా తెలియజేయాలని పిలుపునిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో చట్టపరమైన రక్షణ పొందడానికి ప్రతి విద్యార్థి పోక్సో చట్టంపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అవినాష్ కుమార్, ఏఎస్ఐ శంకర్, లీగల్ సర్వీస్ సిబ్బంది ఆంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాయిని జలాల్పూర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ

అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

కొల్చారం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగులగారి మల్లేశం గౌడ్

కొల్చారం, అక్టోబర్ 30(ప్రజాజ్యోతి): నిరుపేదలకు, గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడమే ప్రభుత్వ

లక్ష్యమని కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగులగారి మల్లేశం గౌడ్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని నాయిని జలాల్పూర్ గ్రామంలో సర్పంచ్ దేవి సింగ్ అధ్యక్షతన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగులగారి మల్లేశం గౌడ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు తప్పనిసరిగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇల్లు నిర్మించుకోకపోతే భవిష్యత్తులో ఇలాంటి పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. స్థానిక ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా బేగం మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు.అనంతరం కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులను లబ్ధిదారులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్రీనివాస్ చారి, హౌసింగ్ ఏఈ సుష్మ, పంచాయతీ కార్యదర్శి మౌనిక,

జీపీఓ పద్మ, ఉపసర్పంచ్ వెంకట నరసింహులు, గణపురం సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు యేసు రాజు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మయ్య, మండల నాయకులు రాయన్న, రాములు, మాజీ ఉపసర్పంచ్ గొల్ల వనజ పాండరి, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు చిత్తారి సంతోషిని భాస్కర్, గంగ స్వామి, దుర్గయ్య, ప్రసాద్, రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ, యువ నాయకులు వడ్ల గణేష్, చిత్తారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఘనపురం సర్పంచ్ గంగసాని రాజిరెడ్డి

ఘణపురం పాఠశాలలో అదనపు తరగతి గది ప్రారంభోత్సవం

తొగుట, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందుతోందని ఘనపురం గ్రామ

సర్పంచ్ గంగసాని రాజిరెడ్డి తెలిపారు. తొగుట మండలం ఘణపురం ప్రాథమిక పాఠశాలలో మండల విద్యాధికారి నర్సయ్య తో కలిసి గ్రామ సర్పంచ్ శుక్రవారం అదనపు తరగతి గది ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని, ఇష్టపడి చదువుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.చంద్రకళ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా తొగుట మండల విద్యాధికారి వి.నర్సయ్య, గుడికందుల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పి.అంజి రెడ్డి పాల్గొని గ్రామ సర్పంచ్ కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోధనం రమేష్, ఏఏపిసి చైర్ పర్సన్ బోనాల లావణ్య, పిఆర్టియు టి.ఎస్ తొగుట మండల శాఖ అధ్యక్షులు ఉపాధ్యాయులు పి. రాంచంద్రారెడ్డి, సీఆర్పీ వెంకట స్వామి, తల్లిదండ్రులు సంతోష్ రెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి, వనజ, రవీందర్, రాజ్ కుమార్, ప్రేమల, నవనీత తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ నిధులు

దౌల్తాబాద్ మండలంలో 94.84 లక్షల రూపాయల విడుదల

దౌల్తాబాద్, దొమ్మాట రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం సాగుభూమి సంరక్షణపై రైతులకు అవగాహన

దౌల్తాబాద్,అక్టోబర్ 30(ప్రజా జ్యోతి) అర్హులైన రైతులకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద రూ.94.84 లక్షల నిధులు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం దౌల్తాబాద్, దొమ్మాట రైతు వేదికల్లో ప్రధానమంత్రి కిసాన్ నిధుల విడుదల వ్యవసాయ శాఖ అధికారులు కార్యక్రమాన్ని రైతులతో కలిసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల ప్రాధాన్యాన్ని ఈ సందర్భంగా వివరించారు. అనంతరం దొమ్మాట రైతు వేదికలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి సాయికిరణ్ మాట్లాడుతూ రైతులకు భూసార పరిరక్షణ, సాగుభూమి ఆరోగ్యాన్ని కాపాడుకునే పద్ధతులపై అవగాహన కల్పించారు. భూమి సారవంతంగా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని, పచ్చిరొట్ట ఎరువుల వినియోగం ద్వారా భూమిలో సేంద్రియ కర్బన శాతాన్ని పెంచుకోవచ్చని సూచించారు.

అలాగే జీవన ఎరువుల వినియోగం, క్రమం తప్పకుండా భూసార పరీక్షలు చేయించడం, నేల స్వభావానికి అనుగుణంగా ఎరువులు వాడటం, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులపై వివరించారు. అవసరానికి మించి రసాయన ఎరువులు వినియోగించకుండా, శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువుల యాజమాన్యం చేపట్టాలని సూచించారు. రైతులకు ఉపయోగపడే ఫర్టిలైజర్ యాప్ వినియోగం, దాని ద్వారా ఎరువుల వివరాలు తెలుసుకునే విధానాన్ని కూడా వివరించారు. సాగు ఖర్చులు తగ్గించుకుంటూ భూసారాన్ని కాపాడుకోవడం, దీర్ఘకాలికంగా వ్యవసాయ ఉత్పాదకతను పెంచుకోవడమే సాగుభూమి సంరక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏఈవోలు గౌతమి, భార్గవి, అభిలాష్, నరేష్‌రెడ్డితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

త్రాగునీరు వృధా చేయవద్దు

జిల్లాలో ఎల్ నీ నో ప్రభావం సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పటిష్ట ప్రణాళిక

ఇందిరమ్మ ఇండ్లు గ్రౌండింగ్ పూర్తి కావాలి

బి వి జి రామ్ ఉపాధి పనులలో కూలీలను పెంచాలి

కలెక్టర్ ప్రతిమా సింగ్

అక్టోబర్ 30 మెదక్ జిల్లా బ్యూరో ప్రజాజ్యోతి : త్రాగునీటితో వృధా చేయొద్దని, ఇందిరమ్మ ఇండ్లు గ్రౌండింగ్ పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. శుక్రవారం కౌడిపల్లి మండలం ధర్మసాగర్ గ్రామపంచాయ తీ కార్యాలయాన్ని సంద ర్శించి, గ్రామంలోని

నీటి వనరుల లభ్యత ఇందిర ఇండ్లు వి బి జి రామ్ పనులపై ఎంపీడీవో తో కలిసి గ్రామపంచాయతీ కార్యాలయంలో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్ నీ నో ప్రభావం వల్ల త్రాగు నీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున, ప్రజలందరూ త్రాగునీటిని వృధా చేయొద్దని, నీటిని సంరక్షించాలన్నారు. గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న మొదటి ,రెండవ దశ ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పూర్తిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యి మొదలు పెట్టిన వారిని మోటివేషన్ చేసి,అధికారుల సూచనలతో తక్కువ ఖర్చుతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు.బి వి జి రామ్ జి ఉపాధి హామీ పథకంలో అనేక రకాల పనులు ఉన్నాయని, ఉపాధి హామీ పనులలో కూలీల సంఖ్యను పెంచి ఉపాధి కల్పించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, స్థానిక సర్పంచ్, అధికారులు తదితరులుపాల్గొన్నారు.

భూ రికార్డుల్లో పారదర్శకత కచ్చితత్వానికి భూభారతి రీ సర్వే

డిప్యూటీ తహశీల్దార్ జహీరోద్దీన్

దౌల్తాబాద్,అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి): భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు భూ రికార్డుల్లో పారదర్శకత, కచ్చితత్వం తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని డిప్యూటీ తహశీల్దార్ మహమ్మద్ జహీరోద్దీన్ తెలిపారు. భూ వివాదాలకు తావులేకుండా భూముల సరిహద్దులు, విస్తీర్ణం తదితర వివరాలను

క్షేత్రస్థాయిలో పరిశీలించి పక్కాగా నమోదు చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. శుక్రవారం దౌల్తాబాద్ మండల పరిధిలోని దీపాయంపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూభారతి రీ సర్వే కార్యక్రమంలో ఆయన పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. భూముల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. రీ సర్వే ద్వారా భూముల హద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాల్లో స్పష్టత ఏర్పడుతుందని, భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలు తగ్గేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. రైతులు, భూ యజమానులు సర్వే సిబ్బందికి అవసరమైన వివరాలు అందించి కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీపీఓలు రాఘవేందర్, సుమన్, మైసయ్య, లైసెన్సుడ్ సర్వేయర్ అస్లామ్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నిరసన

- ఉపాధ్యాయులు, ఔట్‌సోర్సింగ్, అతిథి సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్

పరిగి, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి) : తెలంగాణ మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, అతిథి ఉపాధ్యాయులు తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వివిధ సమస్యలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ తమ ఆవేదనను తెలియజేశారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పలు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. వాటిలో హెల్త్ కార్డుల మంజూరు, కారుణ్య నియామకాలు చేపట్టడం, సీపీఎస్ ఉద్యోగులకు మరణానంతర గ్రాట్యుటీ చెల్లింపు, మోడల్ స్కూల్స్‌ను విద్యాశాఖలో విలీనం చేయడం, టీజీటీలకు నోషనల్ ప్రయోజనాలు కల్పించడం, డీఏ బకాయిల చెల్లింపు, పీఆర్సీ వర్తింపజేయడం వంటి సమస్యలు ఉన్నాయి.

ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి, వీలైనంత త్వరగా పరిష్కరించాలని వారు కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని నిరసనకారులు పేర్కొన్నారు.

బిఆర్ఎస్ నాయకుల పోరాట ఫలితమే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

- కొత్వాల్ గూడ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొనమొల శ్రీనివాస్
- శంషాబాద్ - రాళ్ల గూడ రోడ్డులో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు

రాజేంద్రనగర్, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి) : బిఆర్ఎస్ నాయకుల కృషి ఫలితమే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం అయ్యాయని కొత్వాల్ గూడ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొనమొల శ్రీనివాస్ అన్నారు. ఎన్నో రోజులుగా శంషాబాద్ నుండి రాళ్ళగూడ వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అండర్ గ్రౌండ్ నుంచి పూర్తిగా ధ్వంసమై రోడ్డుపై ఏరులై పారుతుందని సమస్యను పరిష్కరించాలని కోరుతూ గత వారం రోజుల క్రితం కొత్వాల్ గూడ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొనమొల శ్రీనివాస్ ఆధ్వర్యంలో హెచ్ఎండిఏ, హెచ్జిసిఎల్ కార్యాలయంలో అధికారులను కలిసి వినతి పత్రం ఇచ్చే సమస్యను వివరించడంతో వెంటనే క్షేత్రస్థాయిలో హెచ్ఎండిఏ, హెచ్జిసిఎల్ అధికారులు పరిశీలించారు. అధికారులకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు త్వరగా పనులు ప్రారంభించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని మరోసారి తెలియ జేయడంతో వెంటనే అధికారులు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో నెలలుగా పెండింగ్లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభించే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు చేయడానికి పూర్తిగా స్వాగతిస్తూ వర్షం వ్యక్తం చేస్తున్నామని, ఇదంతా బిఆర్ఎస్ పార్టీ నాయకుల పోరాట ఫలితమే అన్నారు. అంతేకాకుండా త్వరగా రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి, రోడ్డును పనులు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ల కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి, నాయకులు చిల్కమర్రి పరంధాములు, చిన్నగండు రాజేందర్, భైరమోని మల్లేష్, మురళి గౌడ్, దర్శన్ గౌడ్, ఆనంద్ ముదిరాజ్, విజయ్ గౌడ్, శివ గౌడ్, ప్రవీణ్ గౌడ్, దీపక్ గౌడ్, చంద్ర శేఖర్, కనకటి శివ, సుశాంత్, శ్యామ్, వర్షిత్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్లు ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

- పట్టభద్రులందరూ ఫారం-18 ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి
- శంషాబాద్, కొత్వాల్ గూడ, డివిజన్ల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రదీప్ రెడ్డి
- బిఆర్ఎస్ పార్టీ తరపున శంషాబాద్, కొత్వాల్ గూడ డివిజన్లలో ఎమ్మెల్సీ ఎలక్షన్ ఓట్ ఎన్రోల్మెంట్ క్యాంప్ లు ఏర్పాటు

రాజేంద్రనగర్, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి) : శంషాబాద్, కొత్వాల్ గూడ డివిజన్లలో ప్రతి డిగ్రీ పట్టభద్రుడు రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదు చేసుకోవాలని శంషాబాద్, కొత్వాల్ గూడ, డివిజన్ల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొనమొల శ్రీనివాస్, కొలన్ ప్రదీప్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బిఆర్ఎస్ పార్టీ తరపున శంషాబాద్ డివిజన్, కొత్వాల్ గూడ డివిజన్లలో ఎమ్మెల్సీ ఎలక్షన్ ఓట్ ఎన్రోల్మెంట్ క్యాంప్ లు ఏర్పాటు ఏర్పాటు చేయడం జరిగిందని దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్క పట్టభద్రుడు తమ ఓటు హక్కు ఉచిత రిజిస్ట్రేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మీ ఓటు మీ హక్కు - ప్రజాస్వామ్యంలో మీ భాగస్వామ్యం అని, తెలంగాణ శాసన మండలి గ్రాడ్యుయేట్ ఎన్నికల కోసం అర్హులైన పట్టభద్రులందరూ వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ డిగ్రీ,నవంబర్ 1, 2023 లోపు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలని, ఓటర్ ఐడి కార్డు,ఆధార్ కార్డు,డిగ్రీ / గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్,పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో,మొబైల్ నంబర్, సంబంధిత డాక్యుమెంట్లతో వచ్చి ఏర్పాటు చేస్తే క్యాపుల వద్ద ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్వాల్ గూడ, శంషాబాద్ డివిజన్ల నాయకులు బుచ్చిరెడ్డి, చిల్కమర్రి పరంధాములు, చిన్నగండు రాజేందర్, భైరమోని మల్లేష్, మురళి గౌడ్, దర్శన్ గౌడ్, విజయ్ గౌడ్, శివ గౌడ్, ప్రవీణ్ గౌడ్, దీపక్ గౌడ్,చంద్రశేఖర్, కనకటి శివ, సుశాంత్, శ్యామ్, వర్షిత్, రోహిత్,రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

అంతారం సమీపంలో సరికొత్త హంగులతో
రాయల్ మినీ ఫంక్షన్ హాల్!

- వివాహాది శుభకార్యాలకు అన్ని సదుపాయాలు
- డ్వాక్రా సంఘాల మహిళలకు ప్రత్యేక రాయితీ
- ఆహ్లాదకరమైన వాతావరణంలో అత్యాధునిక సాంకేతికతతో రూపకల్పన

తాండూరు అక్టోబర్ 30 ప్రజా జ్యోతి : వికారాబాద్ జిల్లా తాండూరు మండలం అంతారం గ్రామ సమీపంలో సరికొత్త హంగులతో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న రాయల్ మినీ ఫంక్షన్ హాల్ వివాహాది శుభకార్యాలకు వేదికగా అందుబాటులోకి వచ్చింది. తాండూరు పట్టణాలకు వెళ్లి అధిక ఖర్చులతో ఫంక్షన్లు నిర్వహించాల్సిన అవసరం లేకుండా, గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ ఫంక్షన్ హాల్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆహ్లాదకరమైన వాతావరణం, సువిశాలమైన ప్రాంగణం, ఆధునిక సదుపాయాలతో రూపొందించిన ఈ ఫంక్షన్ హాల్‌లో వివాహాలు, నిశ్చితార్థాలు, పుట్టినరోజు వేడుకలు, శుభకార్యాలు, ఇతర కుటుంబ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమాలకు హాజరయ్యే అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ముఖ్యంగా వివాహాది శుభకార్యాలకు అవసరమైన భోజనాల తయారీతో పాటు క్యాటరింగ్ సదుపాయం కూడా అందుబాటులో ఉండటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందని తెలిపారు. ఒకే చోట వేడుకల నిర్వహణకు అవసరమైన సదుపాయాలు కల్పించడంతో నిర్వాహకులకు సమయం, శ్రమ ఆదా అవుతుందని భావిస్తున్నారు.

డ్వాక్రా మహిళలకు ప్రత్యేక రాయితీ :

మహిళా సంఘాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో డ్వాక్రా సంఘాల మహిళలకు ప్రత్యేక రాయితీ కల్పించడం అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు. మహిళా సంఘాల సమావేశాలు, ప్రత్యేక కార్యక్రమాలు, ఇతర శుభకార్యాలను నిర్వహించుకునేందుకు ఈ రాయితీ ఎంతగానో ఉపయోగపడనుందని నిర్వాహకులు వెల్లడించారు.

గ్రామీణ ప్రాంతంలో ఆధునిక సదుపాయాలతో కూడిన ఫంక్షన్ హాల్ అందుబాటులోకి రావడం స్థానిక ప్రజలకు ఎంతో సౌకర్యంగా మారనుంది. తక్కువ దూరంలోనే అందమైన వాతావరణంలో తమ కుటుంబ వేడుకలను ఆత్మీయుల మధ్య ఆనందంగా జరుపుకునే అవకాశం కలగనుంది. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా రాయల్ మినీ ఫంక్షన్ హాల్ సేవలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- తాగునీటి సమస్య రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్
- సాదాసీదాగా శంషాబాద్ మండల సర్వసభ్య సమావేశం
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సమీక్ష
- సర్వసభ్య సమావేశానికి 21 సర్పంచులకు గాను 13 సర్పంచులు హాజరు, మరో 8 మంది సర్పంచులు గైర్హాజర్

రాజేంద్రనగర్, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి) : గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.

శంషాబాద్ ఎంపీడీవో మున్ని అధ్యక్షతన శుక్రవారం శంషాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు వివిధ సమస్యలపై చర్చించారు.

సర్వసభ్య సమావేశానికి గ్రామంలోని 21 గ్రామ పంచాయతీల కుగాను 13 గ్రామ పంచాయతీల సర్పంచులు హాజరుకాగా మరో 8 మంది సర్పంచులు సమావేశానికి గైరాజర్ అయ్యారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచులు గ్రామాలలో విద్యుత్ సమస్యలు లో వోల్టేజ్ తో ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎలినో ప్రభావం వల్ల గ్రామాలలో తాగునీటి సమస్య కూడా తలెత్తే అవకాశం ఉందని దాన్ని దృష్టిలో ఉంచుకొని కొత్త బోర్లు వేస్తే మంచిది అని సూచించారు. గ్రామాలలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన నిధులు కొంతమందికి రాలేవని వాటిని కూడా త్వరగా విడుదల చేసేలా చూడాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేస్తే ప్రతి గ్రామ సర్పంచ్ హాజరు కావాలన్నారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులపై అధికారులతో సమీక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, వైద్య, విద్య వంటి మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహించరాదని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని తెలిపారు. శంషాబాద్ మండలంలో ఇప్పటికే 400కు పైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, వాటిలో 200 పూర్తికాగా మిగతావి కూడా త్వరగా పూర్తి అయ్యేలా అధికారులు, సర్పంచులు సమన్వయంతో పనిచేసే పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ఎల్నో ప్రభావంతో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా నీటిని వృధా చేయకుండా ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం వలన పెరుగుతాయని సూచించారు.

ఈ సమావేశంలో శంషాబాద్ మండలం ప్రత్యేక అధికారి సత్యనారాయణ,శంషాబాద్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కోటేశ్వర్ గౌడ్,వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బోడుప్పల్ సర్కిల్‌లో అధికారుల డబుల్ గేమ్

- ఒకచోట కూల్చివేతలు.. మరోచోట మౌనం!
- చిలుకనగర్ రోడ్డులో నిబంధనలు..
- ఆర్ఎన్ఎస్ కాలనీలో అక్రమ షెడ్లకు అండదండలు!

ఉప్పల్, అక్టోబర్ 30, (ప్రజాజ్యోతి) : బోడుప్పల్ సర్కిల్ పరిధిలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు తీవ్ర వివాదాస్పదమవుతోంది. అక్రమ షెడ్ల కూల్చివేతల్లో అధికారులు చూపుతున్న ద్వంద్వ ప్రమాణాలు,పక్షపాత వైఖరిపై స్థానికులు మండిపడుతున్నారు.ఎక్కడ ఏ నిర్మాణం కూల్చాలో.. ఎక్కడ మౌనం వహించాలో అధికారులే నిర్ణయించుకుంటు న్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.కార్పొరేషన్ ఆదాయానికి గండి కొడుతూ నిబంధనలను కాలరాస్తున్న అక్రమార్కులకు కొందరు సిబ్బంది అండగా నిలుస్తున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి చిలుకనగర్ వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఎలాంటి అనుమతులు లేవనే సాకుతో మున్సిపల్ అధికారులు హడావుడిగా రంగంలోకి దిగి,అక్కడ ఉన్న ఒక అక్రమ షెడ్డును "అనుమతి లేని నిర్మాణం" అంటూ కొలిచి కూల్చివేత చర్యలు చేపట్టారు సామాన్యులు లేదా చిన్న వ్యాపారులు అయినచోట చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నామని చెప్పడానికి అధికారులు ఈ ప్రాంతాన్ని ఉదాహరణగా చూపుతున్నారు,మరి అదే బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని ఆర్ఎన్ఎస్ కాలనీలో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. నిబంధనలకు విరుద్ధంగా,ఎలాంటి మున్సిపల్ అనుమతులు లేకుండా నిర్మించిన భారీ అక్రమ షెడ్డు ఆర్ఎన్ఎస్ కాలనీలో వెలిచినా అధికారులు దానివైపు కన్నెత్తి చూడటం లేదు. చిలుకనగర్ రోడ్డులో చూపించిన దూకుడు,నిబంధనల అమలు ఆర్ఎన్ఎస్ కాలనీ విషయానికి వచ్చేసరికి ఎందుకు మాయమైంది? ఆ షెడ్డు యజమానితో అధికారులు కుమ్మక్కయ్యారా?లేక భారీగా ముడుపులు అందడంతోనే అధికారులు ఈ అక్రమ షెడ్డుపై మౌనం వహిస్తున్నారా? అని స్థానికులు నిలదీస్తున్నారు ఒకచోట నిబంధనల పేరుతో కూల్చివేతలు చేయడం మరోచోట అంతకంటే పెద్ద అక్రమ షెడ్డును చూసీచూడనట్లు వదిలేయడం అధికారుల అవినీతికి నిదర్శనమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అధికారుల ఈ విచక్షణాధికారం కేవలం ఆర్థిక లావాదేవీల మీదే ఆధారపడి ఉందనే విమర్శలు తీవ్రతరం అవుతుండగా ఆర్ఎన్ఎస్ కాలనీలో అనుమతులు లేకుండా వెలిసిన ఆ అక్రమ షెడ్డుపై అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో వెంటనే వివరణ ఇవ్వాలని,చిలుకనగర్ రోడ్డులో ఏ విధంగా అయితే కూల్చివేతలు చేపట్టారో,అదే రీతిలో ఆర్ఎన్ఎస్ కాలనీలోని అక్రమ షెడ్డును కూడా తక్షణమే కూల్చివేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ బడా వ్యాపారులకు కొమ్ముకాస్తున్న బోడుప్పల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులపై పైఅధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అన్నదాతకు మోదీ భరోసా..పీఎం కిసాన్ రూ.2000 విడుదల

ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మ అనిల్

తలకొండపల్లి,అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని నాగర్ కర్నూల్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి పద్మ అనిల్ అన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా కోట్లాది మంది రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 24వ విడత నిధులను విడుదల చేయడం పట్ల తలకొండపల్లి మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ఈ పథకం ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి రూ.6000,ప్రతి విడతకు రూ.2000 చొప్పున నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోకి ఎలాంటి దళారులు లేకుండా జమ అవుతోందని, ఇది సన్నకారు, చిన్నకారు రైతులకు పెద్ద భరోసా అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం పీఎం కిసాన్‌తో పాటు పీఎం ఫసల్ బీమా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు,సాయిల్ హెల్త్ కార్డు వంటి అనేక పథకాలు అమలు చేస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తోందని పేర్కొన్నారు.రైతుల కష్టాలను గుర్తించి వారికి అండగా నిలుస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి,కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి రైతుల తరపున, తలకొండపల్లి మండల బీజేపీ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

అంత్యక్రియల కోసం ఆర్థిక సహాయం

తాండూరు అక్టోబర్ 30 ప్రజాజ్యోతి : పెద్దేముల్ మండలం ఊరెంటి తాండా కు చెందిన పవార్ మహేష్ అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతు మృతి చెందాడు. ఇట్టి విషయం తెలుసుకున్న కంజర్ల విజయ లక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధులు రాథోడ్ గోపాల్, స్థానిక వార్డు సభ్యుడు ,చవాన్ రవికుమార్ చేతుల మీదుగా మృతుడి అంత్యక్రియల కోసం కంజర్ల విజయ లక్ష్మి ఫౌండేషన్ ద్వారా రూ3 వేల రూపాయలను అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ఏమాత్రం అధైర్యపడొద్దని సూచించారు. ప్రతి పేద కుటుంబానికి కంచర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ అండగా ఉంటుంది అని చెప్పారు. వారితో పాటు తాండ నాయకులు ధన్ సింగ్, డాకు నాయక్, రతన్, నర్సింగ్ నాయక్, గోపాల్, మోహన్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో పరిగి విద్యార్థి ప్రతిభ

- ఎస్జీఎఫ్ అండర్-17 క్రికెట్ పోటీల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టు తరపున అస్లాం ప్రాతినిధ్యం

పరిగి, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి) : రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఎస్జీఎఫ్ అండర్-17 క్రికెట్ టోర్నమెంట్‌లో పరిగి మోడల్ స్కూల్ విద్యార్థి ఎండీ అస్లాం ప్రతిభ కనబరిచాడు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తూ క్రికెట్ పోటీల్లో తన ప్రతిభను చాటుకున్నాడు.

ఈ సందర్భంగా పరిగి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయ బృందం, పాఠశాల వ్యాయామ విద్యా ఉపాధ్యాయుడు అస్లాంను అభినందించారు. భవిష్యత్తులో మరింత కష్టపడి సాధన చేసి జాతీయ స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

అంగన్వాడీ సెంటర్‌లో చిన్నారులకు అల్పాహారం పంపిణీ

చేసిన సర్పంచ్ బోయిని వెంకటయ్య

దౌల్తాబాద్ అక్టోబర్, 30 (ప్రజాజ్యోతి): దౌల్తాబాద్ మండలం లోని ఇముడపూర్ గ్రామంలో అంగన్వాడీ సెంటర్ లో చిన్నారులకు అల్పాహారం పంపిణీ చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ బోయిని వెంకటయ్య మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం, ఎదుగుదలలో పోషకాహారం ఎంతో కీలకమని అన్నారు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు, చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు,చిన్నారులతో కొంత సమయం గడిపి వారికి అల్పాహారం పంపిణీ చేయడం ఆనందంగా ఉందని తెలి పారు. ఇలాంటి కార్యక్రమాలు చిన్నారుల్లో ఆరోగ్యం, పరిశుభ్రత పట్ల అవగాహన పెంపొందించేందుకు దోహదపడ తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్సింలు, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి సంతోష్,పంచాయతీ సెక్రెటరీ స్వాతి, అంగన్‌వాడీ సిబ్బంది సుశీల,విజయ లక్ష్మి,సాయిలు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి పనులపై యం,యం,సి కమిషనర్‌తో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చర్చ



ఉప్పల్, అక్టోంబర్ 30, (ప్రజాజ్యోతి) : ఉప్పల్ నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి యం యం సి కమిషనర్ విజయ్ కృష్ణారెడ్డి ఐఏఎస్ ను మర్యాదపూర్వకంగా కలిసి చర్చించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలకు అవసర మైన మౌలిక వసతుల కల్పన, రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం తదితర అభివృద్ధి పనులపై కమిషనర్‌తో ఎమ్మెల్యే వివరంగా చర్చించారు. ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు. ఉప్పల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందేలా అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు.

ఆయిల్‌పామ్, ఆరుతడి పంటలపై రైతులు దృష్టి సారించాలి

జిల్లా వ్యవసాయ అధికారి వద్దేపల్లి భాస్కర్

మల్లాపూర్, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో రైతులు యాసంగిలో వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేసి నీటిని పొదుపు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వద్దేపల్లి భాస్కర్ సూచించారు. పాత

దామ్‌రాజ్‌పల్లి గ్రామ పంచాయతీ వద్ద ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విదేశాల నుంచి వంట నూనెల దిగుమతులను తగ్గించేందుకు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని, డ్రిప్, స్ప్రింక్లర్ సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెసర, మినుము, నువ్వుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ డీడీ సుధాకర్, ఏడీఏ దండ రమేష్, తహసీల్దార్ రామచందర్, ఎంపీడీవో శ్రీకాంత్, సర్పంచ్ రాజేశ్వరి, ఆత్మ చైర్మన్ వాకిటి భూమారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వీఓ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఎండపల్లి, అక్టోబర్ 30 ప్రజా జ్యోతి

మండలంలోని పడకల్ గ్రామంలో మహిళా సంఘాల వీఓ (విలేజ్ ఆర్గనైజేషన్) భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ బెద్దల ప్రవీణ్ శంకుస్థాపన చేశారు. భవనం అందుబాటు

లోకి వస్తే మహిళా సంఘాల సమావేశాలు, ఇతర కార్యకలాపాల నిర్వహణకు సౌకర్యంగా ఉండనుంది. కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఏఈ పీఆర్ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి విజయ్, వీఓ అధ్యక్షురాలు, కమ్యూనిటీ కార్యక్రమాలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ కారోబార్, ఫీల్డ్ అసిస్టెంట్, నిర్మాణ కాంట్రాక్టర్ ఆకుల ప్రవీణ్ కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాలువలో మురుగునీటికి అడ్డుకట్ట!

పైపుల తొలగింపునకు నీటిపారుదల శాఖ చర్యలు, అధికారులకు సమస్యను వివరించిన సర్పంచ్ సంగ రమేష్,

ఎండపల్లి, అక్టోబర్ 30, ప్రజా జ్యోతి

మండలంలోని రాజారాంపల్లి గ్రామ పరిధిలోని ఎస్సారెస్పీ డి83.బీ సాగునీటి కాలువలోకి మరుగుదొడ్ల మురుగునీరు చేరుతుందన్న విషయాన్ని యువత గ్రామపంచా యతీ పాలకవర్గం అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన గ్రామపంచా

యతీ పాలకవర్గం కాలువలో మరుగు నీరు చేరకుండా అధికారులు చర్యలు చేపట్టారు. కాలువలోకి మురుగునీరు విడుదలవుతున్న విషయాన్ని గ్రామ సర్పంచ్ సంగ రమేష్ ఎస్సారెస్పీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన నీటిపారుదల శాఖ అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలువలోకి మురుగునీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్లను గుర్తించి గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో తొలగింపు చర్యలు చేపట్టారు. ఇకపై ఎవరైనా కాలువలోకి మురుగునీరు విడుదల చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కాగా సమస్య పై స్పందించిన సర్పంచ్‌కు గ్రామస్థులు యువత కృతజ్ఞతలు తెలిపారు.

లోక పేటలో పౌర హక్కుల దినోత్సవం.

ఎలిగేడు, అక్టోబర్ 30(ప్రజా జ్యోతి)<

గ్రామాల్లో కుల మతాలకు అతీతంగా ఉండి అభివృద్ధి చేసుకోవాలని ఎలిగేడు తహశీల్దార్ యాకన్న అన్నారు. బుధవారం ఎలిగేడు మండల లో లోక పేట గ్రామ

సర్పంచి అధ్యక్షతన గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ యాకన్న మాట్లాడుతూ గ్రామంలో ఎస్సీ కులస్తులపై కుల వివక్ష రెండు గ్లాసుల పద్ధతి అవలంబిస్తున్నారా అని తెలుసుకున్నారు. ఎవరైనా కుల వివక్ష అంటరానితనం చూపిస్తే చట్టపకారం కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, సర్పంచ్ జమున వేణు మాధవరావు ,ఎస్సీ వెల్ఫేర్ అధికారి అంజయ్య, ఏఎస్ఐ భాస్కర్, ఆర్ ఐ జయలక్ష్మి, జిపిఓ. సదానందం , పంచాయతీ కార్యదర్శి మసీద్దీన్, వార్డు సభ్యులు నరేంద్రావు, తిరుమలేష్ అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అనుమతి లేనిదే ఎలాంటి బోర్ లు వేయరాదు తహసల్దార్

ఇల్లంతకుంటఅక్టోబర్30(ప్రజా జ్యోతి)

ఎలినివో ప్రభావం తో రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలాన్ని కరువు మండలం గా ప్రకటిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసినట్లు తహసీల్దార్ రాచకట్ల సురేష్



కుమార్ శుక్రవారం రోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఎలినివో ప్రభావం దృష్ట్య మండలంలో అనుమతి లేనిదే నూతనంగా బోర్ లు వేయవద్దని, ఎవరైన వేసిన వాల్ల చట్టం ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుం దన్నారు. బోర్ వేల్ యాజమానులు రైతులు ఈ సమాచారం గుర్తించాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే
- ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి
- విద్యవైద్యానికి అధిక ప్రాధాన్యం
- మౌలిక వసతులు కల్పిస్తాం
- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

రాయికల్, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి) ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం రాయికల్ సమావేశంలో వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యమందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కేంద్రం లో మెడికల్ కాలేజి,సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు తో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. వృత్తిపరంగా డాక్టర్ నైనా నేను జగిత్యాల నియోజకవర్గం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.ఒపి,ఐపి సేవలు బాగున్నాయని సాధారణ ప్రసవాల కోసం వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడి వైద్య సేవలు,వసతులు అడిగి తెలుసుకు న్నారు.ఆసుపత్రిలో వసతులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నిధులు మంజూరు కు కృషి చేస్తామని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ మనోహర్ గౌడ్,తహసిల్దార్ నాగార్జున,కౌన్సిలర్ తోపారపు స్రవంతి సురేష్,వైద్యులు డాక్టర్ రామకృష్ణ,శుదక్షణ, శ్రీకాంత్,రజిత,సుధ,రాజ్

ప్రభుత్వ ఆసుపత్రిలో హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు.ఆస్పత్రిలో ప్రజలకు అందించిన వైద్య సేవల వివరాలను,అంది స్తున్న వైద్య సేవలను,హాస్పిటల్ లో కావలసిన మౌలిక వసతుల వివరాలను సూపరిండెంట్ డాక్టర్ శశికాంత్ రెడ్డి వైద్యులు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు.హాస్పిటల్ కు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సమస్యను ప్రభుత్వానికి, వైద్య ఆరోగ్య శాఖకు గురించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం హాస్పిటల్ లోని కుమార్,అఖిల,సిందూజ,లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్, హనుమాన్ ఆలయ చైర్మన్ దాసరి గంగాధర్,నాయ కులు కోల శ్రీనివాస్,తలారి రాజేష్,స్పందన సాగర్ రావు,మచ్చ శేఖర్,మున్ను, గుర్రం మహేందర్ గౌడ్, వైద్య సిబ్బంది నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడమే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యం ..!

రాయికల్, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి) ప్రజలకు సేవ చేయడమే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యం అని లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్ అన్నారు.శుక్రవారం రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామపం చాయతీలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్ రేకుర్తి కంటి హాస్పిటల్ వైద్యులచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.ఉచిత కంటి వైద్య శిబిరంలో 138 మందికి కంటి పరీక్షలు చేయగా 56మందిని ఆపరేషన్ కోసం గుర్తించి రేకుర్తి కంటి హాస్పిటల్ కు వైద్యతో సహా తరలి వెళ్లారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ సుమారు 3649 మందికి కంటి ఆపరేషన్లతో పాటుగా మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు.ఉచిత వైద్య సేవలు అందించేందుకు భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆదిరెడ్డి,మచ్చ శేఖర్,దాసరి గంగాధర్, కొత్తపెల్లి రంజిత్, బొడగం అంజిరెడ్డి,సత్యనారాయణ,ఆడెపు

నీరటి శ్రీనివాస్,లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్,కోశాధికారి సుధవేణి మురళి,మాజీ జడ్ సి లు మోర హన్మాండ్లు, మ్యాకల రమేష్,టెక్నీషియన్ ప్రభాకర్,క్లబ్ సభ్యులు కొమ్ముల రాంప్రసాద్, అశోక్,గ్రామీణ వైద్యులు శ్రీనివాస్,రొట్టె శ్రీధర్, మహేష్,విడిసి చైర్మన్ వెల్మల ప్రతాప్ రెడ్డి,సాయిరెడ్డి,సామల్ల వేణు,కార్యదర్శి రాజేష్,తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు లేక ప్రయాణికుల అవస్థలు ?

- వారపు సంతకు వచ్చే వారికి తప్పని ఇబ్బందులు,
- మహిళలు, వృద్ధులకు తప్పని సమస్యలు..
- సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు , మహిళల వేడుకోలు,

ఎండపల్లి, అక్టోబర్ 30, ప్రజా జ్యోతి జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలో మరుగుదొడ్ల సౌకర్యం లేక ప్రయాణికులు, అలాగే ప్రతి మంగళవారం జరిగే వారపు సంతకు వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి వారం నిర్వహించే సంతకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పలువురు వ్యాపారులు, కొనుగోలుదారులు వస్తుంటారు. సంతకు వచ్చే వారితో పాటు వివిధ పనుల నిమిత్తం గ్రామానికి చేరుకునే ప్రయాణికులకు కూడా మరుగుదొడ్ల సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మహిళలకు మరింత ఇబ్బంది మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారపు సంతకు వచ్చి ఎక్కువ సమయం గడిపే వారు అత్యవసర సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గ్రామంలో ప్రజల అవస రాలకు అనుగుణంగా కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

మరుగుదొడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

రాజారాంపల్లిలో వారపు సంతకు వచ్చే ప్రజలు, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని గ్రామపంచాయతీ అధికారులు మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు వాటి నిర్వహణ, పరిశుభ్రతకు తగిన ఏర్పాట్లు చేయాలని ,సంబంధిత అధికారులు గ్రామపంచాయతీ పాలకవర్గం సమస్యను పరిశీలించి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని వేడుకుంటు న్నారు

బ్లూ బెల్స్ హై స్కూల్‌లో ఘనంగా స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్

కరీంనగర్ టౌన్ అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి)

హనుమాన్ నగర్‌లోని బ్లూ బెల్స్ హై స్కూల్‌లో నిర్వహించిన స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్ ఎంతో ఉత్సాహభరితంగా జరిగింది. ఈ కార్యక్రమంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు సుమారు 450 మంది విద్యార్థులు పాల్గొని తమ సృజనాత్మకతను, ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ప్రోత్సాహాన్ని అందించింది. తెలుగు సబ్జెక్టులో సంక్రాంతి, ఉగాది వంటి పండుగల ప్రత్యేకతలు, మన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను విద్యార్థులు వివిధ నమూనాల ద్వారా వివరించారు. హిందీ సబ్జెక్టులో వంటి అంశాల ఆధారంగా ప్రకృతి విశిష్టతను, పండుగల ప్రాముఖ్యతను వివరిస్తూ ఆకర్షణీయమైన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇంగ్లీష్ సబ్జెక్టులో నిలిచింది. స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత,

మ్యాథ్స్, ఈ వి ఎస్ వంటి ఐదు సబ్జెక్టులకు సంబంధించి దాదాపు 140 విభిన్న ప్రాజెక్టులను విద్యార్థులు రూపొందించి ప్రదర్శించారు.<ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా చాడ జైపాల్ రెడ్డి . జిల్లా శాస్త్రాధికారి, శ్రీనివాస్ ప్లానింగ్ కోఆర్డినేటర్, పాఠశాల కరస్పాండెంట్ జంగా సునీత మనోహర్ రెడ్డి గ పాల్గొని విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించారు. విద్యార్థులు తమ ఆలోచ నలను ఆత్మవిశ్వాసంతో వ్యక్తపరుస్తూ, నేర్చుకున్న అంశాలను వినూత్న పద్ధతుల్లో ప్రదర్శించడం అభినందనీయ మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీ యడంతో పాటు, ఆచరణాత్మక విద్యకు నామవాచకాలు, క్రియలు, ప్రశ్నించడం,వంటి అంశాలను వివిధ నమూనాల ద్వారా వివరించారు. పదాల రకాలు, వాటి ఉపయోగాలు, ప్రశ్నలు అడిగే విధానం వంటి అంశాలను ఉదాహరణలతో సులభంగా అర్థమయ్యేలా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ ప్రాజెక్టుల గురించి స్వయంగా వివరిస్తూ, సందర్శకులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించారు. పుస్తకాల్లో నేర్చుకున్న విషయాలను కేవలం చదవడానికే పరిమితం కాకుండా, వాటిని ఆచరణలో చూపిస్తూ ఇతరులకు వివరించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ప్రత్యేకతగా తార్కిక ఆలోచనా శక్తి, కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, సమస్యలను పరిష్కరించే నైపుణ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయి. విద్యార్థులు స్వయంగా ఆలోచించడం, ప్రశ్నించడం, కొత్త విషయాలను అన్వేషించడం, నేర్చుకున్న అంశాలను ఇతరులకు వివరించడం వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదప డతాయి. మొత్తంగా, బ్లూ బెల్స్ హై స్కూల్‌లో నిర్వహించిన స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్ విద్యార్థుల ప్రతిభకు, సృజనా త్మకతకు, ఆత్మవిశ్వాసానికి చక్కని వేదికగా నిలిచింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం విజయ వంతంగా సాగింది.

దీపావళి కానుక పేరుతో సైబర్ మోసం.. రూ.8 వేలంటూ నకిలీ లింకుల ప్రచారం!

- వాట్సాప్‌లో వచ్చే ఆకర్షణీయమైన లింక్‌లను క్లిక్ చేస్తే ఖాతాలు ఖాళీ అయ్యే ప్రమాదం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరిక

కొనరావుపేట,అక్టోబర్.30(ప్రజాజ్యోతి)

దీపావళి పండుగను పురస్కరించుకుని ప్రజలను మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలకు పాల్పడుతున్నారు. పండుగ సీజన్‌ను ఆసరాగా చేసుకుని ప్రజలకు ఉచితంగా నగదు బహుమతులు అందిస్తున్నామంటూ నకిలీ సందేశాలను వాట్సాప్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా భారత ప్రభుత్వం దేశంలోని పౌరులందరికీ దీపావళి కానుకగా రూ.8 వేల నగదును ఉచితంగా అందిస్తోందని పేర్కొంటూ ఓ నకిలీ సందేశం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ సందేశాన్ని నమ్మి అందులో ఇచ్చిన లింక్‌లను క్లిక్ చేయవద్దని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రజలను హెచ్చరించింది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ గురువారం ఈ అంశంపై ప్రజలకు పలు సూచనలు చేశారు. సైబర్ నేరగాళ్లు ప్రభుత్వ పథకాలు, పండుగ కానుకలు, ఉచిత నగదు బహుమతుల పేరుతో

ప్రజలను ఆకర్షిస్తూ వారి వ్యక్తిగత, బ్యాంకు వివరాలను సేకరించేం దుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అధికారిక ప్రకటనల మాదిరిగా కనిపించే సందేశాలను రూపొందించి ప్రజల్లో నమ్మకం కలిగిస్తున్నా రని పేర్కొన్నారు.

లింక్ క్లిక్ చేస్తే వ్యక్తిగత సమాచారం ప్రమాదంలో పడే అవకాశం

వాట్సాప్‌లో వచ్చే అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయడం ద్వారా సైబర్ నేరగాళ్లు వ్యక్తిగత సమాచారాన్ని సేకరించే ప్రమాదం ఉంది. బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, యూపీఐ పిన్‌లు వంటి కీలక సమాచారాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తారు. ఒక్కసారి వ్యక్తిగత సమాచారం వారి చేతికి చిక్కితే బ్యాంకు ఖాతాల్లోని డబ్బు కోల్పోయే ప్రమాదం ఉందని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా ప్రముఖుల పేర్లు, ఫొటోలు, ప్రభుత్వ శాఖల గుర్తింపులను ఉపయోగించి నకిలీ సందేశాలు పంపుతూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. పండుగ కానుకలు, ఉచిత బహుమతులు, నగదు బదిలీలు అంటూ వచ్చే సందేశాల విషయంలో ప్రత్యేకంగా అప్రమత్తతతో ఉండాలని సూచించారు.

ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింక్‌లను క్లిక్ చేయకూడదు. ఉచితంగా నగదు బహుమతులు ఇస్తామంటూ వచ్చే సందేశాలను వెంటనే నమ్మకూడదు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, యూపీఐ పిన్‌లను ఇతరులతో పంచుకోకూడదు. ప్రభుత్వ పథకాలు, నగదు బహుమతులకు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లలో మాత్రమే పరిశీలించాలి. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ ★1930★కు ఫోన్ చేయాలి. అలాగే వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో సూచించింది. పండుగ వేళ ఉచిత కానుకల పేరుతో వచ్చే మోసపూరిత సందేశాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒక్క క్లిక్‌తో విలువైన వ్యక్తిగత సమాచారం, కష్టార్జిత సంపాదన ప్రమాదంలో పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ధూళికట్ట గ్రామంలో విద్యుత్ శాఖ ముందస్తు చర్యలు.

ఎలిగేడు అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి)

మండలంలోని దూళికట్ట గ్రామంలో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మర్ యాక్షన్ ప్లాను ప్రకారం, గ్రామ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు లో–వోల్టేజ్ సమస్యలను నివారించేందుకు

ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

ధూళికట్ట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 5 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఛార్జింగ్ చేసి అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ సంపత్ కుమార్, సర్పంచ్ మారం కొమురయ్య , లైన్ మెన్ భాస్కర్ వార్డు సభ్యులు మరియు విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

గొల్లపల్లి అభివృద్ధి పనుల కోసం మంత్రిని కలిసిన సర్పంచ్ ...

ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 30 ప్రజా జ్యోతి

ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి కి చెందిన గ్రామ సర్పంచ్ వివిధ అభివృద్ధి పనుల కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు గ్రామంలోని గొల్లపల్లి నుంచి అక్క పెల్లి వరకు నాలుగు కిలోమీటర్ల మేరకు బీటు రోడ్డు నిర్మాణానికి వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి బీబీ రాంజీ నిధులను శివాలయం నుంచి కొత్త కుంట వరకు సీసీ రోడ్డును నిధులను కేటాయించుట కొరకు కలెక్టర్కు లెటర్లాయించడం జరిగిందని గొల్లపల్లి సర్పంచ్ బండ రమేష్ గౌడ్ అన్నారు ఆయన వెంట గొల్లపెల్లి నాయకులు ఉన్నారు

ఘనంగా కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పీతాంబర్రావు పదవీ విరమణ

పాల్గొన్న ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు

సత్తుపల్లి అక్టోబర్ 30(ప్రజా జ్యోతి): సింగరేణి సంస్థ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పీతాంబర్రావు పదవీ విరమణ కార్యక్రమం శుక్రవారం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి సత్తుపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ, ఐఎన్‌టీయూసీ యూనియన్‌లో పీతాంబర్రావు చేసిన సేవలు,

కార్మికుల సంక్షేమం కోసం చేసిన కృషి ఎంతో విలువైనవని కొనియాడారు. ఆయన తన సౌమ్యమైన స్వభావం, మితభాషిత్వం, అందరితో ఆత్మీయంగా మెలిగే తీరుతో కార్మికుల మన్ననలు, అధికారుల గౌరవాన్ని పొందారని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఉద్యోగ బాధ్యతల నుంచి విరమణ పొందినప్పటికీ, ఆయన అనుభవాన్ని, సేవాభావాన్ని కార్మికుల సంక్షేమం కోసం కొనసాగిస్తూ అందరికీ మార్గదర్శకంగా నిలవాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, జనరల్ సెక్రటరీ ఆల్బర్ట్, వివిధ ఏరియాలకు చెందిన సీనియర్ నాయకులు, వైస్ ప్రెసిడెంట్లు, ఫిట్ సెక్రటరీలు, సత్తుపల్లి ఏరియా బ్రాంచ్ సెక్రటరీ మురళీకృష్ణ, ఇక్బాల్, ఫిట్ సెక్రటరీ నాగేష్, ఐ.వి. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజా ప్రభుత్వంలో రేషన్ సేవలో ఆధునికత సర్పంచ్ ఉమారాణి

కల్లూరు, అక్టోబర్ 30 : ప్రజా జ్యోతి
తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం కల్లూరు మండలం లోని పలు గ్రామాల్లో శుక్రవారం

ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తులపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ గుగులోతు ఉమారాణి నాగరాజు, ఉప సర్పంచ్ శీలం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. సర్పంచ్ ఉమారాణి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం నూతన కార్డుల ద్వారా లబ్ధిదారుల వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేసి రేషన్ పంపిణీ సేవలను మరింత పారదర్శకంగా అందించేందుకు చర్యలు చేపట్టిందని అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ రేషన్ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సమర్థవంతంగా ప్రజలకు చేరేందుకే ఈ కార్డులు ఉపయోగ పడుతున్నాయని అన్నారు. అలాగే గోకవరం గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్ర బంజర గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు నాయకులు అధికారుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మారుతి రాము, కాంగ్రెస్ నాయకులు గుమ్మడి రామారావు, మాజీ సర్పంచ్ నల్లగట్ల జమలయ్య, అత్తనూరి సత్యనారాయణ రెడ్డి వార్డు సభ్యులు గుగులోతు ప్రసాద్, సెక్రటరీ భావన, జిపిఓ నాగవేణి ఇందిరమ్మ కమిటీ సభ్యులు గ్రామ కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి తుమ్మల

సత్తుపల్లి అక్టోబర్30(ప్రజా జ్యోతి)
పట్టణంలోని సిద్దారం రోడ్డు లో గల,లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్ నందు పొన్నగంటి యుగంధర్ శ్రీదేవిలా దంపతుల కుమారుడు షణ్ముఖ రాణా

ప్రతాప్ చౌదరి లిఖిత వివాహ వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగినాయి.
అనంతరం రిసెప్షన్ ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై, నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించినారు. నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని దీవించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు,తుమ్మల అభిమానులు ఉన్నారు.

శవ , చిల్లర రాజకీయాలు భట్టి విక్రమార్క నైజాం కాదు

తెల్దరుపల్లి రౌడీలు, గుండాలే రామారావు ని హత్య చేశారు

ఎర్రజెండాని నమ్ముకున్న వ్యక్తిని అ పార్టీ నాయకులే హతమార్చారు

నిజాయితీ పరుడైన రామారావు ఆత్మ క్షోభిస్తుంది

పాతర్లపాడు విలేకరుల సమావేశంలో మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి

చింతకాని అక్టోబర్ 30(ప్రజాజ్యోతి ప్రతినిధి): శవ రాజకీయాలు, చిల్లర రాజకీయాలు చేయడం మా నాయకుడు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నైజాం కాదని, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు మండిపడ్డారు. శుక్రవారం మండల పరిధిలో పాతర్లపాడు గ్రామంలో మాజీ ఎంపిటీసీ బొర్ర ప్రసాదరావు అద్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది పాతర్లపాడు గ్రామంలో సిపిఎం రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు సామినేని రామారావుని హత్య చేసిన విషయం అందరికి తెలిసిందే ఆయనను హత్య చేసిన నిందితులను పట్టుకునేందుకు ఒకపక్క సిపిఎం రాష్ట్ర నాయకులు మరోపక్క కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అందరూ కలిసి పోలీస్ శాఖ వారికి ఫిర్యాదు చేయడం జరిగింది. సిపిఎం నాయకులు అనేక కార్యాలయాల ముందు ధర్నాలు రాస్తారోకోలు కూడా చేసిన పరిస్థితులు మనందరికీ తెలుసన్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క పోలీస్ డిపార్ట్మెంట్ డిజిపి హోదాలో కేసును దర్యాప్తు చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిన విషయం తెలిసిందే అన్నారు. అప్పటినుండి పోలీసు వారు అనేక కోణాలలో దర్యాప్తు మొదలుపెట్టారు. పోలీస్ యంత్రాంగం తో పాటు బెంగళూరు ఫోరెన్సిక్ సైన్స్ అండ్ టెక్నాలజీ సాంకేతిక లాబరేటరీ వారికి సహకారంతో అనేక కోణాలతో విచారణ జరిపించి నిందితులను ఛేదించి పట్టుకొని అరెస్టు చేస్తే.. నిందితులు సిపిఎం

పార్టీ కేంద్ర నాయకుడు అనుచరులేనని విచారణలో తెలగానే దానిని కప్పిపుచ్చుకునేందుకు పాతర్లపాడు గ్రామం వచ్చి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్ నాయకుడు భట్టి విక్రమార్కే ఈ హత్య చేయించాడని. అమాయకులైన తెల్దరుపల్లి వారిని ఖమ్మం పోలీస్ కమిషనర్ అరెస్టు చేశారని. కేసును తప్పు దోవ పట్టిస్తున్నారని మాట్లాడుతుంటే వినటానికి విడ్డూరంగా ఉందన్నారు. దోషులు ఎవరు అనేది పోలీసులు అహర్నిశలు కష్టపడి హంతకలును పట్టుకుని రిమాండ్ చేస్తే వారు తెల్దరుపల్లి కి చెందిన తమ్మినేని వీరభద్రం అనుచరులనీ వారికి అనేక కేసుల్లో నేరచరిత్ర కలిగి ఉన్న రౌడీలు, గుండాలని వారితోనే సొంత పార్టీ నాయకుడైన రామారావుని హత్య చేయించడం జరిగిందని, దీనిని ఈ మండల, జిల్లా, రాష్ట్ర ప్రజలందరూ నమ్ముతున్నారని అనేది తేటతెల్లంగా కనిపిస్తుంది అన్నారు. హత్య రాజకీయాలు మానుకోవాలని పల్లెలన్నీ పచ్చని పంటలతో కళకళలాడాలని ఎలాంటి కక్షలకు కార్పణ్యాలకు తావునివ్వకూడదని దృఢ సంకల్పంతో అభివృద్ధి లో ముందుకు సాగుతున్న బట్టి విక్రమార్క పై ఇలాంటి నిందలు వేయడం మానుకోవాలన్నారు. సొంత తమ్ముడిని హతమార్చిన నేరచరిత్ర కలిగిన సిపిఎం నాయకుడికి రామారావు లాంటి నాయకుడిని హతమార్చడం పెద్ద లెక్క కాదన్నారు. కచ్చితంగా రామరావు లాంటి నిజాయితీ, నిస్వార్ధ నాయకున్ని చంపడం ఆ నిందను గ్రామంలోని అమాయకులపై వేయడం ఆయన ఆత్మ క్షోభిస్తుందని తెలిపారు. ఇప్పటికైనా ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు. చట్టం ఎవరిని వదిలిపెట్టదని దోషులెంతటివారినైనా కచ్చితంగా శిక్షిస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మడిపల్లి భాస్కర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కొప్పుల గోవిందరావు జిల్లా నాయకులు కూరపాటి కిషోర్, మర్కెట్ కమిటి డైరెక్టర్ బందెల నాగర్జున,పెంట్యాల అప్పారావు చింతకాని వందనం సర్పంచులు కిలారి మనోహర్, ఆవుల నాగేశ్వరరావు, గ్రామ శాఖ అద్యక్షులు బొర్ర శేషగిరి రావు, మండల నాయకులు కాండ్ర పిచ్చయ్య యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కంచుమర్తి రామకృష్ణ, తాళ్లూరి బాలాజీ, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, గ్రామ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోనాయిగూడెం లో నీటి దుబారా...!

ప్రజలు నాలుగు రోజులుగా నీటి సరఫరా బంద్. కాంట్రాక్టర్ కు దర్జాగా పంచాయతీ బోరుతో సరఫరా

నేలకొండపల్లి, అక్టోబర్ 30 ప్రజా జ్యోతి: ఒక పక్క ఎల్నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందని అధికారులు ఒక పక్క గ్రామాలలో ప్రజలను చైతన్యం

చూస్తుంటే..ఇక్కడ మాత్రం అందుకు బిన్నంగా ప్రజలకు తాగునీటి ని బంద్ చేసి... ఏకంగా కాంట్రాక్టర్ నిర్మాణాలకు పంచాయతీ బోరు ద్వారా దర్జాగా నీటిని అందిస్తున్నారు. ఇది నేలకొండపల్లి మండలం లోని కోనాయిగూడెం గ్రామ పంచాయతీ లో నీటి దుబారా... గ్రామంలో వీధి కుళాయిల నుంచి నీరంతా వృధాగా పోతుందని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయటంతో... గత నాలుగు రోజులు గా పంచాయతీ ప్రజలకు నీటిని బంద్ చేశారు. కాంట్రాక్టర్ గ్రామంలో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణానికి గురువారం పంచాయతీ మోటారు ద్వారా నీటిని అందిస్తున్నారు.. గ్రామంలో ప్రజలు నాలుగు రోజులు గా నీటి సరఫరా లేక గొంతెండుతుంటే ...కాంట్రాక్టర్ పనులకు నీటి సరఫరా

చేయటం పై స్థానికులు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయనున్నారు. పంచాయతీ మోటారు ద్వారా కాంట్రాక్టర్ పనులకు నీరు ఇస్తున్న వీడియో లు సోషల్ మీడియా లో వైరల్ కావటంతో అధికారులు స్పందించి కాంట్రాక్టర్ కు నీటి సరఫరా ను బంద్ చేయించారు. ఈ విషయం పై మండల పంచాయతీ అధికారి యం. శ్రీనివాసరావును వివరణ కోరగా...సమస్య తమ దృష్టి కి వచ్చిందన్నారు. వెంటనే నీటి సరఫరా ను నిలిపివేసినట్లు తెలిపారు. ప్రజలకు తాగునీటిని అందించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

అయ్యప్ప ఆలయానికి 50వేలు వితరణ చేసిన మువ్వా

సత్తుపల్లి అక్టోబర్30(ప్రజా జ్యోతి)
పట్టణ శివారులో గల శ్రీ హరిహరాత్మజ అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు తెలంగాణ రాష్ట్ర మాజీ ఇరిగేషన్ చైర్మన్, మాజీ డిసిసిబి చైర్మన్ మువ్వా విజయ్ బాబు

ను శుక్రవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు ఏర్పాటు చేసి నారు. ఆలయ అభివృద్ధికి అన్నదానాలకు ఆయన రూ..50వేలు రూపాయలను అయ్యప్ప స్వామి ఆలయానికి విరాళంగా అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దోసపాటి అమరలింగేశ్వర రావు ,గౌరవ అధ్యక్షులు మల్లికార్జున శర్మ, బొంతు శీను ,ఫణి కుమార్, దురిశెట్టి శీను , వెదుళ్ళనాగు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

పిట్టల్లా రాలుతున్న చాపలమార్కెట్ వాసులు..!

మణుగూరు చాపల మార్కెట్ బస్తీ ఇప్పుడు బతుకు మీద భయంతో బతుకుతోంది. ఒకప్పుడు కళకళలాడిన ఆ వీధి ఇప్పుడు శవాల వాసనతో, ఏడుపుల శబ్దంతో నిండిపోయింది. కర్మకాండ పొగ చల్లారకముందే పక్కింట్లో మరో శవం లేస్తోంది. మూడు రోజుల్లో ఐదుగురు, ఒకే ఇంట్లో నలుగురు పిట్టల్లా రాలిపోయారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పిల్లలు స్కూల్ కి వెళ్లాలన్నా, ఆటోలు, బస్సులు ఆ వీధికి రావాలన్నా భయంతో వణికిపోతున్నాయి. మురిగి కాలువలతో మున్సిపాలిటీ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నా కమిషనర్ పట్టించుకోవడం లేదు. అనారోగ్యంతో కొందరు, బతకలేక మరికొందరు చనిపోతున్నా నాయకులు కన్నెత్తి చూడటం లేదు. ఓట్లప్పుడు వచ్చిన నాయకులు, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఒక్కసారి కూడా రాలేదని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా బస్తీకి కీడు వచ్చింది, బొడ్డురాయి వేయకపోతే ఊరే ఖాళీ అవుతుందని, మేము పేదోళ్లం మాకు స్తోమత లేదని ఎమ్మెల్యే గారే వచ్చి బొడ్డురాయి వేయించి ప్రాణాలు కాపాడాలని వేడుకుంటున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. అక్టోబర్ 30, ప్రజాజ్యోతి...
మణుగూరు చాపల మార్కెట్ లో ఇప్పుడు చేపల వాసన లేదు, శవాల వాసనే ఉంది. ఒకప్పుడు బేరాలతో గలగలలాడిన బస్తీ ఇప్పుడు శవాల దిబ్బగా మారింది. తల్లి కొడుకు కోసం ఏడుస్తుంటే, పక్కింట్లో తండ్రి కూతురు కోసం ఏడుస్తున్నాడు. ఏ ఇంట్లో చూసినా పసుపు తాడు తెగిన మహిళ, తల మీద గుడ్డ వేసుకున్న మగాడే కనిపిస్తున్నాడు. పుట్టిన పిల్లాడి నుండి పండు ముసలి వరకు ఎవరినీ వదలడం లేదు. "ఇది రోగమా, శాపమా, కీడా" అర్థం కావడం లేదని ముసలవ్వలు గుండెలు బాదుకుంటున్నారు. చావు భయంతో బస్తీ జనం రాత్రిళ్లు నిద్ర కూడా పోవడం లేదు. ఇలాగే ఉంటే బస్తీలో మనిషి అనే వాడు మిగలడని కన్నీటితో చెబుతున్నారు.

పిట్టల్లా రాలుతున్న ప్రాణాలు.. చాపల మార్కెట్ కు పట్టిన మాయదారి శాపం..!

చాపల మార్కెట్ బస్తీలో వరుస మరణాలు స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. మూడు రోజుల వ్యవధిలోనే ఐదుగురు చనిపోవడం, ఒకే ఇంట్లో నలుగురు ప్రాణాలు కోల్పోవడం చూసి జనం వణికిపోతున్నారు. ఇది సాధారణ మరణం కాదు, మా బస్తీకి ఏదో కీడు వచ్చిందని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పిల్లాడి నుండి పెద్ద వారి వరకు ఎవరినీ వదలకుండా మృత్యువు వెంటాడుతోందని చెబుతున్నారు. ఇంట్లో ఒకరి కర్మకాండ జరుగుతుండగానే పక్కింట్లో మరో చావు జరగడం ఆ బస్తీలో సాధారణమైపోయింది. అనారోగ్యంతో కొందరు, మానసిక ఒత్తిడితో మరికొందరు చనిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ వరుస చావుల వెనుక ఉన్న మర్మాన్ని ఎమ్మెల్యే, అధికారులు తెలుసుకోని తమ ప్రాంతానికి బొడ్డురాయి వేసేలా చూడాలని వేడుకొంటున్నారు. లేదంటే ఊరే ఖాళీ అవుతుందని భయంతో వణికిపోతున్నారు.

స్కూల్ కు వెళ్లాలంటే భయం.. బస్తీకి రావాలంటేనే వణుకుతున్న జనం..!

చాపల మార్కెట్ బస్తీ పేరు చెబితేనే జనం భయంతో వెనక్కి తగ్గుతున్నారు. పిల్లలను స్కూల్ కి పంపితే తిరిగి ఇంటికి వస్తారో లేదో అని తల్లిదండ్రులు కన్నీటితో ఎదురుచూస్తున్నారు. స్కూల్ బస్సు డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు కూడా ఆ వీధిలోకి రావాలంటే భయపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. పెద్దలు పనికి వెళితే తిరిగి వస్తామో లేదో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఒకప్పుడు రద్దీగా

ఉండే ఆ వీధి ఇప్పుడు నిర్మానుష్యంగా, శ్మశాన నిశ్శబ్దంతో ఉందని అంటున్నారు. రాత్రి పూట చిన్న శబ్దం వచ్చినా ఏ ఇంట్లో ఏమయ్యిందో అని జనం బయటకు వచ్చి చూస్తున్నారని, పిల్లలు రాత్రిళ్లు భయంతో నిద్ర పోవడం లేదని తల్లులు చెబుతున్నారు. ఈ భయం నుండి తమను కాపాడాలని, ఎమ్మెల్యే గారు వచ్చి ధైర్యం చెప్పాలని కోరుతున్నారు.

మురిగి కాలువలను పట్టించుకోని మున్సిపాలిటీ..! కమిషనర్ అసలు ఉన్నారా..? అంటున్న జనం..!

చాపల మార్కెట్ బస్తీలో మున్సిపాలిటీ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులుగా మురిగి కాలువలు తీయకపోవడం, చెత్త పేరుకుపోవడంతో దుర్వాసనతో నరకాన్ని తలపిస్తోందని అంటున్నారు. దోమలు, ఈగలతో రోగాలు ప్రబలి జనం అనారోగ్యం పాలవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. కమిషనర్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఒక్క అధికారి కూడా వచ్చి చూసిన పాపాన పోలేదని వాపోతున్నారు. అసలు కమిషనర్ ఉన్నారా, లేరా..? అని జనం ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. మున్సిపాలిటీ శుభ్రం చేయకపోవడం వల్లే రోగాలు వచ్చి చనిపోతున్నారని బస్తీ వాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బస్తిలో వెంటనే కాలువలు శుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లాలని డిమాండ్ చేస్తున్నారు.

ఓట్లప్పుడు వస్తారు.. చావులప్పుడు రారు.. ఎమ్మెల్యే పాయం సార్ ఎక్కడున్నారు...

చాపల మార్కెట్ బస్తీలో ఇన్ని శవాలు లేస్తున్నా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఒక్కసారి కూడా వచ్చి చూడలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓట్ల కోసం వచ్చినప్పుడు మీ బస్తీని బంగారం చేస్తామని హామీలిచ్చిన నాయకులు ఇప్పుడు ఎక్కడికి పోయారని ప్రశ్నిస్తున్నారు. ఇంతమంది పిట్టల్లా రాలిపోతున్నా ఒక్క నాయకుడు కూడా వచ్చి పరామర్శించలేదని కన్నీటితో చెబుతున్నారు. మేము పేదోళ్లం, మాకు బొడ్డురాయి వేసే స్తోమత లేదు, ఎమ్మెల్యే గారే వచ్చి వేయించాలని వేడుకుంటున్నారు. తమ బాధను అర్థం చేసుకుని ప్రజాజ్యోతి పత్రిక తమ గోడును బయటకు తెచ్చిందని, పత్రిక విలేకరికి, పత్రిక ఎండీకి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి తమ బస్తీని సందర్శించి, బొడ్డురాయి వేయించి తమ ప్రాణాలు కాపాడాలని చేతులు జోడించి వేడుకుంటున్నారు. లేదంటే బస్తీలో ఒక్క మనిషి కూడా మిగలదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్వామియే శరణం అయ్యప్ప

చిన్నకోదూరు, అక్టోబరు30, (ప్రజాజ్యోతి): శబరిగిరీషుడా అయ్యప్ప పాటలతో మండల కేంద్రంతో పాటు చౌడారం గ్రామాలు పులకించిపోయాయి. అయ్యప్ప మాలధారణ స్వీకరించిన భక్తులు చౌడారం గ్రామం నుండి కేరళలోని శబరిమలై కి పాదయాత్ర

ప్రారంభించారు.ఈసందర్భంగా గురు స్వామి ఏమిరెడ్డి భూమిరెడ్డి మాట్లాడుతూ దాదాపు రెండు నెలల పాటు పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. నియమ నిష్ఠలతో పాదయాత్ర పూర్తి చేసి శబరిమల వాసుడు అయ్యప్పను దర్శనం చేసుకుంటామన్నారు. భక్తి, ఆధ్యాత్మికతల నడుమ మొదలైన అయ్యప్ప పాదయాత్రకు స్వామియే శరణం అయ్యప్ప అంటూ ఆయా గ్రామాల ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు.

సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్..

మొదటిపేజీ తరువాయి..

సింగరేణి యాజమాన్యం వెల్లడించింది. అయితే ఈ బోనస్ ప్రయోజనాలు అందరికి వర్తించవు. నేషనల్ కోల్ వేజ్ అగ్రిమెంట్ పరిధిలోని కార్మికులకు మాత్రమే బోనస్ అందించనున్నారు. అధికారులకు ఈ బోనస్ వర్తించని స్పష్టం

చేశారు. అర్హత విషయంలోనూ కొన్ని నిబంధనలు కూడా ఉన్నాయి. కనీసం 30 రోజుల పాటు విధులు నిర్వహించిన కార్మికులకే ఈ బోనస్‌కు అర్హులు. ఉద్యోగి పనిచేసిన రోజులను పరిగణనలోకి తీసుకుని చెల్లింపు మొత్తాన్ని నిర్ణయిస్తారు. పూర్తి అర్హత ఉన్నవారికి ప్రకటించిన గరిష్ఠ మొత్తం లభిస్తుంది. ఇక దసరా, దీపావళి బోనస్‌లను కలిపి చూస్తే సింగరేణి కార్మికులకు నెల రోజుల వ్యవధిలోనే భారీ మొత్తంలో ఉంటుంది. రెండు చెల్లింపుల ద్వారా ఒక్కో కార్మికుడికి సగటున రూ. 2.65 లక్షల వరకు అందే అవకాశం ఉంది. ఈ రెండు బోనస్‌ల కోసం సంస్థ మొత్తం సుమారు రూ. 1,020 కోట్లను వెచ్చించనుంది.

సంబంధం విఫలమైతే అత్యాచారం కేసు పెట్టలేరు

కీలక వ్యాఖ్యలు చేసిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, అక్టోబర్ 30(ప్రజాజ్యోతి): ప్రేమ లేదా పరస్పర అంగీకారంతో కూడిన సంబంధాలు విఫలమైన తర్వాత, గతంలో సమ్మతితోనే జరిగిన శారీరక సంబంధాన్ని ఆ తర్వాత అత్యాచారంగా పరిగణించలేమని సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సంబంధాలు బెడిసికొట్టిన తర్వాత వాటిని క్రిమినల్ కేసులుగా మార్చే ధోరణి పెరుగుతోందని ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. నిజంగా అత్యాచారం, బలవంతం లేదా మోసంతో సమ్మతి పొందిన సందర్భాల్లోనే అత్యాచారం ఆరోపణను పరిశీలించాలని స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలు చేస్తూ కేరళకు చెందిన ఓ వ్యక్తిపై నమోదైన అత్యాచారం, మోసం అభియోగాల నుంచి సుప్రీం కోర్టు విముక్తి కల్పించింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. పరస్పర అంగీకారంతో కొనసాగిన సంబంధంలో శారీరక సాన్నిహిత్యం ఏర్పడిన తర్వాత, ఆ సంబంధం విఫలమైందనే కారణంతో దానిని అత్యాచారంగా చిత్రీకరించలేమని ధర్మాసనం పేర్కొంది. ఇలాంటి కేసుల్ని తాము పదే పదే చూస్తున్నామని, విఫలమైన సంబంధాలు ఆ తర్వాత క్రిమినల్ కేసులుగా మారుతున్న ఈ ధోరణి సమాజంలో పెరిగిపోతోందని, ఇది ఆందోళనకరం అని వ్యాఖ్యానించింది. అత్యాచారం, మోసం అనే రెండు ఆరోపణల మధ్య తేడాను స్పష్టంగా గుర్తించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

అత్యాచారం తీవ్రమైన నేరం అని, కానీ ఇలాంటి కేసుల వల్ల నిజంగా లైంగిక వేధింపులు, అత్యాచారానికి గురైన బాధితుల కేసుల తీవ్రత తగ్గిపోతోందని కోర్టు హెచ్చరించింది. గతంలో అంగీకారంతో జరిగిన సంబంధాన్ని, తర్వాత విడిపోయారనే కారణంతో నేరంగా మార్చడం సరికాదని స్పష్టం చేసింది. విడిపోయిన తర్వాత ఒకరి కోపం కారణంగా మరొకరిని నేరస్థుడిగా చిత్రీకరించలేమని ధర్మాసనం ఈ సందర్భంగా అభిప్రాయపడింది. అలాంటి విధానం నిందితుడి వ్యక్తిగత స్వేచ్ఛతో పాటు ప్రతిష్ఠకు కూడా భంగం కలిగిస్తుందని పేర్కొంది. సమ్మతితో కూడిన బంధంలో ఒకసారి భాగస్వామి అయినంత మాత్రాన, తర్వాతి కాలంలో అత్యాచారం ఆరోపణలు వస్తాయనే భయంతో ఆ పురుషుడు ఆ బంధానికే జీవితాంతం కట్టుబడి ఉండాలని భావించడం సమంజసం కాదని సుప్రీం కోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఇలాంటి పరిస్థితుల్లో ఆ బంధం నుంచి బయటకు వచ్చే హక్కు పురుషుడికి ఉండదా?' ఆ నిర్ణయాన్ని మోసంగా ఎలా పరిగణిస్తారు? కచ్చితంగా అది మోసం కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పరస్పర అంగీకారంతో కొనసాగిన ప్రతి సంబంధం విఫలమైనప్పుడు దానిని అత్యాచారం ఆరోపణగా మార్చితే, ఆ నేరం తీవ్రత తగ్గిపోతుందని కూడా పేర్కొంది. ఈ కేసులో పిటిషనర్ కేరళంకు చెందిన వ్యక్తి. తనపై నమోదైన కేసు నుంచి విముక్తి కోరుతూ ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కేరళం హైకోర్టు గతంలో ఆయన డిశ్చార్జ్ పిటిషన్‌ను, క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయాలన్న అభ్యర్థనను తిరస్కరించింది. దీంతో ఆయన అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ కేసులో ఫిర్యాదుదారురాలు గతంలో ఒక వ్యక్తిని వివాహం చేసుకొని విడాకులు తీసుకున్నారు. అనంతరం పిటిషనర్‌తో పరిచయం ఏర్పడింది. అయితే తనకు అప్పటికే వివాహమైందనే విషయాన్ని పిటిషనర్ దాచిపెట్టి తనను మోసం చేసి పెళ్లి చేసుకున్నాడని ఆమె ఆరోపించారు. ఆపై తప్పుడు పద్ధతిలో లైంగిక సంబంధానికి తన సమ్మతిని పొందాడని బాధితురాలు ఆరోపించినట్లు ప్రాసిక్యూషన్ కోర్టుకు తెలిపింది. నిందితుడు తనపై అత్యాచారం, మోసం, నమ్మక ద్రోహానికి పాల్పడ్డాడని ఆమె ఆరోపించినట్లు తెలిపింది. కర్ణాటకలోని మైసూరులో తామిద్దరం వివాహం చేసుకున్నామని, ఆ తర్వాత 1996 నుంచి 2003 వరకు కలిసి కాపురం చేశామని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం హైకోర్టు ఉత్తర్వుల్ని రద్దు చేస్తూ నిందితుడికి కేసు నుంచి పూర్తిగా విముక్తి కల్పించింది.

రాష్ట్రంలో బియ్యం కొరత లేదు

మొదటిపేజీ తరువాయి..

ప్రజలకు భరోసా ఇచ్చారు. తెలంగాణలో బియ్యం ధరలను కంట్రోల్ చేసేందుకు పౌరసరఫరాల శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. బియ్యం ధరల పెరుగుదలపై దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం.. బియ్యం నిల్వలు దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర హెచ్చరికలు చేశారు. ముఖ్యంగా సాధారణంగా ప్రజలు ఎక్కువగా వినియోగించే బీపీటీ రకం బియ్యాన్ని కిలో రూ. 66కు విక్రయించేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. వినియోగదారులపై అదనపు ఆర్థిక భారం పడకుండా ధరలను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాల్పడటం, నిర్ణయించిన ధరల కంటే ఎక్కువకు విక్రయించడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. బియ్యం ధరల నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం 5 శాఖలతో కూడిన ప్రత్యేక తనిఖీలు చేపట్టింది. పౌరసరఫరాలు, పోలీస్, జీఎస్టీ, లీగల్ మెట్రాలజీ వంటి ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు కలిసి రాష్ట్రవ్యాప్తంగా దాడులు నిర్వహిస్తున్నాయి. ఈ తనిఖీల్లో అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు వంటి ఆరోపణలపై ఇప్పటివరకు 12 కేసులు నమోదు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఈ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. ప్రధాన హోల్‌సేల్ మార్కెట్లైన బేగంబజార్, నాంపల్లి, మహారాజ్‌గంజ్ ప్రాంతాల్లో అధికారులు పరిశీలనలు నిర్వహించారు. గోదాముల్లో నిల్వలు, విక్రయ ధరలు, వ్యాపార లావాదేవీలను తనిఖీ చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడే వ్యాపారులను గుర్తించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఈ దాడులు

ప్రత్యేక తనిఖీలు ముమ్మరం చేసింది. శుక్రవారం పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు, రైస్ మిల్లర్లతో అధికారులు జరిపిన చర్చల అనంతరం తీసుకుంటున్న చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అమలు చేస్తున్న ప్రత్యేక తనిఖీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను మంత్రికి వివరించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సాధారణంగా వినియోగించే బీపీటీ రకం బియ్యం ధర కిలోకు రూ. 66 ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. మరోవైపు ఆర్ఎన్ఆర్ బియ్యం ధర విషయంలో నాణ్యత, ఉత్పత్తి వ్యయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని సమీక్షించనున్నారు. మార్కెట్‌లో ధరలు అదుపులోకి వచ్చే వరకు తనిఖీలు కొనసాగుతాయని మంత్రి స్పష్టం చేశారు. అధిక లాభాల కోసం వ్యాపారులు వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తే సహించబోమని మంత్రి ఉత్తమ్ హెచ్చరించారు. బియ్యం నిల్వలను అక్రమంగా దాచడం, బ్లాక్ మార్కెటింగ్‌కు కొనసాగనున్నాయి. తెలంగాణలో బియ్యం నిల్వలు సరిపడా ఉన్నాయని.. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. ధరలు పెరుగుతాయనే భయంతో అవసరానికి మించి బియ్యం కొనుగోలు చేయవద్దని వినియోగదారులకు సూచించారు. మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలను తమ ప్రభుత్వం అడ్డుకుంటుందని భరోసా ఇచ్చారు. రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న సన్నబియ్యాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. ఈ బియ్యం తెలంగాణ రైతులు పండించిన ధాన్యంతోనే రాష్ట్రంలో మిల్లింగ్ చేసి పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. నిజాయితీగా వ్యాపారం చేసే మిల్లర్లు, వ్యాపారులతో ప్రభుత్వం చర్చలు కొనసాగిస్తుందని.. నిబంధనలు ఉల్లంఘించేవారిపై మాత్రం కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. బియ్యం ధరల నియంత్రణ, అక్రమ నిల్వల నిరోధం, వినియోగదారులకు సరసమైన ధరలకు బియ్యం అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా ప్రభుత్వం తనిఖీలను మరింత విస్తరించనుంది.

హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం

మొదటిపేజీ తరువాయి..

ఘట్‌కేసర్, కీసర, అన్నోజిగూడ, దమ్మాయిగూడ, నాగారం, బోడుప్పల్, రాంపల్లి, పీర్జాదిగూడ, మేడిపల్లి, చర్లపల్లిలో ఏరియాల్లో కూడా భారీ వర్షం కురుస్తోంది. పశ్చిమ, దక్షిణ హైదరాబాద్ ప్రాంతాలైన నానక్‌రామ్‌గూడ, మణికొండ, షేక్‌పేట్, టోలీచౌకిలోనూ భారీ వర్షం కురుస్తోంది. అలాగే నాగోల్, సరూర్‌నగర్, ఎల్‌బి నగర్, హయత్‌నగర్, బిఎన్ రెడ్డి, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్, సైదాబాద్, మలక్‌పేట్, రాజేంద్రనగర్, చాంద్రాయణగుట్ట, అబిడ్స్, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, ఎస్ఆర్-బిఎడి, హిమాయత్‌నగర్, నాచారంలో కూడా వర్షం కురుస్తుంది. అయితే ఆఫీస్‌లు వదిలే సమయం కావడంతో వాహనాలన్ని ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో కొన్ని ప్రాంతాల్లో భారీ ట్రాఫిక్ జామ్ నెలకొంది. ముఖ్యంగా ఐటీ కారిడార్ ఏరియాలైన హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం, కొండాపూర్ ఏరియాల్లో భారీ ట్రాఫిక్ జామ్ ఉన్నట్టు సమాచారం. భాగ్యనగరంలో సాధారణంగానే సాయంత్ర వేళ ఆఫీసులు, స్కూళ్లు, కాలేజీలు వదిలే సమయం కావడంతో మామూలుగానే రోడ్లు కిక్కిరిసి ఉంటాయి. దానికి తోడు

ఈదురుగాలులు, వర్షం తోడవటంతో వాహనదారుల కష్టాలు రెట్టింపయ్యాయి. ముందుగా కాప్రా పరిధిలో మొదలైన వర్షం క్షణాల్లోనే నగరమంతటా విస్తరించింది. భారీ గాలులు, ఉరుములు, మెరుపులతో చాలా ప్రాంతాల్లో నగరవాసులను భయాందోళనలకు గురి చేసింది. బహదూర్‌పురాలో అత్యధికంగా 8 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మాదాపూర్‌లో 5.7 సెం.మీ., షేక్‌పేట్‌లో 5.5 సెం.మీ, చార్మినార్‌లో 4.7 సెం.మీ, జూబ్లీహిల్స్ 4.4 సెం.మీ, అత్తాపూర్ 4.3 సెం.మీ, సిఫ్‌నగర్‌లో 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మియాపూర్, చందానగర్, లింగంపల్లి, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, రాయదుర్గం తదితర ప్రాంతాల్లో ఒక్కసారిగా కురిసిన వర్షానికి జనాలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఐటీ హబ్ అయిన మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం పరిసర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షం వల్ల రహదారులపైకి నీరు చేరడంతో వాహనాలు చాలా నెమ్మదిగా కదులుతున్నాయి. రహదారులపై నిలిచిన వాననీటితో ఆయా మార్గాల్లో ప్రయాణించే ఉద్యోగులు, మాదాపూర్ - హైటెక్ సిటీ - కేపీహెచ్‌బీ మార్గంలో మైండ్‌స్పేస్, ఐకియా పరిసర ప్రాంతాల్లో రద్దీ పెరిగి ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. మాదాపూర్ సిటీ వైన్స్ సమీపంలోని ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు చేరింది. రోడ్డుపై నీరు నిలవడంతో ద్విచక్ర వాహనదారులు, ముందుకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. చాదర్‌ఘాట్, మలక్‌పేట, దిల్ సుఖ్‌నగర్, ఎల్బీనగర్- ఉప్పల్, బండ్లగూడ-నాగోల్ రూట్లలో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. యూసఫ్ గూడ పరిధిలోని శ్రీకృష్ణ నగర్ కాలనీని ఎగువ నుంచి వచ్చిన వరద నీరు ముంచెత్తింది. రహదారులన్నీ కాలువలుగా మారాయి. వరద ఉద్ధృతికి ఇళ్ల ముందు పార్క్ చేసిన వాహనాలు కొట్టుకుపోయాయి. సికింద్రాబాద్ పరిధిలోని బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్, బేగంపేటను వర్షం ముంచెత్తింది. ప్యాట్నీ, ప్యారడైజ్, చిలకలగూడ, మారేడుపల్లి ప్రాంతాల్లో వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మల్కాజిగిరి జోన్ కుషాయిగూడ శివసాయి నగర్ కాలనీలో భారీ శబ్దాలతో ఉరుములు, మెరుపులతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. తాటి చెట్టుపై పిడుగుపడి మంటలు వ్యాపించాయి. ఇదే ఏరియాలోని కీసర, రాంపల్లి, దమ్మాయిగూడ, జవహర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో గంటపాటు భారీ వర్షం కురిసింది. భారీ శబ్దాలతో ఉరుములు రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వాననీటితో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు వర్షపునీటితో నిండిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మేడ్చల్ జిల్లా పోచారంలో ఇన్ఫోసిస్ నూతన భవన ప్రారంభోత్సవ వేడుక మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు భవనాన్ని ప్రారంభించిన తరువాత కార్యక్రమంలో పాలొన్నారు. ఇదే సమయంలో భారీ వర్షం కురవడంతో కార్యక్రమాన్ని మధ్యలోనే ఆపేశారు. అటు జవహర్ నగర్‌లో ఎంపీ ఈటల రాజేందర్ జన సంకల్ప సభను కూడా వర్షం ఇబ్బంది పెట్టింది. హైదరాబాద్ నగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో టీజీఎస్పీడీసీఎల్ సంస్థ అప్రమత్తమైంది. నగర పరిధిలోని మూడు సర్కిళ్లలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు సీఎండీ జితీశ్ వీ పాటిల్ తెలిపారు. సంబంధిత అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, ఈఆర్టీ వాహనాలు, ట్రీ కటింగ్ యంత్రాలు, ఇతర అత్యవసర పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలు, సరఫరా అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ తీగలు తెగిపడినా, చెట్లు - కొమ్మలు విద్యుత్ లైన్లపై పడినా వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ తీగలు, స్తంభాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదని, తెగిపడిన తీగలను లేదా విద్యుత్ లైన్లపై పడిన చెట్ల కొమ్మలను స్వయంగా తొలగించే ప్రయత్నం చేయొద్దని హెచ్చరించారు. విద్యుత్ అంతరాయాలపై వినియోగదారులు 24 గంటలూ అందుబాటులో ఉండే టోల్ ఫ్రీ నంబర్ 1912, వాట్సాప్ నంబర్ 8712441912, టీజీఎస్పీడీసీఎల్ మొబైల్ యాప్, అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదులు నమోదు చేయవచ్చని అధికారులు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానిక ఫ్యూజ్ ఆఫ్ కాల్ సిబ్బంది, సంబంధిత ఏఈ, ఏడీఈ, డీఈ, ఎస్ఈ, సీఈ అధికారులకు సమాచారం అందించాలని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని విఠల్‌రావునగర్ సమీపంలో ఓ జెప్టో డెలివరీ బాయ్ ప్రమాదవశాత్తు డ్రైనేజీలో పడిపోయాడు. భారీగా ప్రవహిస్తున్న వరదనీటిలో డెలివరీ బాయ్ అర్జున్‌కుమార్ బైక్‌తో సహా పడిపోయారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అతడిని సురక్షితంగా రక్షించారు. ప్రస్తుతం అతడు క్షేమంగా ఉన్నాడు. శుక్రవారం కురిసిన వర్షానికి అత్తాపూర్‌లోని తేజస్వినగర్ కాలనీలో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న కొన్ని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బకెట్లు, జగ్గుల సహాయంతో నీటిని బయటకు తోడుకున్నారు. వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో కాలనీవాసులు అవస్థలు పడ్డారు.

రక్తదానం "ప్రాణదానం" తో సమానం

పట్టణ భద్రతతో పాటు "ప్రాణదానానికి" భద్రత కల్పిస్తున్న పోలీసులు

పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా 100 మందికి పైగా రక్తదానం

భద్రాచలం, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి): రక్తదానం ప్రాణదానం తో సమానం అని భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల

వారోత్సవాల సందర్భంగా భద్రాచలం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చల్ల రోడ్డులోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 100 మందికి పైగా స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన కలిగి ఉండాలని, అపోహలను వీడి మానవతా దృక్పథంతో రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రజాసేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ సట్ల రాజు, పోలీసు అధికారులు, సిబ్బంది, మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళి, మరో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు జిందా, స్వచ్ఛంద రక్తదాతలు పాల్గొన్నారు.

టాటా ఏఐఏలో బిజినెస్ పార్టనర్‌గా తానికొండ నాగేంద్ర రెడ్డి

టాటా ఏఐఏలో చేరిన నాలుగేళ్లలోనే కీలక స్థానం

ఇన్సూరెన్స్ రంగంలోనూ ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, వేలాది కుటుంబాలకు ఆర్థిక భద్రత

భద్రాచలం, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి): టాటా గ్రూప్‌కు చెందిన టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో చీఫ్ బిజినెస్ లీడర్ స్థాయి నుంచి ప్రతిష్టాత్మక బిజినెస్ పార్టనర్‌గా ప్రమోషన్ పొందిన తొలి కొత్తగూడెం జిల్లా వాసిగా తానికొండ నాగేంద్ర రెడ్డి గుర్తింపు పొందారు. గతంలో వేలాది మంది నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించిన ఆయన, టాటా ఏఐఏలో చేరిన నాలుగేళ్లలోనే ఈ స్థాయికి ఎదిగారు. ఇన్సూరెన్స్ రంగంలోనూ ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వేలాది కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తన కృషి, నాయకత్వ నైపుణ్యాలు, కస్టమర్ల విశ్వాసంతో ఈ ప్రతిష్టాత్మక ప్రమోషన్ సాధించారు. తన ఎదుగుదలకు సహకరించిన టీమ్ లీడర్లు, అడ్వైజర్లకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరింత మంది నిరుద్యోగులకు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని వెల్లడించారు. నాగేంద్ర రెడ్డి విజయంపై సీనియర్ పార్టనర్ సురభి ముకుంద రావు, పోతురెడ్డిపల్లి రామగోపి, కంపెనీ ఉద్యోగులు, తోటి లీడర్లు, అడ్వైజర్లు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

ఉత్తరాఖండ్‌లో కూలిన హెలికాప్టర్

మొదటిపేజీ తరువాయి..

అధికారులు భావిస్తున్నారు. ప్రమాదానికి గురైన హెలికాప్టర్ బద్రీనాథ్ ఆలయ దర్శనం ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందా? అనేది ఇంకా నిర్ధరణ కావాల్సి ఉందన్నారు. హెలికాప్టర్‌తో సంబంధాలు తెగిపోయిన తరువాత, ఘటన జరిగిన ప్రాంతంలో పొగలు పైకి లెచినట్లు అధికారులు గుర్తించారు. అంతకుముందు, హెలికాప్టర్ ప్రమాదం గురించి సమాచారం అందుకున్న స్థానిక యంత్రాంగం వెంటనే రెస్క్యూ ఆపరేషన్ చేపట్టింది. స్థానిక పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్, ఆర్మీ, ఐటీబీపీ సిబ్బందిని ఘటనా స్థలానికి పంపినట్లు అధికారులు పేర్కొన్నారు. హెలికాప్టర్‌ను రంగంలోకి దించి గాలింపు చర్యలు చేపట్టింది. విస్తృత గాలింపు అనంతరం, ఒక కొండపైన హెలికాప్టర్ శకలాలు లభ్యమయ్యాయి. మరోవైపు, ప్రమాదానికి గురైన హెలికాప్టర్ 'ట్రాన్స్ భారత్ ఏవియేషన్' అనే ప్రైవేట్ సంస్థకు చెందినదిగా జిల్లా యంత్రాంగం గుర్తించింది. ఘటన అనంతరం ముందస్తు జాగ్రత్తగా ట్రాన్స్ భారత్ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన అన్ని హెలికాప్టర్లను అధికారులు నిలిపివేశారు. హెలికాప్టర్ అదృశ్యం అయిన తర్వాత ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి స్పందించారు. పరిస్థితిని తాను స్వయంగా పర్యవేక్షిస్తున్నానని, అధికారులతో నిరంతర సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. క్షతగాత్రులను హెలికాప్టర్లలో ఆసుపత్రికి తరలించాలని ఆదేశించినట్లు చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'జోషిమఠ్ సమీపంలోని చాయ్ గ్రామం వద్ద హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. ఈ ఘటనపై జిల్లా యంత్రాంగం, విపత్తు నిర్వహణ శాఖ, ఎస్డీఆర్ఎఫ్ సంయుక్తంగా రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. ప్రయాణికులందరూ క్షేమంగా ఉండాలని దేవుడిని ప్రార్థిస్తున్నా' అని ఆయన ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967